


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

విమానాశ్రయానికి ఏ పేరు పెడదాం?
వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయం కల సాకారం : సిఎం రేవంత్‌రెడ్డి
03

సంపుటి 09, సంచిక: 290 | ఆదివారం | 20-09-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ట్రంప్ గుప్పెట్లోకి గ్రీన్‌లాండ్

## వచ్చేవారం ఐక్యరాజ్య సమితిలో సంతకాలు



- నాటోయేతర దేశాలకు ఏ అధికారాలూ ఉండవు
- ధ్రువీకరించిన డెన్మార్–గ్రీన్‌లాండ్ నాయకులు
- రష్యా–చైనా వ్యతిరేక గోల్డెన్‌డోమ్ ప్రాజెక్టుకు కీలకం

**వాషింగ్టన్ :** గ్రీన్‌లాండ్ భద్రతపై డెన్మార్క్‌తో అమెరికా ఒక ఒప్పందం చేసుకుంది.ఆర్కిటిక్–అట్లాంటిక్ మహాసముద్రాల మధ్య ఉన్న ప్రపంచంలోనే అతిపెద్దదైన ద్వీపం గ్రీన్‌లాండ్ భూభాగం డెన్మార్క్ సామ్రాజ్యంలో ఒక అంతర్భాగం. ఈ ఒప్పందం పేరుతో ఇక గ్రీన్‌లాండ్‌పై అమెరికాకు అపరిమితమైన శాశ్వత అధికారాలు లభిస్తాయి. వచ్చేవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆ వేదికపై అమెరికా, గ్రీన్‌లాండ్, డెన్మార్క్ దేశాల నాయకులు ఒప్పందంపై సంతకాలు చేస్తారు. ఒక మంచి ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని, తామెంతో సంతోషిస్తున్నామని డెన్మార్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్‌సన్ అన్నారు. గ్రీన్‌లాండ్ ప్రధానమంత్రి జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్‌తో కలిసి సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ, ఆర్కిటిక్,ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో మన ఉమ్మడి భద్రతను ఈ ఒప్పందం బలోపేతం చేస్తుందని మెట్టే ఫ్రెడరిక్‌సన్ పేర్కొన్నారు. తమ రాజ్య సార్వభౌమాధికారాన్ని, ప్రజల స్వీయ నిర్ణయాధికారాన్ని కూడా ఈ ఒప్పందం గుర్తిస్తుందన్నారు. ఈ ఒప్పందంపై ఈ రెండు దేశాల నాయకులూ చాలా ఆశాభావంతో, సానుకూల ధోరణితో ఉన్నారు. ఈ భూభాగం డేనిష్ నియంత్రణలో ఉన్నప్పటికీ ఒప్పందం ప్రకారం అమెరికా అక్కడ ఏకపక్ష నిర్ణయాలతో నిర్మాణాలు,కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఇకమీదట అమెరికా అనుమతి లేకుండా గ్రీన్‌లాండ్‌లో ఎవ్వరూ ఎలాంటి సైనిక కార్యకలాపాలుగానీ, సున్నితమైన పెట్టుబడుల ఒప్పందాలుగానీ చేసే అవకాశం లేదు. సోషల్ మీడియా వేదికగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇదే విషయం చెప్పారు. అమెరికా జాతీయ భద్రతపై నెలకున్న ఆందోళన సమస్యను ఈ ఒప్పందం పరిష్కరిస్తుందన్నారు. రష్యా–చైనాకు వ్యతిరేకంగా అమెరికా తలపెట్టిన గోల్డెన్ డోమ్ రక్షణ వలయ ప్రాజెక్టు నిర్మాణానికి ఈ భూభాగం ఎంతోముఖ్యమైనదని ట్రంప్ చెబుతూ వస్తున్నారు. గ్రీన్‌లాండ్ భద్రతపై అమెరికాతో ఒప్పందం కుదిరిందని, ఈ ప్రాంతంలో భద్రతను బలేపేతం చేసే ఒప్పందాన్ని స్వాగతిస్తున్నట్లు డెన్మార్క్,గ్రీన్‌లాండ్ పాలకులు శనివారం పేర్కొన్నారు.వచ్చేవారంలో తరువాయి 8లో



# దేశ వ్యాప్తంగా 15% లోటు వర్షపాతం

- దక్షిణ ద్వీపకల్పంలో 29 శాతం లోటు
- రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి : ఐఎండి

**న్యూఢిల్లీ :** ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది దేశ వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఈ ప్రభావం మెట్ట పంటలపై తీవ్రంగా పడగా, వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు నాలుగు నెలల వర్షాకాల సీజన్ ముగింపు దశకు చేరింది. జూన్ 4న కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు, జూలై 9 నాటికి దేశమంతటా విస్తరించాయి. జూన్ 4 నుండి సెప్టెంబర్ 19 మధ్య దేశవ్యాప్తంగా 15 శాతం వర్షపాత లోటు నమోదైంది. ప్రస్తుతం అత్యంత తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతం దక్షిణ ద్వీపకల్పంలో 29 శాతం లోటు వర్షపాతం రికార్డు అయింది. శనివారం నాటికి పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు ఉపసంహరించున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. రానున్న మూడు నాలుగు రోజుల్లో తరువాయి 8లో

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు త్రిముఖ వ్యూహం

## ఈ ఏడాది 65 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- నిల్వలు.. హమాలీ.. రవాణకు ముందస్తు ప్రణాళిక - జిపిఎస్ ట్రాకింగ్‌తో అక్రమాలకు చెక్
- ఫిజికల్ వెరిఫికేషన్ యాప్‌తో ఆకస్మిక తనిఖీలు-సంసిద్ధమవుతున్న పౌరసరఫరాల శాఖ



ప్రజాపక్షం/ హైదరాబాద్

ఖరీఫ్ సీజన్ (2026–27) ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌరసరఫరాల శాఖ ముందస్తు వ్యూహంతో రంగంలోకి దిగింది. ఈ ఏడాది సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ధేశించుకున్న పౌరసరఫరాల శాఖ అందుకు అనుగుణంగా చర్యలను చేపడుతోంది. కొనుగోళు ప్రక్రియ చివరి వరకు కొనసాగించకుండా కొనుగోళు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని నిర్ణయించింది.అక్టోబర్ మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది.

**ఈ ఏడాది త్రిముఖ వ్యూహం అమలు :**

ధాన్యం కోనుగోలుకు సంబంధించి ప్రతి ఏటా 8,400ల పైచిలుకు ధాన్యం కొనుగలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ హమాలీలతో పాటు గోదాముల్లో నిల్వ, లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతూ ఇటు రైతులు, అటు ప్రభుత్వం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సమస్యను అధిగమించి కొనుగోళు ప్రక్రియ వేగవంతగా కొనసాగేందుకు పౌరసరఫరా శాఖ ఈ ఏడాది ప్రత్యేకంగా నిల్వ–హమాలీ–రవాణా (ఎస్‌హెచ్‌టి)పేరుతో త్రిముఖ వ్యూహం అమలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులు, గోదాముల వరకు ఎక్కడా జాప్యం లేకుండా తరలించడం, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడటం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ఈ వ్యూహం ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలకు సంబంధించి ఈ ఏడాది ముందస్తుగానే ప్రత్యామ్నాయ నిల్వ కేంద్రాల గుర్తించి సిఎపివిధానంలోనూ నిల్వ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. హమాలీల సమస్యలను నివారణకు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం దిగుమతి, బస్తాల్లో నింపడం, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనుల్లో హమాలీల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని హమాలీలను అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. తద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి వచ్చిన తర్వాత అక్కడే నిలిచిపోకుండా.. మిల్లులు, గోదాములకు వేగంగా తరలించడంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.ధాన్యం రవాణాలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ధాన్యం తరలించే ప్రతి వాహనానికి జిపిఎస్ ఆధారిత టిఎల్‌టిఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయనున్నారు. దీంతో వాహనం ఎక్కడి నుంచి బయలుదేరింది.. ఎక్కడికి చేరింది.. మార్గమధ్యంలో ఎక్కడ ఆగింది వంటి వివరాలను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. స్టాక్ డైవర్షన్ వంటి అక్రమాలకు అవకాశం లేకుండా రవాణా వ్యవస్థను తరువాయి 8లో



ఎర్రవల్లిలో

# తుది దశకు రెవెన్యూ సర్వే

## మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన అధికారులు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్

మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్ వ్యవహారంలో కీలకంగా మారిన సర్వే నంబర్ 325లో మూడోరోజు రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించి మూడు గ్రామాల సరిహద్దులు గుర్తించారు. అసైన్డ్ భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుండి సిద్దిపేట జిల్లా రెవెన్యూ అధికారులు, మూడు సర్వే బృందాలతో ప్రభుత్వ భూమి, పట్టా భూమి హద్దులను వేరు చేస్తూ హద్దులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమికి సంబంధించిన పాత మ్యాపులు, ప్రస్తుత ధరణి రికార్డులను తరువాయి 12లో

# ‘22ఎ’ సమస్యలకు త్వరలో ముగింపు

- 12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జిఓ జారీ
- మంత్రి పొంగులేటి వెల్లడి
- ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు ధృవ పత్రాల అందజేత



ప్రజాపక్షం/రంగారెడ్డి

భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని నెరవేరుస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జిఓ 76ను విడుదల చేశామన్నారు. శనివారం ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పొంగులేటి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి ఆధార్ వలే భూధార్ కార్డులు ఇస్తామని, క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ముఖ్యమంత్రి సూచనలు, 12 అంశాల మేరకు ఎల్.బి.నగర్ తరువాయి 8లో

నందిగ్రామ్ ఉప ఎన్నికల వేళ

# కాంగ్రెస్ అభ్యర్థి ప్రధాన్ అరెస్టు



## అక్టోబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపిన స్థానిక కోర్టు

**హల్దియా :** పశ్చి బెంగాల్‌లో అధికార బిజెపి హత్యారాజకీయాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై గతంలో ఉన్న కేసులను తవ్వితీస్తూ వారిని జైళ్లకు పంపుతోంది. 19 ఏళ్ల నాటి హత్యతో సహా పలు అభియోగాలపై కాంగ్రెస్ నందిగ్రామ్ ఉప ఎన్నికల అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పర్చగా, అతనికి స్థానిక కోర్టు అక్టోబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. శుక్రవారం అరెస్టు అయిన ప్రధాన్‌ను హల్దియా సబ్‌డివిజనల్ కోర్టులో హాజరుపరిచారు. నందిగ్రామ్‌లో 2007 నాటి భూసేకరణ వ్యతిరేక ఉద్యమ సమయంలో నమోదైన అల్లర్లు, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన బెయిల్ రాని కేసులలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన్‌ను, పెండింగ్‌లో ఉన్న నాలుగు అరెస్టు వారెంట్ల ఆధారంగా అరెస్టు చేసినట్లు పశ్చిమ బెంగాల్ పోలీసులు తెలిపారు. ఆయనపై ఆయుధ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కూడా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రధాన్ తరపు న్యాయవాది మాట్లాడుతూ ‘నందిగ్రామ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించిన మూడు వారెంట్ల విషయంలో కోర్టు మిలన్ ప్రధాన్‌ను 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఖేజురి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి జారీ అయిన నాలుగవ వారెంట్ విషయంలో సోమవారం ఆయనను కాంటై కోర్టులో హాజరుపరుస్తారు’ అని చెప్పారు. ‘గత 19 ఏళ్లుగా ప్రధాన్ పరారీలో ఉన్నారని, పోలీసులు ఆయన ఆచూకీ కనుగొనలేకపోయారని ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. ఇప్పుడు ఆయన ఆచూకీ దొరకడం వల్లే అరెస్టు చేశామని వారు పేర్కొన్నారు’ అని ఆయన తెలిపారు. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన కొద్ది గంటలకే ఈ అరెస్టు జరిగింది. అంతకుముందు ఆమె వర్గానికి చెందిన అభ్యర్థి సంచితా ప్రధాన్ దే పోటీ నుంచి తప్పుకున్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే ఈ కేసును వాడుకుంటున్నారని కాంగ్రెస్, మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ వర్గం ఆరోపించాయి.



## యువత జీవితాలలో వెలుగులు

# నింపేందుకే మెగా జాబ్‌మేళా

- 350కి పైగా కంపెనీ ప్రతినిధులు హాజరు
- రూ.10వేల కోట్లతో ఉమ్మడి జిల్లా అభివృద్ధి చేస్తున్నాం : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/కోదాడ

మూడున్నర దశాబ్దాలుగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలు తనను తన సతీమణి పద్మావతిని గుండెల్లో పెట్టుకుని ఎమ్మెల్యేలుగా గెలిపించారని, వారి రుణం తీర్చుకునేందుకు ఇక్కడి గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశామని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కోదాడలోని సిసిరెడ్డి విద్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో తరువాయి 8లో

భారత్ – అమెరికా

# వాణిజ్య సంబంధాల్లో ఒడిదుడుకులు



**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా మధ్య వాణిజ్య సంబంధాల్లో చాలా ఒడిదొడులకు కొనసాగుతున్నాయి. గతకాలపు అధ్యక్షుల హయాంలో అమెరికాకు వాణిజ్య వస్తువులను ఎగుమతి చేసే ప్రపంచ దేశాలు భారీ సుంకాలు వసూలు చేసి దోచుకున్నాయని, దీనివల్ల రాబడి కంటే ఎక్కువ సుంకాలు చెల్లించి అమెరికా నష్టపోయిందని, ఈ పరిస్థితిని చక్కదిద్దుతానని ట్రంప్ ప్రకటించారు. ఈ దిద్దుబాటు చర్యను విముక్తి దినంగా పేర్కొన్నారు.అమెరికాతో వ్యాపారంచేసే తరువాయి 12లో

హోంశాఖ పరిశీలనలో విజయన్‌పై

# ఎఫ్ఐఆర్ నమోదు

- కేరళం హోం మంత్రి రమేష్ చెన్నితల వెల్లడి
- సిపిఐ(ఎం) లక్ష్యంగా జరుగుతున్న దాడి : ఎం.ఎ. బేబీ



**పతానంతిట్ట :** కేరళం అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి, అల్లుడు, ఎమ్మెల్యే పి.ఎ. మహమ్మద్ రియాస్‌లపై అవినీతి కేసు నమోదు చేయాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయమై అడ్వకేట్ జనరల్ నుండి చట్టపరమైన అభిప్రాయం తమకు అందిందని కేరళ హోం మంత్రి రమేష్ చెన్నితల తెలిపారు. ‘ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్’ (పిఎంఎల్ఎ) కింద జరిపిన దర్యాప్తు, సోదాలలో సేకరించిన ‘సాక్ష్యాల‘ ఆధారంగా, ఆరోపిత ‘కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) లంచం కేసులో విజయన్, వీణ, రియాస్, మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఇడి ఇటీవల రాష్ట్ర పోలీసు చీఫ్ రావడ ఎ. చంద్రశేఖర్‌కు లేఖ రాసింది. ఐడి కన్సల్టెన్సీ సేవల ముసుగులో సిఎంఆర్ఎల్, వీణకు చెందిన ప్రస్తుతం మూతపడిన ‘ఎక్సలాజిక్ సొల్యూషన్స్’ సంస్థకు రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఇడి ఆరోపించింది. కాగా, శనివారం పతానంతిట్టలో విలేకరులతో చెన్నితల మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం ఆ చట్టపరమైన అభిప్రాయం తమకు అందిందని, తరువాయి 12లో



# సుప్రీంకోర్టుకు దానం

**హైదరాబాద్ :** తనపై అనర్హత వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దానం నాగేందర్ శనివారం మధ్యాహ్నం పిటిషన్ ఫైల్ చేశారు. సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. శుక్రవారం దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. అయితే ఇప్పటికే బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. అనర్హతపై దానం నాగేందర్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే అవకాశం ఉండడంతో ముందుగానే కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేస్తే తమ వాదన వినాలని కెవియట్ పిటిషన్ వేసింది.




## ల్యాబ్‌లో వజ్రాల తయారీ!




ల్యాబ్‌లలో తయారు చేస్తున్న కృత్రిమ వజ్రాలకు ఇప్పుడు డిమాండ్ పెరుగుతున్నది. వీటిని 'ల్యాబ్ గ్రౌన్ డైమండ్స్' (ఎల్‌జిడి)గా పేర్కొంటారు. సహజ వజ్రాలకు ప్రత్యామ్నాయంగా ఇవి ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పొందుతున్నాయి. సహజ వజ్రాల తవ్వకంతో పర్యావరణ నష్టం, కార్మికుల భద్రత, మానవ హక్కు లు, సంఘర్షణలకు నిధుల సమకూర్పు వంటి స మస్యలు ముడిపడి ఉండటంతో ఈ సాంకేతికతకు ఆదరణ పెరుగుతోంది. ల్యాబ్‌లో తయారైన వజ్రాలు సహజ వజ్రాల మాదిరిగానే స్వచ్ఛమైన కార్బన్ స్ఫటిక నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. వాటి భౌతిక, రసాయన లక్షణాలు కూడా సహజ వజ్రాలతో సమానంగా ఉంటాయి. అయితే సహజ వజ్రాల మాదిరిగా భౌగోళికంగా అరుదైనవి కావు. ఎల్‌జిడిలను ప్రధానంగా రెండు పద్ధతుల్లో తయారు చేస్తారు. అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత (హెచ్‌పిహెచ్‌టి) పద్ధతి భూమి అంతర్భాగంలోని పరిస్థితులను అనుకరిస్తుంది. కెమికల్ వేపర్ డిపాజిషన్ (సివిడి) పద్ధతిలో వజ్రపు చిన్న విత్తనంపై కా ర్బన్ పొరలను క్రమంగా పేరుకునే లా చేస్తారు. సాంకేతికత అభివృద్ధితో వీటి తయా రీ వ్యయం కూడా తగ్గుతోంది. భారతదేశం ఎల్‌జిడి రంగంలో స్వదేశీ సాంకేతిక సా మర్థ్యాన్ని పెంచుతోంది. 2023–24 కేంద్ర బడ్జెట్‌లో పరిశోధనకు ప్రాధాన్యం ఇ చ్చింది. ఐఐటి మద్రాస్‌లో రూ. 243 కో ట్లతో 'ఇండియా సెంటర్ ఫర్ ల్యాబ్ గ్రౌన్ డైమండ్'ను ఏర్పాటు చేసింది. వజ్రాల కటింగ్, పాలిషింగ్‌లో ప్రపంచ కేంద్రంగా ఉన్న భారత్‌కు ఎల్‌జిడి తయారీ సాంకేతికత మరింత వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని అందిస్తోంది.

## ప్రపంచవ్యాప్తంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు


పసిఫిక్ మహాసముద్రంలో మరోసారి శక్తివంతమైన ఎల్ నినో పరిస్థితులు వేగంగా బలపడుతున్నాయి. ఇది ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావంతో వేడెక్కుతున్న ప్రపంచాన్ని మరింత తీవ్ర పరిస్థితులను సృష్టించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. బలపడుతున్న ఎల్ నినో కారణంగా రాబోయే నెలల్లో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దీనితో పాటు దీర్ఘకాలం కొనసాగే తీవ్రమైన వేడి తరంగాలు (హీట్‌వేవ్‌లు), అడవి మంటలకు అనుకూల పరిస్థితులు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరువు ఏర్పడే ప్రమాదం పెరగవచ్చు. అయితే ఎల్ నినో ప్రభావం ప్రపంచంలోని ప్రతి ప్రాంతంపై ఒకే విధంగా ఉండదు. కొన్ని దేశాలు అధిక వర్షాలు ఎదుర్కొంటే, మరికొన్ని దేశాలు వర్షాభావంతో ఇబ్బందులు పడవచ్చు. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగగా, మరికొన్ని ప్రాంతాల్లో ప్రభావం స్వల్పంగా ఉండవచ్చు. ఎల్ నినో ప్రభావం బలపడుతున్న కొద్దీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు మరింత తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉందని అంటున్నారు.



## వాతావరణ మార్పుతో పెరుగుతున్న జీవన వ్యయం!

మనిషి ఆర్థిక పరిస్థితులతో వాతావరణానికి దగ్గర సంబంధం ఉందనే విషయం ఇటీవల కాలంలో స్పష్టమవుతున్నది. వాతావరణ మార్పు అనేది కేవలం భవిష్యత్తులో ఎదురయ్యే పర్యావరణ సమస్య మాత్రమే అనుకునే రోజులు పోయాయి. ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్న ఆర్థిక సమస్యగా వాతావరణ పరిణామాలు మారుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అనిశ్చిత వర్షపాతం, కరువులు, వరదలు, వేడి తరంగాలు ప్రజల జీవన వ్యయాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ముఖ్యంగా పేదలు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు ఈ ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగం వాతావరణ మార్పుకు అత్యంత ఎక్కువగా ప్రభావితమవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం, అనియంత్రిత రుతుపవనాల వల్ల పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా ఆహార పదార్థాల ధరలు పెరుగుతున్నాయి. భారత వినియోగదారుల ధరల సూచీలో (సిపిఐ) ఆహార పదార్థాల వాటా దాదాపు 46 శాతం ఉండటంతో, వ్యవసాయ రంగంలో ఏర్పడే ఏ సంక్షోభమైనా నేరుగా ద్రవ్యోల్బణాన్ని పెంచుతోంది. అదేవిధంగా, ఉష్ణ తరంగాల కారణంగా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు, కూలర్ల వినియోగం అధికమవడంతో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ అదనపు భారాన్ని విద్యుత్ సంస్థలు వినియోగదారులపై అధిక ఛార్జీల రూపంలో మోపుతున్నాయి. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరుగుతున్నాయి. నీటి కొరత కూడా మరో ప్రధాన సమస్యగా మారింది. భూగర్భ జలాలు తగ్గిపోవడం, వర్షపాతం అస్థిరంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. పట్టణాల్లో ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడటం వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. వాతావరణ మార్పు ఆరోగ్య సమస్యలను కూడా పెంచుతోంది. వేడి సంబంధిత వ్యాధులు, గాలి కాలుష్యం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు పెరగడంతో వైద్య ఖర్చులు అధికమవుతున్నాయి. ముఖ్యంగా రోజువారీ కూలీలకు అనారోగ్యం అంటే ఆదాయం కోల్పోవడమే. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాలు, హరిత బడ్జెట్ విధానాలు, రైతులకు మెరుగైన బీమా, వేడి తరంగాలపై చట్టబద్ధ రక్షణ, నీటి నిర్వహణ సంస్కరణలు అవసరం. వాతావరణ న్యాయం, సామాజిక సమానత్వం, సుస్థిర అభివృద్ధిని కలిపి ముందుకు సాగినప్పుడే భారతదేశం ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోగలదు.

## భారీ జెల్లీఫిష్‌లు!



చాలా జెల్లీఫిష్‌లు ఒక బకెట్‌లో సులభంగా ఇమిడిపోయేంత చిన్నవిగా ఉంటాయి. అయితే ఒక జాతి మాత్రం వాటన్నింటికీ భిన్నంగా నిలుస్తుంది. 'లయన్స్ మేన్' అనేది ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద జెల్లీఫిష్. దీని టెంటకిల్స్ 120 అడుగుల (36 మీటర్లు) కంటే ఎక్కువ పొడవు పెరుగుతాయి. ఈ పొడవు భూమిపై అతిపెద్ద జంతువైన వయోజన నీలి తిమింగలం (బ్లూ వేల్) పొడవుకన్నా ఎక్కువ. దీని గంటాకార శరీర భాగం (బెల్) కూడా 7 అడుగుల (2 మీటర్లు) కంటే ఎక్కువ వ్యాసంతో పెరుగుతుంది. అందుకే ఇది సముద్రంలో కనిపించే అత్యంత అసాధారణ జీవుల్లో ఒకటిగా నిలిచింది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, ఆర్కిటిక్ మహాసముద్రంలోని చల్లటి జలాల్లో నివసించే ఈ జెల్లీఫిష్, వేలాది విషసూదులతో కూడిన తన టెంటకిల్స్ సహాయంతో చేపలను, ఇతర చిన్న సముద్ర జీవులను వేటాడుతుంది. ఇంత భారీ పరిమాణం ఉన్నప్పటికీ, సముద్ర ప్రవాహాలకు అనుగుణంగా నెమ్మదిగా తేలుతూ సాగిపోతుంది. అలల కింద దీని దృశ్యం ఒకవైపు అద్భుతంగా కనిపిస్తే, మరోవైపు భయానకంగా కూడా అనిపిస్తుంది. సముద్ర జీవుల్లో దీని స్పర్శశృంగాల పొడవుకు సాటి వచ్చే జీవులు చాలా అరుదు. అందువల్ల ఇది జలాంతర్గామి ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన మహాకాయ జీవుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# బెంగాల్‌లో ఇసి తొండాట!

ఫుట్‌బాల్ ఆటలో తొండి జరగకుండా చూడాల్సిన బాధ్యత రెఫరీది. ఎన్నికల మైదానంలో అభ్యర్థులందరికీ సమాన అవకాశం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది . కానీ, 'నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు' అన్నట్లుగా పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల్లో ఇసి తన తటస్థ పాత్రను పక్కనపడేసింది. అధికార బిజెపి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను ఏకంగా తన భుజస్కంధాలపై ఎత్తుకున్నట్లు జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నాయి. నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ గడువుకు రెండు రోజుల ముందు ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీని, గడ్డి పూల ఎన్నికల గుర్తుపై పోటీ చేయకుండా తాత్కాలికంగా నిలిపివేస్తూ సెప్టెంబర్ 17 రాత్రిపూట ఇసి తరఫున ఉత్తరువులు జారీ అయ్యాయి. ఉప ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా పార్టీ పేరు, ఎన్నికల గుర్తులను 14 గంటల్లో తమకు పంపాలని పార్టీ వ్యవస్థాపకురాలు మమతా బెనర్జీ, చీలిక వర్గ నేత రీతాబ్రత బెనర్జీకి తాఖీదులు పంపింది. మమతా బెనర్జీ పంపిన మూడు ప్రతిపాదనల నుంచి మమతా ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అనే పేరును, ఫుట్ బాల్‌తో ఆడుతున్న క్రీడాకారుడి ఎన్నికల చిహ్నాన్ని ఎన్నికల సంఘం కేటాయించింది. ప్రత్యర్థి శిబిరానికి డెమొక్రాటిక్ ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పేరు, ఎన్వలప్ గుర్తును ఖరారు చేశారు. గతంలో మహారాష్ట్రలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఒక వర్గానికి ఉద్ధవ్ శివసేన, మరో వర్గానికి షిండే శివసేన అనే పేర్లు ఖరారయ్యాయ. కానీ బెంగాల్‌లో చీలిక వర్గానికి నేతృత్వం వహిస్తున్న రీతబ్రత తన పేరును పార్టీకి ముందు లేదా వెనుక పెట్టుకునే సాహసం చేయలేకపోయారు. ఇది ఆ వర్గంలో ప్రజామోదం పొందబోమనే భయాన్ని చెప్పకనే చెబుతోంది.

ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 9న ప్రారంభమై, 16 వరకు సాగింది. సెప్టెంబర్ 17న నామినేషన్‌ల పరిశీలన, 19న ఉపసంహరణకు గడువును విధించారు. అక్టోబర్ 6న పోలింగ్ జరగనుంది. అంటే, కొత్త గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు మమతా టిఎంసికి పట్టుమని 20 రోజుల సమయం కూడా లేదు. అయినప్పటికీ మమతా బెనర్జీ పట్ల ప్రజల్లో సానుభూతి ఉందేమోననే సందేహం బిజెపిలో నెలకొంది. ఆమె పార్టీకి కనీసం అభ్యర్థులు లేకుండా ముఖ్యమంత్రి సువేంధు అధికారి పన్నాగం పన్నారు. ఆయనతో భేటీ అయిన వెంటనే నందిగ్రామ్‌లో టిఎంసి అభ్యర్థి సంచితా ప్రధాన్ నామినేషన్‌ను ఉపసంహరించుకుంది. వెంటనే కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మమత తమ పార్టీ మద్దతును ప్రకటించారు. అయినా, సువేంధు ప్రభుత్వం పట్టువీడలేదు. 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమంలో పెట్టిన పాత కేసును తొవ్వి మిలన్ ప్రధాన్‌ను అరెస్టు చేశారు. ఆయనకు కోర్టు 14 రోజుల కస్టడీ విధించడం ద్వారా ఎన్నికల ప్రచారానికి వెళ్లకుండా అయింది. మరోవైపు రెజీనగర్‌లో సైతం మమతా బెనర్జీ పార్టీ అభ్యర్థి రబీయుల్ ఆలం చౌధురి పార్టీ కార్యకర్తలను ప్రత్యర్థులు వేధిస్తున్నారని, కొత్త గుర్తు ప్రచారానికి సరిపడా సమయం లేదనే కారణాలతో నామినేషన్ ఉపసంహరించుకోనున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. మమతా బెనర్జీ రంగంలో దిగి ఆయనతో మాట్లాడి బరిలో ఉండేందుకు ఒప్పించారు.

ఇక ఎన్నికల కమిషన్ విషయానికి వస్తే, ప్రపంచంలోనే అత్యధిక ఓటర్లు కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తోందనే ఘనత దానికి ఉండేది. రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకారం భారత ఎన్నికల సంఘాన్ని రాష్ట్రపతి నియమిస్తారు. ఇది స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టి.ఎన్.శేషన్ వ్యవహరించిన కాలంలో ఎన్నికల సంఘం శక్తి, ప్రభావం రాజకీయ పార్టీలకు, దేశ ప్రజలకు అర్థమైంది. అంతటి బలం కలిగిన ఎన్నికల కమిషన్ అధికార పక్షం చేతిలో కీలు బొమ్మగా మారిపోయింది. గత పార్లమెంటు ఎన్నికలకు ముందు నుంచి ఇసి తీసుకుంటున్న నిర్ణయాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి, ప్రధాని నరేంద్ర మోదీకి వంతపాడుతున్నట్లుగా ఉన్నాయి. తానే స్వయంగా ప్రతిపక్షాల గొంతు నులిమిన సందర్భాలెన్నో. అందుకు శివసేన, ఎన్‌సిపిల చీలిక వర్గాలకే అసలు పార్టీని, ఎన్నికల చిహ్నాలను కట్టబెట్టి, ఆ పార్టీల వ్యవస్థాపకులనే పరాయివారిగా చేసిన ఉదంతాలను చూశాం. బిజెపి ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో 'సర్' పేరిట గంపగుత్తగా ఓట్లు తొలగించి, కాషాయ పార్టీ అప్రజాస్వామికంగా ఎన్నికలను దొంగిలిస్తున్న వైనాన్ని పశ్చిమబెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాలలో ప్రజలకు అనుభవమే. టిఎంసి నుంచి బైటికెళ్ళిన ఎంఎల్‌ఎలు తమదే అసలైన పార్టీ అని చెప్పుకుంటుంటే, వారితో పాటు బైటికెళ్ళిన ఆ పార్టీ ఎంపిలు అనామక ఎన్‌సిపిఐ పార్టీలో విలీనమై విచిత్ర విన్యాసాలు చేస్తున్నారు. ఉప ఎన్నికల ముందైనా ఎవరిది అసలైన పార్టీయో తేల్చి, పార్టీని, గుర్తును వారికి కేటాయించాలని మమతా బెనర్జీ మొర పెట్టుకుంది. ఇవేవి కనపడకుండా, వినపడకుండా ఎన్నికల కమిషన్ కళ్ళూ, చెవులు మూసుకుంది. స్వయంగా ప్రతిపక్షాల కాళ్ళలో కట్టెలు పెడుతున్న ఎన్నికల సంఘం తొండాటను దేశ ప్రజలు మరిచిపోరు.

# భారతదేశ నినాదంగా మారిన 'బద్లావ్ జరూరీ హై'



డి.రాజా,
సిపిఐ ప్రధాన కార్యదర్శి

సిపిఐ చేపట్టిన 'బద్లావ్ జరూరీ హై' ప్రచారోద్యమంలో భాగంగా జరిగిన భారీ సమీకరణ ఒక విషయాన్ని నిస్సందేహంగా స్పష్టం చేసింది. మార్పు కోసం పిలుపు ఇకపై రాజకీయ పార్టీలకు లేదా పార్లమెంటరీ చర్చలకు మాత్రమే పరిమితం కాబోదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అభద్రత, అసమానతలు, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు, క్రమపద్ధతిలో ప్రభుత్వ సంస్థలను బలహీనపర్చటం వంటి వాటిని ఎదుర్కొంటున్న లక్షలాది మంది భారతీయుల ప్రత్యక్ష అనుభవాల నుండి ఇది ఉద్భవిస్తోంది. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో సెప్టెంబర్ 1న జరిగిన ర్యాలీ ఆ భావనకు ఒక శక్తిమంతమైన వ్యక్తీకరణ. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, వివిధ రాష్ట్రాల ప్రజల భాగస్వామ్యం భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ బలాన్ని మాత్రమే కాకుండా, ప్రజల పోరాటాలలో పాతుకుపోయిన రాజకీయాల నిరంతర ప్రాసంగికతను కూడా ప్రదర్శించింది. ఈ సమీకరణను విడిగా చోటు చేసుకున్న సంఘటనగా కాకుండా, ఒక పెద్ద రాజకీయ జోక్యానికి నాందిగా అర్థం చేసుకోవాలి. మార్పు అవసరం. ఎందుకంటే, అసమానతలను సృష్టించే వ్యవస్థలు మరింత బలంగా పాతుకుపోయాయి. భారతదేశ సంక్షోభం కేవలం పేలవమైన పరిపాలన లేదా పరిపాలనా వైఫల్యానికి సంబంధించినది కాదు. దీని మూలాలు వర్గం, కులం, పితృస్వామ్యంలో లోతుగా వేళ్ళూనుకొని ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో అనుసరించిన ఆర్థిక విధానాలు కార్పొరేట్ కేంద్రీకరణను బలోపేతం చేసి, కార్మిక రక్షణలను బలహీనపరిచి, అధిక ఆర్థిక నష్టభయాలను కార్మికులు, సాధారణ కుటుంబాలపైకి బదలాయించాయి.

ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ విధానాలు విద్య, ఆరోగ్య సంరక్షణ, ఇతర నిత్యావసర వస్తువుల కొనుగోలు శక్తిపై ప్రభావం చూపాయి.సంక్షేమ రాజ్యం అనే భావన భారత రాజ్యాంగ చట్రానికి కొత్తేమీ కాదు. ఇది ప్రభుత్వ విధాన ఆదేశిక సూత్రాలలో స్పష్టంగా వ్యక్తీకరించబడింది. ఇతర విషయాలతో పాటు, 'పౌరులకు స్త్రీ, పురుషులకు సమానంగా, తగిన జీవనోపాధి హక్కు' ఉండే విధంగా చూడాలని ఆర్టికల్ 39 ప్రభుత్వాన్ని నిర్దేశిస్తుంది. ఇది సామాన్య ప్రజల మేలు కోసం భౌతిక వనరుల పంపిణీకి పిలుపునిస్తుంది. సంపద, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు వ్యతిరేకంగా హెచ్చరిస్తుంది. ఈ రాజ్యాంగ దార్శనికతకు, ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి పాలనలో దేశం పయనిస్తున్న దిశకు మధ్య దూరం అంతకంతకూ స్పష్టమవుతోంది. సంక్షేమ రాజ్యం క్షీణిస్తుండగా, ఆర్థిక అభద్రత పెరుగుతోంది. కాబట్టి, దేశం ముందున్న ప్రశ్న, కేవలం భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందా? లేదా? అనేది మాత్రమే కాదు. ఆ వృద్ధితో ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? దాని వ్యయాలను ఎవరు భరిస్తున్నారు? ఆ ఆర్థిక వ్యవస్థ సామాన్య ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడుతుందా, లేదా? అనేది కూడా. సమానత్వానికి కులం మరో మౌలిక అవరోధంగా మిగిలిపోయింది. అది భూమి, విద్య, ఉపాధి, ఆత్మ గౌరవం, సామాజిక అధికారం పొందే అవకాశాలను ప్రభావితం చేస్తూనే ఉంది. ''మీరు ఎటు వైపు మళ్ళినా, మీ దారికి అడ్డంగా వచ్చే రాక్షసి కులమే'' అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాడు చేసిన హెచ్చరిక నేటికీ బలంగా వర్తిస్తుంది. ఆర్థిక పరివర్తన గురించి చర్చిస్తున్నప్పుడు కులాన్ని ఒక ద్వితీయ సామాజిక సమస్యగా పరిగణించలేము. అది అవకాశాలను నిర్ణయిస్తుంది, సామాజిక హోదాను నిర్ధారిస్తుంది. తరతరాలుగా అసమానతలను పునరుత్పత్తి చేస్తుంది.

ఈ వ్యవస్థలతో పాటే పితృస్వామ్యం కూడా పని చేస్తుంది. ఆర్థిక వ్యవస్థలో, ప్రజా జీవితంలో మహిళల భాగస్వామ్యం పరిమితంగానే ఉంది. వేతనం లేని శ్రమ విలువకు తక్కువ అంచనా కట్టడం, హింస, వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. ''ఒక సమాజం సాధించిన పురోగతిని, ఆ సమాజంలో మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను అంచనా వేస్తాను'' అని సామాజిక పురోగతికి అంబేద్కర్ అంతే శక్తివంతమైన కొలమానాన్ని అందించారు. ఒక సమాజ జనాభాలో సగం మంది సమానత్వానికి సంబంధించిన వ్యవస్థాగత అడ్డంకులను ఎదుర్కొంటున్నప్పుడు, ఆ సమాజం అర్థవంతమైన పురోగతిని సాధించామని చెప్పుకోలేదు.

## తదుపరి కార్యాచరణ ఏమిటి?

అందుకే, వామపక్షాల ప్రత్యామ్నాయం అనేది వర్గం, కులం, పితృస్వామ్యాన్ని కలిపి ఎదుర్కోవాలి. మతపరమైన విభజనను ఈ విస్తృత రాజకీయ సందర్భం నుంచి వేరు చేయలేము. వేతనాల కోసం ఇబ్బంది పడుతున్న ఒక కార్మికుడిని మరో సముదాయాన్ని నిందించేలా ప్రోత్సహించవచ్చు. ఉద్యోగం దొరకని ఒక యువకుడికి ఆర్థిక అవకాశం చూపే బదులుగా మతపరమైన సాకులు చూపవచ్చు. అందించవచ్చు. వివక్షతను ఎదుర్కొంటున్న ఒక దళిత లేదా ఆదివాసీ పౌరుడికి, మత ఐక్యత కోసం సామాజిక అన్యాయంపై మౌనం అవసరమని చెప్పవచ్చు. సమానత్వం కోరుతున్న మహిళలను సంస్కృతి పేరుతో సాంప్రదాయ క్రమపద్ధతిని అంగీకరించమని అడగవచ్చు. ఫలితం ఊహించదగినదే. ఉమ్మడి భౌతిక ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు ఒకరినొకరు శత్రువులుగా చూసుకునేలా ప్రోత్సహించబడతారు. ఈ తర్కాన్ని తిప్పికొట్టి, సామాన్య ప్రజల బలం విభజనలో కాకుండా సంఘీభావంలో ఉందని నిరూపించడమే వామపక్షాల ముందున్న రాజకీయ సవాలు. కాబట్టి, 'బద్లావ్ జరూరీ హై' తదుపరి దశ ప్రజల రోజువారీ పోరాటాలను జాతీయ రాజకీయాలకు కేంద్రంగా నిలపాలి.

మాజిక చలనశీలత బలహీనపడుతుంది.అనారోగ్యం కుటుంబాలను అప్పుల్లోకి నెట్టి వేసినప్పుడు, ఆరోగ్య సంరక్షణ అనేది ఏ అర్థవంతమైన కోణంలోనూ ప్రజా హక్కుగా ఉండదు.కాబట్టి, బలమైన ప్రభుత్వ విద్య, సార్వత్రిక ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణల పరిరక్షణ,విస్తరణ ప్రత్యామ్నాయానికి కేంద్రకంగా ఉండాలి. మహిళా విముక్తిని కూడా అంతే గంభీరంగా పరిగణించాలి. ఆర్థిక స్వాతంత్ర్యం, సమాన వేతనాలు, సురక్షితమైన ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, హింస నుంచి స్వేచ్ఛ, సామాజిక జీవితంలో పూర్తి సమానత్వాన్ని వాయిదా వేయలేము. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్యకర్తలు వంటి వారు ముఖ్యమైన ప్రజా విధులను నిర్వర్తిస్తారు. గౌరవం, వేతనం, సామాజిక రక్షణకు అర్హులు. సమాజ ప్రగతి కొలమానం ప్రకారం, భారతదేశ మహిళలు కేవలం అభివృద్ధిలో భాగం కావడమే కాకుండా, దాని దిశను నిర్దేశించడంలో సమాన భాగస్వాములుగా ఉండాలి.

మత విద్వేషాలు పదేపదే సృష్టించబడి, పెంచి పోషించబడుతూ తరుణంలో, భారతదేశ బహుళత్వాన్ని పరిరక్షించడమే ఒక రాజకీయ ప్రతిఘటన చర్య. కానీ మత సామరస్యాన్ని కేవలం నైతిక విజ్ఞప్తికి కుదించలేము. అది ప్రజలను ఏకం చేసే భౌతిక ప్రయోజనాలలో వేళ్ళూనుకొని ఉండాలి. ఒకే యజమానిని ఎదుర్కొంటున్న హిందూ, ముస్లిం కార్మికులు, ఒకే రకమైన వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిక్కు, హిందూ రైతులు, విద్యలో ఒకే రకమైన ప్రైవేటీకరణను ఎదుర్కొంటున్న దళిత, ఒబిసి విద్యార్థులు, పితృస్వామ్య హింసను ఎదుర్కొంటున్న వివిధ వర్గాల మహిళలకు, వారి విభజన కారణంగా లబ్ధి పొందే శక్తుల కన్నా, ఒకరితో ఒకరికి చాలా ఎక్కువ సారూప్యతలు ఉన్నాయి. సెప్టెంబర్ 1నాటి జన సమీకరణ రాజకీయ బలాన్ని ప్రదర్శించింది. ఆ బలాన్ని మార్పు కోసం సాగే నిరంతర పోరాటంగా మలచడమే ప్రస్తుతం మన ముందున్న కర్తవ్యం. మధ్యలో లభించే సమయాన్ని ప్రజా సంఘాలను నిర్మించడానికి, ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి, యువత, మహిళల కొత్త విభాగాలకు చేరువవడానికి, కార్మికులు, రైతులతో సంబంధాలను మరింతగా పెంపొందించుకోవడానికి, ఈ ఉద్యమాన్ని స్థానిక పోరాటాల్లోకి తీసుకువెళ్ళడానికి ఉపయోగించుకోవాలి.'బద్లావ్ జరూరీ హై' అనేది ఒక ర్యాలీకి సంబంధించిన నినాదంగా మిగిలిపోకూడదు. అది ప్రజల దైనందిన జీవితాల్లో వేళ్ళూనుకొన్న ఒక నిరంతర రాజకీయ ఉద్యమంగా మారాలి. దేశానికి దిశ మా ర్పు అవసరం – అది 'కార్పొరేట్ కేంద్రీకరణ నుంచి సామాజిక సంక్షేమం వైపు, అస్థిరమైన పని నుండి గౌరవప్రదమైన ఉపాధి వైపు, ప్రైవేటీకరణ నుంచి బలమైన ప్రభుత్వ సంస్థల వైపు, కుల వ్యవస్థ నుంచి సార్వత్రిక సామాజిక న్యాయం వైపు, పితృస్వామ్యం నుంచి సమానత్వం వైపు, మతపరమైన విభజన నుంచి సౌభ్రాతృత్వం వైపు, మితిమీరిన కేంద్రీకరణ నుంచి నిజమైన సమాఖ్య ప్రజాస్వామ్యం వైపు' దిశ మారాలి.

> ప్రజల సమస్యలకు మతపరమైన శత్రువులు ఉన్నారని ప్రజలను నమ్మించాలని ఆర్‌ఎస్‌ఎస్– బిజెపి రాజకీయ వ్యూహం కోరుకుంటోంది. వామపక్షాలు దీనికి విరుద్ధంగా నిరూపించాలి. ఐక్య కార్యాచరణలోనే అసలైన బలం ఉందని చాటాలి. మనం ఐక్యంగా బ్రిటిష్ రాజ్‌ను ఓడించాము, ఇప్పుడు మళ్ళీ ఏకం అయ్యి ఆర్‌ఎస్‌ఎస్– బిజెపి రాజ్‌ను తొలగించాల్సిన సమయం వచ్చింది.

అభివృద్ధిని డొల్ల నినాదాలతోనో, శీర్షికల్లోని గణాంకాలతోనో కాకుండా, తమకు ఉద్యోగాలు ఉన్నాయా, తమ కుటుంబాలను పోషించే స్థాయిలో తమ వేతనాలు ఉన్నాయా, తమ పిల్లలు నాణ్యమైన విద్యను పొందుతున్నారా, ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉందా, రైతులు గౌరవంగా జీవించగలుగుతున్నారా, మహిళలు సమానంగా, సురక్షితంగా ఉన్నారా, కుల అణచివేతను సవాలు చేస్తున్నారా, అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే స్వేచ్ఛ పౌరులకు ఉందా అనే విషయాల ఆధారంగా సామాన్య ప్రజలు అంచనా వేస్తారు. అదే ప్రగతికి నిజమైన కొలమానం.అదే ప్రజాస్వామ్యానికి నిజమైన పరీక్ష. సెప్టెంబర్ 1వ తేదీన జరిగిన ర్యాలీ, మార్పు కోసం పిలుపు ప్రజలను సమీకరించగలదని నిరూపించింది. మన ఎదుట ఉన్న కర్తవ్యం మరింత కఠినమైనది, బృహత్తరమైనది. ఆ అసంతృప్తిని సంఘటితం చేయడం, ఆ పోరాటాలను ఏకం చేయడం, దేశాన్ని మార్చగల సామర్థ్యం ఉన్న ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం.

> మనం 'బద్లావ్ జరూరీ హై' ని ప్రతి కార్యాలయానికి, ప్రతి క్యాంపస్‌కు, ప్రతి గ్రామానికి, ప్రతి బస్తీకి, ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి తీసుకువెళ్లాలి. మనం ప్రజలను సంఘటిత పరచాలి. వారి పోరాటాలను ఏకం చేయాలి. దోపిడీని, అణచివేతను సవాలు చేయాలి.న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ వాగ్దానాన్ని పరిరక్షించాలి.ఆర్థిక భద్రత హక్కుగా, సామాజిక సమానత్వం వాస్తవరూపంగా, ప్రజాస్వామ్యం ప్రజలకు చెందినదిగా ఉండే భారతదేశాన్ని నిర్మించాలి.

పిలుపు ఇవ్వబడింది. సమీకరణ ప్రారంభమైంది. ఇప్పుడు నిర్వర్తించాల్సిన కర్తవ్యం, ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లి, 'బద్లావ్ జరూరీ హై'ని నిజమైన పరివర్తనకు ఒక శక్తిగా మార్చడం.



కార్మికుల హక్కుల కోసం చేసే పోరాటం కేవలం ట్రేడ్ యూనియన్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. మంచి ఉపాధి కనుమరుగైనప్పుడు, వేతనాలు స్తంభించిపోయినప్పుడు, అసంఘటిత రంగం విస్తరించినప్పుడు, సామాజిక భద్రత బలహీనపడినప్పుడు, కార్మికులు, పెట్టుబడిదారుల మధ్య అధికార సమతుల్యత మౌలికంగానే మార్పుచెందుతుంది. కార్మికులకు సామాజిక రక్షణ, కార్మిక హక్కులతో కూడిన సురక్షితమైన, గౌరవప్రదమైన, తగినంత వేతనంతో కూడిన ఉపాధి అవసరం. భారత యువతకు, ఈ ప్రశ్న వారి భవిష్యత్తుతో విడదీయరానిది. లక్షలాది మంది భద్రత కరువైన ఉద్యోగాలు, నియామకాలలో జాప్యం, పత్రాల లీకేజీ, అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొంటున్నారు. యువ భారతీయులకు గౌరవప్రదమైన పని దొరకకపోతే, జనాభా బలంతో ప్రయోజనం లేదు. గ్రామీణ, పట్టణ కార్మికులిద్దరికీ అర్థవంతమైన ఉపాధి హామీతో సహా, ఉపాధిని ఒక ప్రధాన ప్రజాస్వామ్య, సామాజిక డిమాండ్‌గా మార్చేందుకు సిపిఐ, దాని ప్రజా సంఘాలు తమ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి.

రైతులు, వ్యవసాయ కార్మికుల పోరాటానికి కూడా ఇదే విధానం మార్గదర్శకంగా ఉండాలి. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, సరిపోని ఆదాయాలు, రుణభారం, ఆర్థిక అభద్రత, గ్రామీణ భారతదేశ జీవనోపాధికి ముప్పుగా పరిణమించాయి. లాభదాయకమైన ధరలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన గ్యారంటీ, బలమైన ప్రభుత్వ పెట్టుబడుల కోసం డిమాండ్ కేవలం వ్యవసాయ రంగ డిమాండ్ మాత్రమే కాదు. ఇది గ్రామీణ భారతదేశ పునరుద్ధరణ కోసం డిమాండ్. విద్య, ఆరోగ్య సంరక్షణలను ప్రభుత్వ బాధ్యతలుగా తిరిగి స్వీకరించాలి. విద్య ఖర్చు నానాటికి పెరుగుతున్నప్పుడు, వంశపారంపర్యంగా వచ్చే ప్రత్యేక హక్కులు బలపడతాయి. సా

### కొనసాగింపు ఇలా...

- అక్టోబర్ 2న మత సామరస్య దినోత్సవం ప్రాముఖ్యత ఇదే. ఇది సౌభ్రాతృత్వ సందేశాన్ని కార్యాలయాలు, క్యాంపస్‌లు, గ్రామాలు,పరిసర ప్రాంతాలకు తీసుకువెళ్ళడానికి ఒక సందర్భం కావాలి. లౌకికవాద పరిరక్షణను ప్రజల రోజు వారీ పోరాటాలతో అనుసంధానించాలి.
- నవంబర్ 7న విప్లవ దినోత్సవం, మరో అవకాశాన్ని అందిస్తుంది. చరిత్రను ఇష్టాను సారం తిరగరాస్తున్న ఈ తరుణంలో, యువ తరాలకు కార్మికుల, రైతుల పోరా టాల చరిత్రను, వలస వ్యతిరేక ప్రతిఘట నను, సామాజిక విముక్తిని, దోపిడీకి వ్యతి రేకంగా జరిగిన పోరాటాన్ని పరిచయం చేయాలి. విప్లవం అంటే అన్యాయమైన సామాజిక ఏర్పాట్లు శాశ్వతం కాదని, సంఘటిత ప్రజలు వాటిని మార్చగలరని అర్థం.
- ఆ తర్వాత ఈ ఉద్యమం డిసెంబర్ 1 నుండి 3 వరకు జరిగే 'జైల్ భరో ఆందోళన్' వైపు సాగాలి. ప్రతిపాదిత ఐదు లక్షల మంది సమీకరణను కేవలం ఒక ప్రతీకాత్మక కార్యక్రమంగా చూడకూడదు. అది సంఘటిత ప్రజాస్వామ్య ప్రతిఘటనకు ఒక శక్తివంతమైన ప్రదర్శనగా మారాలి. వ్యక్తిగత సమస్యలను సామూహిక రాజకీయ చర్చగా మార్చాలి. కార్మికుల డిమాండ్లు, రైతుల డిమాండ్లు, మహిళల హక్కులు, విద్యార్థుల సమస్యలు, ఉపాధి, ధరల పెరుగుదల, ఆహార భద్రత, సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాఖ్య వాదం, ప్రజాస్వామ్యం ఒక ఉమ్మడి రాజకీయ వ్యక్తీకరణను కనుగొనాలి.

# ప్రజాపాలనలో ఆర్‌టిసికి పునరుజ్జీవనం

- దశాబ్దం తర్వాత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- ఎన్నికల్లో ఆర్‌టిసి కార్మిక లోకం స్వచ్ఛందంగా పాల్గొనాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాపాలనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టిసి)కు పునర్జీవం లభిస్తోందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. టిజిఎస్‌ఆర్‌టిసిలో దాదాపు దశాబ్దం తర్వాత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయనీ, అక్టోబర్ 9న నిర్వహించనున్న ఎన్నికల్లో ఆర్‌టిసి కార్మికులు స్వచ్ఛందంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. 2016 జూలై 19న చివరిసారిగా ఆర్‌టిసి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు జరిగాయని, ఆ తర్వాత ఎన్నికలకు అవకాశం లేకుండా పోయిందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌టిసి కార్మికుల సంఘ హక్కులను గత ప్రభుత్వం అణచివేసిందని ఆయన ఆరోపించారు.

**విలీన ప్రక్రియలో యూనియన్లకు భాగస్వామ్యం**

గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై తదుపరి ప్రక్రియ చేపడతామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘం ప్రతినిధులను అధికారుల కమిటీలో భాగస్వాములను చేసి, ఇతర రాష్ట్రాల్లో విలీనం తర్వాత ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా కార్మికుల ప్రయోజనాలను కాపాడేలా ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

**కార్మిక సంక్షేమానికి పలు చర్యలు..**

ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు. పెండింగ్ డిఎల చెల్లింపుతో పాటు 2017, 2021 సంవత్సరాలకు సంబంధించిన ఫిట్‌మెంట్ అందజేశామని తెలిపారు. సిసిఎస్, పిఎఫ్ బకాయిల విడుదల, 1,432 కారుణ్య నియామకాలు, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగుల పునర్నియామకం, 4 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతి వంటి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే ఆర్‌టిసికి 2,932 కొత్త బస్సుల కొనుగోలు, 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేసే కార్యక్రమం, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి చర్యలతో సంస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. 'ఆర్‌టిసి కార్మికులు ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముక. వారి హక్కులను కాపాడటం, సంక్షేమాన్ని పరిరక్షించడం ప్రజాపాలన ప్రభుత్వ బాధ్యత. గుర్తింపు ఎన్నికలతో కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరిస్తున్నాం' అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణదే కీలక పాత్ర

- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను దాదాపు 5 నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక
- ఢిల్లీలో 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సిఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సిఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. దేశం కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూనే, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఉత్పాదకతను పెంచడం, అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి అందించడం ప్రధాన సవాల్ అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం, రాష్ట్రాలు కలిసి ముందుకు కొనసాగాలని అన్నారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు. తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం రాష్ట్రానికే పరిమితమైనది కాదని, 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన వికసిత్ భారత్ నిర్మాణానికి తెలంగాణ అందించే భాగస్వామ్యమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తూ పెట్టుబడులు, స్థిరమైన ఆర్థిక వనరులు, మానవ సామర్థ్యానికి ప్రాధాన్యం ఇస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని ఆయన అన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక రూపొందించినట్లు డిప్యూటీ సిఎం చెప్పారు. తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని, ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అంతకంటే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుందని డిప్యూటీ సిఎం తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని డిప్యూటీ సిఎం వివరించారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు.

**ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం**

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్క్‌ను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌ను పూడ్చడం, ప్రైవేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇందుకోసం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యాలు (పిపిపి), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ వంటి మార్గాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు.

**యువతే తెలంగాణకు అతిపెద్ద బలం**

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మౌలిక వసతులు, పెట్టుబడులతో పాటు మానవ వనరులే అసలైన పునాది అని, యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని డిప్యూటీ సిఎం అన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక భద్రత, అందుబాటులో వైద్యం, నాణ్యమైన గృహవసతి, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు ద్వారా అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నదే తమ విధానమన్నారు.



## పేదల ఇండ్లకు పట్టాలు ఇవ్వండి


- మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ నగరంలోని సర్వే నంబర్ 964, 966, దీన్ దయాల్ నగర్, బంధం చెరువు, కోట చెరువు, ఇందిరమ్మ కాలనీలలో గత అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న సుమారు 1000 మంది నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి నివాసంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ నాయకులు కిషోర్,అలకుంట్ల మల్లన్న, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, జోగుదుర్గ, కనకం కావ్య తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, ఇల్లు లేనటువంటి నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పక్క గృహాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

## సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి 45 రోజుల గడువు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 45 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో శనివారం సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణకు వెలుగులు పంచేందుకు భూమి పొరల్లోకి దిగి తమ చెమటను నల్లబంగారంగా మారుస్తున్న సింగరేణి కార్మికుల సేవలు అమూల్యమైనవన్నారు. సింగరేణి కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్నాయని, వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలకాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జారీ చేసిన జి.ఓ. నెంబర్ 76ను పరిగణనలోకి తీసుకుని, భూముల స్వభావం, ప్రభుత్వ, సింగరేణి హక్కులు, ప్రస్తుతం ఉన్న నివాస పరిస్థితులు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో సింగరేణి బొగ్గు బెల్ట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో నల్గొండ జిల్లాలోని, పడమటిపల్లిలోని వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు. ఈ సందర్భంగా పల్లా సుధీర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి సాంబశివరావు నివాళులర్పించారు. సిపిఐ నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ప్రజాపక్షం దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద హైడ్రామా



- భూములు, నిర్మాణాలపై కాంగ్రెస్ నేతల పరిశీలన.. అనుమతులపై ఆరోపణలు
- అడ్డుకునేందుకు బిఆర్ఎస్ శ్రేణుల యత్నం.. భారీగా పోలీసుల మోహరింపు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండ లం జన్వాడలోని ఫామ్‌హౌస్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూములు, నిర్మాణాలు, అనుమతుల వివరాలను పరిశీలించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల బృందం అక్కడికి చేరుకుంది. దీంతో ఫామ్‌హౌస్ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ నేతల పర్యటనను అడ్డుకునేందుకు బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**ఫామ్‌హౌస్ వద్ద భూములు, నిర్మాణాలు పరిశీలించిన కాంగ్రెస్ నేతలు**

నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం జరిగిందా? నాలాపై నిర్మాణం చేపట్టారా? తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. 111 జీవో పరిధిలోని భూముల్లో నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు ఉన్నాయని, జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నాలాపై నిర్మాణం ఎలా చేపట్టారు? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. భూములు, నిర్మాణాలకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. మరోవైపు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం ఫామ్‌హౌస్ నిర్మాణం, భూముల యాజమాన్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**యజమాన్యం నాదే: ప్రదీప్‌రెడ్డి**

అయితే ఫామ్‌హౌస్ యజమానిగా పేర్కొంటున్న బి.ప్రదీప్‌రెడ్డి కాంగ్రెస్ నేతల ఆరోపణలను ఖండించారు. జన్వాడలోని భూమి తనదేనని, 2019లో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కెటిఆర్‌కు ఈ ఆస్తిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేవని, తాను తన చిన్ననాటి స్నేహితుడైన కెటిఆర్‌కు ఫామ్‌హౌస్‌ను లీజుకు ఇచ్చినట్లు వెల్లడించారు. భూమికి క్లియర్ టైటిల్ ఉందని, అధికారులు ఏవైనా సందేహాలు ఉంటే నోటీసులు జారీ చేస్తే సంబంధిత పత్రాలను చూపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో జన్వాడ ఫామ్‌హౌస్ భూముల యాజమాన్యం, నిర్మాణ అనుమతులు, నాలా ఆక్రమణ ఆరోపణలపై అధికారిక విచారణలో వెలువడే వివరాలపై ఆసక్తి నెలకొంది.

## వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయం కల సాకారం

విమానాశ్రయానికి ఏ పేరు పెడదాం?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న కల సాకారం కానున్నదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయ కలను నిజం చేయలేక పోయిందని సిఎం పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి సారించారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో వరంగల్ విమానాశ్రయ కల ఎట్టకేలకు సాకారం అవుతోందని తెలిపారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి శనివారం 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. మామునూర్ విమానాశ్రయ భూసేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించిందని సిఎం వెల్లడించారు. అవసరమైన భూమిని పూర్తిగా సేకరించి, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఎఎఐ)కి అప్పగించినట్లు తెలిపారు. మామునూర్ విమానాశ్రయ ప్రాజెక్టు ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదిద్దుకుంటోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మామునూర్ విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**విమానాశ్రయానికి ఏ పేరు?**

వరంగల్‌లో కొత్తగా రూపుదిద్దుకుంటున్న విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలనే విషయంపై ప్రజల నుంచి సూచనలను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. విమానాశ్రయానికి తగిన పేరును సూచించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ పనులు వేగవంతం

మంత్రి సీతక్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గ్రామపంచాయతీ, గ్రామ సమైక్య, అంగన్‌వాడి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలో మంజూరైన 9,745 గ్రామ సమైక్య భవనాల్లో 534 పూర్తి కాగా, 3,906 గ్రామపంచాయతీ భవనాల్లో 444 పూర్తయ్యాయని, 2,313 అంగన్‌వాడీ భవనాల్లో 200 పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రారంభం కాని పనులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. అంగన్‌వాడి భవనాల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నిధులతో పాటు ఉపాధి హామీ పథకం నుంచి రూ.8 లక్షలు వినియోగించాలని, మిగిలిన రూ.4 లక్షల కోసం ఇతర నిధులను మళ్లించాలని కలెక్టర్లను కోరారు. ఎంపి లాడ్స్ నుంచి కనీసం రూ.1 కోటి కేటాయించాలని కోరుతూ రాష్ట్రంలోని ఎంపిలకు లేఖలు రాయనున్నట్లు మంత్రి తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. అలాగే, హ్యామ్ విధానంలో చేపడుతున్న గ్రామీణ రహదారుల నిర్మాణ పనులను దసరాలోపు ప్రారంభించాలని కాంట్రాక్ట్ కంపెనీల సన్నద్ధతను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ దాన కిశోర్, కమిషనర్లు దివ్య దేవరాజన్, శృతి ఓఝా, ఈఎన్‌సి జగదీష్ పాల్గొన్నారు.

# ఎరువుల అసమతుల్యత వినియోగం ఆందోళనకరం

- ప్రకృతి వ్యవసాయాన్ని 'తెలంగాణ నేచురల్ ఫార్మింగ్ బ్రాండ్'గా తీర్చిదిద్దాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి లేకపోవడం, ఎరువుల వినియోగంలో తీవ్ర అసమతుల్యతపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో కొన్ని అంశాల్లో పురోగతి ఉన్నప్పటికీ, లోటుపాట్లను సాకుగా చూపకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, అధికారుల జవాబుదారీతనం పెంచాలని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో చర్చకు వచ్చిన అంశాల నేపథ్యంలో శనివారం సచివాలయంలో వ్యవసాయ శాఖపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి జి.సురేంద్ర మోహన్, డైరెక్టర్ బి.గోపి, వివిధ విభాగాల అధిపతులు, వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్ల వైస్ చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.

**నత్రజని, భాస్వరం, పొటాషియం అధిక వినియోగం ఆందోళనకరం**

రాష్ట్రంలో నత్రజని (ఎన్), భాస్వరం (పి), పొటాషియం (కె) వినియోగ నిష్పత్తి 4:2:1 కిగాను ప్రస్తుతం 14.9:5.7:1 తీవ్ర అసమతుల్యత నిష్పత్తిగా ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హెక్టారుకు సగటున 217 కిలోల యూరియా వినియోగం జరుగుతుండగా, జాతీయ సగటు 160 కిలోలుగా ఉందని తెలిపారు. సూక్ష్మ పోషకాలు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, ఫెర్టిగేషన్ వినియోగాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**నకిలీ ఎరువులు, పురుగుమందులపై కఠిన చర్యలు**

నకిలీ ఎరువులు, పురుగుమందులను అరికట్టంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మంత్రి తుమ్మల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తక్షణమే పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ, నాసిరకం ఉత్పత్తులపై నమోదయ్యే ప్రతి కేసులోనూ కచ్చితమైన ఫాలోఅప్ ఉండాల్సిందేనన్నారు. విచారణ, ప్రాసిక్యూషన్ ప్రక్రియలు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పప్పుధాన్యాల సాగుపై ప్రశంస.. విత్తనాలపై అసంతృప్తి**

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణంలో నిర్దేశించిన లక్ష్యంకంటే 127 శాతం సాధించడంపై మంత్రి అధికారులను అభినందించారు. అయితే ధృవీకరించిన విత్తన ఉత్పత్తి కేవలం 47 శాతం పంపిణీ 34 శాతం మాత్రమే సాధించడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై అధికారులు పూర్తి దృష్టి సారించాలని సూచించారు. రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎఐఎఫ్) కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కేవలం నిధుల మంజూరును పెంచడమే కాకుండా, వాటితో వాస్తవంగా ఏర్పడుతున్న మౌలిక సదుపాయాలు, వాటి ద్వారా రైతులకు కలుగుతున్న విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని చెప్పారు. రైతు నేస్తం వ్యవస్థను కేవలం వ్యవసాయ శాఖకు పరిమితం చేయకుండా అన్ని వ్యవసాయ అనుబంధ శాఖలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, సహకార శాఖలు రైతు నేస్తం వేదికను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా సమన్వయం పెంచాలని సూచించారు.

**'తెలంగాణ నేచురల్ ఫార్మింగ్ బ్రాండ్ పేరుతో అమ్మకాలు**

ప్రకృతి వ్యవసాయాన్ని కేవలం సాగు విస్తీర్ణం పెంచే కార్యక్రమంగా చూడకుండామార్కెట్‌తో అనుసంధానం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. క్లస్టర్, సర్టిఫికేషన్, ఎఫ్‌పిఒ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ విధానాలతో విధానంలో ముందుకు సాగాలని సూచించారు. ఎంపిక చేసిన పంటలు, ప్రాంతాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేసి వాటి ఉత్పత్తులను ''తెలంగాణ నేచరల్ ఫార్మింగ్ బ్రాండ్'' పేరుతో మార్కెటింగ్ చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. గ్రామస్థాయి వరకు పథకాల ప్రచారాన్ని విస్తరించాలని ఆదేశించారు.


**సిరిసిల్ల మున్సిపాలిటీ కార్యాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా**

నం. E1/358/3rd Party QC/2026 ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తేదీ: 19-09-2026

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే అన్ని రకాల సివిల్ పనులు మరియు ఇతర పనులకు సంబంధించి, ''థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్'' (నాణ్యత నియంత్రణ) సేవలను అందించడానికి ప్రసిద్ధ కన్సల్టెంట్ల నుండి సిరిసిల్ల మున్సిపాలిటీ కమిషనర్ ఆసక్తి వ్యక్తీకరణను (EOI) ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల ఏజెన్సీలు / కన్సల్టెంట్లు తమ ఆసక్తి వ్యక్తీకరణతో పాటు ఆర్థిక ప్రతిపాదన మరియు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లోనూ, అలాగే ఈ కార్యాలయానికి కూడా **21-09-2026 ఉదయం 11:00 గంటల నుండి 28-09-2026 సాయంత్రం 4:00 గంటల మధ్య** సమర్పించవలసిందిగా కోరడమైనది. సాంకేతిక బిడ్: 28-09-2026 సాయంత్రం 4:15 గంటలకు తెరవబడుతుంది. కన్సల్టెంట్లు బిడ్ పత్రాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించి సమర్పించాలి.

సం/- కమిషనర్,
సిరిసిల్ల మున్సిపాలిటీ

DIPR R.O. No. : 10285-PP/CL/ADVT/2026-27, Date: 19-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, బోడుప్పల్ సర్కిల్-10, బంగారు మైసమ్మ ఆలయం దగ్గర, బోడుప్పల్ - 500092. ఇ-మెయిల్: eecircle10MMC@gmail.com

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

టెండర్ నోటీసు నం. 27/EE/Boduppal Circle-10/MMC/Tenders/2026-27, తేదీ: 19.09.2026. ఎంఎంసి పరిధిలోని ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10లో 15 పనులకు సంబంధించిన టెండర్ నోటీసు. పూర్తి వివరాలను https://tender.telangana.gov.in/login.html వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సంబంధిత కార్యక్రమాల వివరాలు కింద ఇవ్వబడ్డాయి:

| ఈవెంట్స్ | 17 పనులకు మాత్రమే |
|---|---|
| ప్రారంభ తేదీ | 21.09.2026, సాయంత్రం 4:00 గంటలకు |
| టెండర్ పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ | 28.09.2026, సాయంత్రం 4:00 గంటలకు |
| బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం | 28.09.2026, సాయంత్రం 4:00 గంటలకు |
| ప్రైస్ బిడ్ తెరిచే సమయం | 28.09.2026, సాయంత్రం 4:01 గంటలకు |

**సంబంధిత అధికారి చిరునామా:** శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, MMC, హైదరాబాద్. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
బోడుప్పల్ సర్కిల్-10, ఎంఎంసి.

DIPR R.O. No. : 10301-PP/CL/ADVT/2026-27, Date: 19-09-2026

## పిడుగుపాటుతో రైతు దుర్మరణం



**ప్రజాపక్షం/సత్తుపల్లి/వేంసూరు:** వేంసూరు మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో పిడుగుపాటుకు రైతు పర్సా ఆనందరావు (52) మృతి చెందాడు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఆయనపై పిడుగు పడింది. తీవ్రంగా గాయపడిన ఆనందరావును సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## 'రేపు' ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కలెక్టరేట్‌లో 21న (సోమవారం) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలన కారణాల రీత్యా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా సోమవారం మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందన్నారు. ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ 2027 పరీక్షకు హాజరయ్యే ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఫిరంగి తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ, టిసిఆర్ అండ్ టిఐ, శ్రీరామ్స్ ఐఏఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా 100 మందిని (ఎస్‌టి 75, ఎస్‌సి15, బిసి 10 ), గత ఐదేళ్లలో ప్రిలిమ్స్ క్వాలిఫై చేసిన 20 మంది ఎస్‌టి అభ్యర్థులను కలిపి మొత్తం 120 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి పది నెలల పాటు ఉచిత వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తారన్నారు. డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు, వయస్సు 21 నుంచి 32 ఏళ్ళు (దివ్యాంగులకు 35 ఏళ్ళు), కుటుంబ వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉండాలన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ సెప్టెంబర్ 23 తేదీ, ప్రవేశ పరీక్ష సెప్టెంబర్ 27న ఉంటుందని, ఫలితాలు అక్టోబర్ రెండున ఉంటాయన్నారు. తరగతులు అక్టోబర్ ఐదు నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలు, దరఖాస్తు కోసం https://welfare.sriramsias.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## జాబ్‌మేళాలో సత్తా చాటిన 'ఎస్‌బిఐటి' విద్యార్థులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన విద్యార్థులు 73 మంది ఉద్యోగాలు సాధించి సత్తా చాటారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ఉద్యోగ మేళాలో 340 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. ఖమ్మం జిల్లా నుండి తమ కళాశాల విద్యార్థులు వివిధ హోదాల్లో ఉద్యోగాలు సాధించి జిల్లా ప్రతిష్టను పెంచారని గుండాల కృష్ణ తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ గుగూల్, విప్రో, ఫాక్స్‌కాన్, ఐసిఐసిఐ బ్యాంక్, కోటక్ మహేంద్ర బ్యాంకులతో పాటు ఐటి, ఫార్మా, కన్‌స్ట్రక్షన్ వంటి వివిధ రంగాలకు చెందిన కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొన్నాయన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కళాశాలకే కాకుండా ఖమ్మం జిల్లాకు గర్వకారణంగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ రైజింగ్ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ, టాస్క్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొని ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందించినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ నిరంతర శిక్షణ, ఉద్యోగాల సాధనకు ఉపయోగపడినట్లు ఆయన తెలిపారు. కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్, అప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ వంటి వివిధ ఆధునిక సాంకేతిక శిక్షణ ద్వారా ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపిఒ ఎన్. సవిత, జి. ప్రభాకర్, కె. ప్రశాంతి పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రఘునాథపాలెం మండల విద్యాశాఖాధికారి బి. రాములు తెలిపారు. పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రఘునాథపాలెంలో శనివారం 'ఒక చెట్టు అమ్మ పేరుతో' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి. రాములు, ఉప సర్పంచ్ బి. ప్రశాంత్ పాల్గొని తల్లుల పేరుతో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంఇఒ తెలిపారు. ఏకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎంఇఒ పాల్గొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బి. ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా వేపకుంట్ల ఉన్నత పాఠశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ (ఒక చెట్టు అమ్మ పేరుతో) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి తల్లుల పేరుతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి, శ్రీకాంత్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మేడేపల్లి సుజాత, ఉపాధ్యాయులు రమాదేవి, సుమలత, మల్లికార్జునరావు, జావిద్, పంచాయతీ కార్యదర్శి అనిల్, స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజా, గురవయ్య, నాగమణి, వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

# పాత చట్టం..కొత్త చిక్కులు

**22ఎపై గ్రామాల్లో విస్తృత చర్చ**
**అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన వారిలో ఆందోళన**
**ఆక్రమణలు, కబ్జాల సంగతి ఏమిటి?**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒక పాత చట్టం అది ఇప్పటిది కాదు 1908 రిజిస్ట్రేషన్ యాక్ట్‌లోని ఓ నిబంధన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. అటు రాజకీయంగా ఓ తుఫాన్ లేపగా రాజకీయాలకు సంబంధం లేని సామాన్య ప్రజల్లోనూ ఈ చట్టంపై విస్తృతంగా చర్చ సాగుతుంది. ఈ పాత చట్టం తెచ్చిన కొత్త చిక్కులే ఇప్పుడు ఎక్కడ చూసినా చర్చనీయాంశమయ్యాయి. 1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఎ నిబంధన ఇప్పుడు కొందరికి ఖేదాన్ని, మరికొందరికి మోదాన్ని తీసుకు వచ్చింది. 1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ ప్రకారం ప్రభుత్వ అసైన్డ్, వక్ఫ్, ఎండోమెంట్, అటవీ భూములు వంటి కొన్ని నిర్దిష్ట ఆస్తుల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ జాబితాలో ఉన్న భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా రక్తసంబంధికులకు బహుమానంగా ఇవ్వడం చేయకూడదు. బ్యాంకుల్లోనూ దీనిని తనఖా పెట్టకూడదు. కానీ ఈ చట్టం కొద్ది రోజులు కండ్లు మూసుకోవడంతో పైన పేర్కొన్న అన్ని రకాల భూములకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే అసైన్డ్ భూములను బహిరంగ మార్కెట్‌లో క్రయ, విక్రయాలు జరిగాయి. ఇదే దేవాదాయ వక్ఫ్ భూములను సైతం ఆక్రమించారు. అటవీ భూములకు కొంత మంది హక్కులు పుట్టించారు. ప్రభుత్వ నిబంధనలను తోసిరాజని యథేచ్ఛగా నిషేధిత జాబితాలో లేని భూముల వ్యవహారాల్లో ఎలా వ్యవహరిస్తారో 22ఎ లోని భూముల విషయంలోనూ అదే రీతిగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకు వచ్చింది. ధరణి విషయంలో అధికారుల తప్పిదాలు కొందరి అత్యుత్సాహం కారణంగా కొత్త సమస్యలు తలెత్తాయి. ఉదాహరణకు ప్రభుత్వం ప్రజా ప్రయోజనార్థం భూములను సేకరిస్తే అందులో ఎంత సేకరించినా ఆ సర్వే నెంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలో ఉంచారు. ఇది పెద్ద గంగరగోళానికి దారి తీసింది. మొత్తానికి ధరణి రైతులకు అన్యాయం చేసిందని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చింది. భూ భారత వచ్చిన తర్వాత ఈ 22ఎ సెక్షన్ ప్రకారం గ్రామాల్లో నిషేధిత జాబితా వెల్లడైంది.

### అసైన్డ్ విక్రయాలు

1970 దశకంలో అప్పటి ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు సాగు చేసుకునేందుకు భూములను పంపిణీ చేసింది. నిరుపేద రైతులకు పంపిణీ చేసిన ఈ భూమిని కేవలం సాగు చేసుకునేందుకు మాత్రమే వినియోగించాలి. ఎన్ని తరాలైనా అనుభవించవచ్చు కానీ విక్రయించేందుకు అవకాశం లేదు. ఇటువంటి వాటిలో సాగుకు లాకి కానీ భూములు కూడా ఉన్నాయి. ఒకప్పుడు పట్టణాలకు, నగరాలకు దూరంగా ఉన్నా నగరాలు, పట్టణాల విస్తీర్ణత తర్వాత ఈ అసైన్డ్ భూములకు రియల్ ఎస్టేట్, వివిధ సంస్థల ఏర్పాటు ఇతరత్రా అవసరాల నేపథ్యంలో మంచి డిమాండ్ ఏర్పడింది. కారుచౌకగా రావడంతో చాలా మంది అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. కొందరు రెవెన్యూ అధికారులు యధాశక్తి సహకరించారు. దీనితో అసైన్డ్ భూములు బడా బాబుల పరమయ్యాయి. గ్రామాల్లోనూ వ్యవసాయ భూమికి గడిచిన రెండు దశాబ్దాలుగా సాగు భూమికి డిమాండ్ రావడంతో గ్రామాల్లోనూ అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. ఇప్పుడు ఆ భూములను నిషేధిత జాబితాలోకి రావడంతో కొనుగోలు చేసిన వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అర్హత లేని వారు అంటే అసైన్డ్ సాగు చేసేందుకు అర్హత లేని వారి చేతిలో భూమి ఉంటే ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్న ప్రచారం ఇప్పుడు గ్రామాల్లో గందరగోళానికి దారి తీసింది.

### యథేచ్ఛగా ఆక్రమణలు

ప్రభుత్వ భూములను, అటవీ భూములను ఇతరత్రా నిషేధిత జాబితాలో ఉన్న భూములను యథేచ్ఛగా కొందరు ఆక్రమించగా మరి కొందరు ఇతరుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. రెండు, మూడు దశాబ్దాల కాలంలో ఇటువంటి భూములు నాలుగైదు చేతులు మారినా ఘటనలు ఉన్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు వీటిపై ఎటువంటి అభ్యంతరాలను వ్యక్తం చేయకపోవడంతో ఈవిధంగా జరిగింది. ఇప్పుడు ఈ భూములు నిషేధిత జాబితాలో రావడంతో కొనుగోలు చేసిన వారు లేదా ఇప్పుడు ఎవరి చేతుల్లో భూమి ఉందో వారు ఆందోళనకు గురవుతున్నారు. మొత్తంగా అక్షర జ్ఞానం లేని వారు కూడా ఇప్పుడు 22ఎ గురించి తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఒక పక్క కొందరి భూములు పోతాయన్న ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతుంది.

### ప్రభుత్వమే భయం పోగొట్టాలి

అసైన్డ్ భూములు సహా నిషేధిత జాబితాలో లేని భూములు కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 22ఎ నిషేధిత జాబితాలో చోటు చేసుకున్నాయన్న ఆందోళన రైతుల్లో ఉంది. క్షేత్రస్థాయి ఆలోచన లేకుండానే నిషేధిత జాబితాను ప్రకటించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా నివాసం ఉంటూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణానికి అనుమతులు, బ్యాంకుల ద్వారా రుణాలు సహా అన్ని పొందినప్పుడు ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చితే ఎలా అన్న ప్రశ్న వినవస్తుంది. కబ్జాలకు, ఆక్రమణలకు పాల్పడిన, తెలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేసినా లేదా తెలిసి తప్పిదం చేస్తే చర్యలు తీసుకుంటే తప్పు లేదు కానీ సామాన్యులు రూపాయి రూపాయి కూడబెట్టి భూములు, స్థలాలు కొనుగోలు చేసిన విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాల్సి ఉంది. ప్రభుత్వమే ఈ 22ఎకు సంబంధించి ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టాలి. మనిషికో రీతి కాకుండా చట్టం అందరికీ సమానమన్న రీతిలో 22ఎ అమలు జరగాలి. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చకు దారి తీసి రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న ఈ విషయం కొందరి రోజుల తర్వాత కనుమరుగవుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. 22ఎను రాజకీయ అవసరాలకు కాకుండా భూ సమస్య పరిష్కారానికి, సామాన్యుడికి నష్టం జరగని రీతిలో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డులో ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాలలో శనివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ప్రతిక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షిస్తే భవిష్యత్తులో పచ్చదనం పెంపొందించడంతో పాటు కాలుష్య నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించి చెట్లుగా పెంచే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రరావు, తెలంగాణ రాష్ట్ర మార్‌కఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఎఎంసి చైర్మన్ బోళ్ల గంగారావు, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాములు, మిట్టపల్లి నాగి, రాంపూడి రోశయ్య, దార్న రాజశేఖర్, ఫణితి శ్రీనివాసరావు, వీరయ్య, జాలాది రామకృష్ణ, తోటకూర శ్రీకాంత్, ఖాన్ పార్టీ సత్యనారాయణతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**కలెక్టర్ అంకిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం వద్ద గోదావరి నదిలో జరిగే వినాయక నిమజ్జనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం గోదావరి తీరంలో ఆయన నిమజ్జన ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా లాంచీలు, బారికేడింగ్, లైటింగ్, సిసి కెమెరాలు, తాగునీరు, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీస్ రెవెన్యూ రవాణా వైద్య ఇరిగేషన్ అగ్నిమాపక దేవాదాయ ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. నిర్ణయించిన ప్రాంతాల్లో మాత్రమే నిమజ్జనాలు చేయాలని, వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లో నిలపాలని భక్తులకు సూచించారు. ఊరేగింపుల్లో డిజెలు ఉపయోగించవద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లకుండా శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం సీతారామ చంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉత్తర ద్వారం చిత్రకూట మండపం గోశాల అన్నదాన సత్రం విస్తా కాంప్లెక్స్ మాడ వీధులు తదితర ప్రాంతాల్లో పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలూ పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి ఘాట్ల అభివృద్ధి పనులను పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## ధంసలాపురం చెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు

**పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలి**
**కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ధంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకుని కావాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటి మట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పో లీస్ బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలన్నారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లను ఏర్పాటు చేయాలని మెకానిక్‌లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డివో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పండుగలు ఐక్యతకు దోహదం చేస్తాయి

**మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత**



**ప్రజాపక్షం/మధిర:** మత సామరస్యానికి మధిర పట్టణ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్, టీచర్స్ కాలనీల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొలువుదీరిన గణేష్ మంటపాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏ ర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం సామినేని సుజాత మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించుకునేందుకు పండుగలు, ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని స్పష్టం చేశారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి కిరణ్, రావూరి శ్రీను, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, వై.చారులత, రిటైర్డ్ ఎంఇఒ వై.ప్రభాకర్, పిఆర్‌టియు నాయకుడు ఆర్.బ్రహ్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దోర్నాల వెంకట రవి పాల్గొన్నారు.

## ఐక్యంగా ముందుకు సాగుదాం

**అభివృద్ధి పనులకు మేయర్ మూడ్ గణేశ్ శంకుస్థాపన**



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసపల్ కార్పొరేషన్ పరిధి పాల్వంచ డివిజన్‌ల అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో ఐక్యంగా ముందుకు సాగుదామని మేయర్ మూడ్ గణేష్ అన్నారు. పాల్వంచ 35వ, డివిజన్‌లో రూ.6 లక్షల నిధులతో డ్రైన్ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మేయర్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా పాల్వంచకు ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధి అనుకున్నంతగా జరగలేదన్నారు. దీనిని అధిగమించటానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే నేతృత్వంలో పాల్వంచను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నావంతు కృషి చేస్తానని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసుకొందామన్నారు. ప్రజలకు కావలసిన కనీస మౌలిక వసతులైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు నిర్మాణానికి పాటు పడుతున్నామని దానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. దశల వారీగా పాల్వంచలోని 27 డివిజన్‌లను అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మేయర్‌ను మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, నామా కీర్తి, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, శ్యామలా దినేష్, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, సిపిఐ సీతారామపట్నం శాఖ కార్యదర్శి తంతెనపల్లి వెంకన్న, నాయకులు మేదరమెట్ల నారాణ, నామా నవీన్, నామా పండు, గౌతం, గుర్రం వెంకటేశ్వర్లు, తూము రాము, వీరారెడ్డి, ప్రకాష్, కొప్పుర నాగేశ్వరరావు, బదర లక్ష్మయ్య, కాల్వ భూషణం, నాగేశ్వరరావు, పవన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతిచెందిన ఘటన శనివారం జరిగింది. ఖమ్మం డిపోలో పనిచేస్తున్న సామినేని లక్ష్మి నారాయణ విధి నిర్వహణలో భాగంగా డ్యూటీపై హైదరాబాద్ వెళ్లారు. ఈ రోజు తెల్లవారుజామున డ్యూటీకి వెళ్లిన లక్ష్మి నారాయణకు తీవ్రమైన గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మి నారాయణది చింతకాని మండలం పాతర్లపాడు గ్రామం. ఆయన మృతిపట్ల ఆర్‌టిసి అధికారులు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## భిన్నత్వంలో ఏకత్వమే మన సంస్కృతి


**ఐక్యతతోనే ప్రగతి పథం సాధ్యం**
**ఎస్‌కె. సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పండుగలు ఉత్సవాలు సమాజంలో మత సామరస్యానికి సోదరభావానికి నిదర్శనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ దర్గన్ బస్తీలో ఏర్పాటు చేసిన గణేష్ మంటపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను తిలకించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించి బస్తీ ప్రజలకు భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు సర్వ మానవ సౌభ్రాతృత్వానికి భిన్నత్వంలో అకత్వాన్ని చాటి చెబుతాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించినప్పుడే సమాజం శాంతియుతంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. సమాజంలో ఆకలిని తీర్చే అన్నదానం ఎంతో మహోన్నతమైందని ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్ ఉత్సవకమిటీ సభ్యులు సికిందర్ సింగ్ పుణ్ణంసింగ్ రథంకోర్ నంగి కౌర్ బహుద్దూర్ సింగ్ బీమా సింగ్ పవన్ సింగ్ బల్వం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక కవి సమ్మేళనం

**ఐటిడిఎ పిఒ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం:** డా.పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగే 176వ శతాధిక కవి సమ్మేళనం జయప్రదం కావాలని ఐటిడిఎ పిఒ రాహుల్ ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి శనివారం తన ఛాంబర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 200 మంది కవులు ఈ సమ్మేళనానికి రానుండటం అభినందనీయం అన్నారు. తెలుగుభాష యొక్క గొప్పతనాన్ని భావి తరాలకు చాటి చెబుతాయని పేర్కొన్నారు. తెలుగు బాష వారసత్వ సంపదను ప్రపంచానికి తెలిపేలా భద్రాచలం కేంద్రంగా కవి స మ్మేళం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ వరలక్ష్మి సాయిరాం, రాష్ట్ర కో ఆర్డినేటర్ సురేష్ బాబు జిల్లా ప్రతినిధి ఎర్రంశెట్టి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

# మల్లూరు ఆలయ అభివృద్ధిపై త్వరలో క్షేత్ర సందర్శన

కల్యాణ మంటపం, డార్మిటరీ, అన్నదాన సత్రం ఏర్పాటుకు చర్యలు: మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలోని ప్రసిద్ద మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అర్కిటెక్టులు, సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఆలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలపై చర్చించారు. భక్తుల సౌకర్యార్థ్యం కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం తదితర మౌళిక వసతులు కల్పించాలని నిర్ణయించారు.

**పవిత్రతకు భంగం కలగకుండా...**

మల్లూరు క్షేత్ర చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది కలగకుడా, ప్రస్తుత నిర్మాణ స్వరూపాన్ని కాపాడుతూ సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**త్వరలో క్షేత్రస్థాయి పరిశీలన:** అభివృద్ధి పనుల డిజైన్ ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు క్షేత్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యేక్ష్యంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. నిర్మాణాలకు అనువైన భూమి స్థితిగతులు, సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు రాక్ టెస్ట్‌ను త్వరితగతిన నిర్వహించాలని ఆదేశించారు. దాని నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులు సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌళిక వసతులు అందేలా ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, సమన్వయంతో, భక్తులకు అసౌకర్యం కల్గకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## బార్-బెంచ్ సమన్వయంతో ప్రజలకు వేగవంతమైన న్యాయం



**ప్రజాపక్షం/మరిపెడ:** బార్‌బెంచ్ సమయ్వయంతో కక్షీదారులకు త్వరగా న్యాయం అందించాలనీ హైకోర్టు న్యాయమూర్తి ఈవి వేణుగోపాల్ అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జీ యాండ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు భవనం ను ఆయన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.రాజేశ్వర రావు, జస్టిస్ బిఆర్. మధుసూదనరావులతో కలసి ప్రారంభించారు. ఘనంగా నిర్వాహించిన ఈ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లడుతూ,న్యాయ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు వేగంగా పెండింగ్ కేసులు పరిష్కరించడం ప్రతి ఒక్కరి భాధ్యత అని అన్నారు. న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పని చేయడానికి బార్ బెంచ్ మధ్య సమన్వయం అత్యంత కీలకమని, వాదానలు వినిపించే ప్రతి న్యాయవాది ఆఫిసర్ ఆఫ్ ద కోర్టు గా వ్యవరించాలనీ, చట్టపరమైన అంశాలను సమగ్రంగా కోర్టు ముందు ఉంచాలని,న్యాయమూర్తులు ప్రతి కేసును ఎంతో శ్రద్దగా పరిశీలించి, చట్టపరమైన అంశాలను అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. న్యాయవాదులు తీర్పులను విస్తృత దృక్పథంతో అర్థం చేసుకోవాలనీ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కు పూర్తి స్థాయి కోర్టు భవనం త్వరలోనే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా శంఖుస్థాపన జరిగే విధంగా చర్యలు జరుగుతున్నయని తెలిపారు.ఈ కార్యక్రమనికి జిల్లా కలెక్టర్,ఎస్పి అందించిన సేవలను,నిబద్ధతను అభినందిచారు.నూతన న్యాయస్థాన ఎర్పాటుకు కృషి చేసిన పిడిజె శ్రీ మురళీ మోహన్,ఇతర న్యాయమూర్తులు,సిబ్బంది,బార్ అసోసియేషన్,అధికారుల కృషికి,కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, సీనియర్, జూనియర్ జడ్జీలు డికే మురళిమోహన్, శాలిని షాకెల్లి, స్వాతి మురారి, కృష్ణతేజ్, ధీరజ్ కూమర్, జీవన్‌కూమర్, మహతి, వైష్ణవి, ఆఖిల,దిలిప్ కుమార్ నాయక్, సూర్య చంద్రకళ, క్యాన్‌లాల్, చండేశ్వరి దేవి,జోత్స్న, మండల అదికారులు, బార్‌కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ

## మహిళా జైలు సందర్శన



**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేటలోని ప్రత్యేక మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ చైర్‌పర్సన్, వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయం తదితర అంశాలను పరిశీలించి, మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిమాణం, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి, ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా త్రైమాసిక నివేదికకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం నర్సంపేట కోర్టు ప్రాంగణాన్ని కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, కార్యదర్శి సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయ సేవల ప్రాధాన్యత, లోక్ అదాలత్‌లు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించాలని సంబంధిత న్యాయాధికారులకు సూచించారు. కక్షిదారులు, న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్ ప్రయోజనాలు, కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సేవలు అవసరమైన ప్రతి ఒక్కరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ, నర్సంపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ప్రతీక్ సిహాగ్, న్యాయమూర్తులు ఎండి యూసుఫ్, పి గిరిధర్, జైలు సూపరింటెండెంట్ స్రవంతి, జైలు సిబ్బంది, జైలు సందర్శక న్యాయవాది సునీత, ప్యానెల్ న్యాయవాది డి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డిసిపి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని తొర్రూరు (జె) గ్రామంలోని చెరువు గణేష్ నిమజ్జన ప్రదేశాన్ని జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రామహేంద్ర నాయక్ శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అవసరమైన భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి, నిర్వాహకులకు సూచించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం పాలకుర్తిలోని గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట సీఐ భరత్ సుమన్, ఎస్ఐ పవన్ కుమార్, తొర్రూరు సర్పంచ్ యాకస్వామి, వినాయక మండపాల నిర్వాహకులు రవికుమార్, ఉప్పల చారి, సోమేశ్వర్, వెంకటేశ్వర రావు, వెంకన్న, నాగన్న, కుమార్, రమణ, సంపత్, సంతోష్ కుమార్, పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ జనగామ జిల్లా శాఖ ఎన్నికలకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/జనగామ:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా శాఖ నిర్వాహణ కమిటి ఎన్నికలు 04 అక్టోబర్ 2026 రోజున నిర్వయించనున్నట్లు ఎన్నికల అధికారి, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓ ఎస్ కిరణ్ ప్రకాష్ తెలిపారు. శనివారం ఆయనొక ప్రకటన చేస్తూ ఈ నెల 24న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ కమిటి సభ్యుల పదవులకు నామినేషన్లు స్వీకరించబడతాయన్నారు. నామినేషన్ల స్వీకరణ జనగామ ఆర్‌డిఓ కార్యాలయంలో ఉంటుందని, 26వ తేదీన ఉపసంహరణ, వచ్చే నెల నాలుగవ తేదీన ఎన్నికలు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందనానరు. నామినేషన్ ఫీజు రూపాయలు పదివేలుగా నిర్ణయించడం జరిగిందని, నామినేషనర్ ఫారాలు జనగామ ఆర్‌డిఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం 7995087589 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## ఎఐటియుసిలో ప్రైవేట్ పాఠశాలల బస్ డ్రైవర్ల చేరిక




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్స్ బస్ డ్రైవర్లు మరియు క్లీనర్లు 75 మంది నేడు ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో ఎఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి ఎఐటియుసిలోకి ఆహ్వానించారు. అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ డ్రైవర్ల హక్కుల కోసం ఎఐటియుసి పోరాటం చేస్తోందని, ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంలో అనేక రంగాల కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎఐటియుసి అనునిత్యం కార్మికుల సమస్యల పరిష్కారానికై యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారి హక్కులు సాధిస్తోందని అన్నారు. దేశంలో స్వాతంత్రానికి ముందు ఆవిర్భవించి ఇప్పటివరకు కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్మిక సంఘం అంటూ ఏదైనా ఉందంటే అని ఎఐటియుసినే అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో అనేక చారిత్రాత్మకమైన సంఘటనల్లో కార్మికుల పక్షాన నిలిచి అనేక సమస్యలు పరిష్కరించడంలోనూ, పోరాటాలలో ఎఐటియుసి విజయం సాధించింది అన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసిలో చేరిన ప్రైవేటు స్కూల్స్ బస్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని వారు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్, లింగరాజ్, వెంకన్న, ఉప్పలయ్య, రవికుమార్, సురేష్ ,బీముడు, మల్లేష్, శ్రీనివాస్, కార్తీక్, వినయ్, శంషుద్దీన్, నాగేష్, వెంకన్న, అశోక్ 75 మంది ఎఐటియుసిలో చేరారు.

## పట్టభద్రుల ఓటరు జాబితా పునః సిద్ధీకరణకు షెడ్యూల్

అర్హులైన వారు ఫారం..18తో దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజాపక్షం/ములుగు:** శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితా పునఃసిద్ధీకరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రుల ఫారం 18లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి కనీసం మూడేళ్లు పూర్తయిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబర్ 28 నుండి నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితా సాధారణ ఓటరు జాబితాల మాదిరిగా శాశ్వతంగా ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఎన్నికకు ముందు పాత జాబితా రద్దవుతుందని, గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా కొత్తగా ఫారం 18 సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

**షెడ్యూల్ ఇలా:** ప్రజా నోటీసు సెప్టెంబర్ 28న జారీ చేశారు. అక్టోబర్ 15, 25 తేదీల్లో పత్రికల్లో పునః ప్రచురణ ఉంటుంది. నవంబర్ 20న ముసాయిదా జాబితాల ముద్రణ పూర్తి చేసి 25న ప్రచురిస్తారు. నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 25న వాటిని పరిష్కరించి, 30న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట: ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండల కేంద్రం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలను గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించాలనే లక్ష్యంతో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టల్ సౌకర్యాలు, డిజిటల్ విద్యా వనరులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టళ్లలో నివాస పాఠశాలల్లో మెస్ చార్జీలను పెంచి నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అలాగే ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహార (బ్రేక్ ఫాస్ట్) కార్యక్రమాన్ని అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. . ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్సార్ విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న ఆహారం నాణ్యత, వసతి సౌకర్యాలు, బోధన విధానం, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయ లక్ష్మి, విద్యాశాఖ అధికారులు, ఎమ్మార్వో, ఎంపీడీవో, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థినులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి:** ప్రభుత్వ ఆసుపత్రికి నిరంతర మంచినీరు, విద్యుత్ సరఫరా ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, నీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శనివారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య, మున్సిపల్, మిషన్ భగీరథ, ఎన్‌హెచ్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారిపై పైప్ లైన్ క్రాసింగ్ సమస్యను పరిష్కరించి, మిషన్ భగీరథ లేదా మున్సిపల్ పైప్‌లైన్ ద్వారా ఆసుపత్రికి ప్రత్యేక నీటి సరఫరా లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ ఈఈ, విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూ హక్కులకు భరోసా కల్పించేలా సమగ్ర సర్వే

ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేయాలి: కలెక్టర్ సత్యశారద

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందిగా నిర్వహించి రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారధ అధికారులను ఆధేశించారు . శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని అర్షనపల్లి గ్రామంలో భూముల రీ సర్వే అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రీ సర్వేతో భూముల వాస్తవ పరిస్థితులు, సరిహద్దులు , విస్తీర్ణం, యాజమాన్య వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులకు మరింత పటిష్ట పరిచే అవకాశం ఉందని చెప్పారు. భూరికార్డుల్లో ఉన్న వివరాలు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులకు మధ్య తేడాలు ఉంటే వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రీ సర్వే నిర్వహించే ప్రాంతా ల్లో రైతులు, భూ యాజమానులకు ముందుగానే సమాచారం అందించాలన్నారు. సర్వే చేస్తున్న సందర్భంలో రైతులు తమ భూములకు సంబందించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రా లు అందుబాటులో ఉన్న ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. భూ ముల హద్దులు, విస్తీర్ణం తదితర అంశాలపై రై తులకు ఏవైన అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట అర్డిఓ పి.ఉమారాణి ,వరంగల్ జిల్లా ఏడి సర్వే అధికారి, తహసిల్థార్ ఎం.కృష్ణ, మండల స్థాయి అధికారులతో పాటు రైతులు పాల్గోన్నారు .



**లెక్కల్లో విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ పరీక్ష**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లెక్కల్లో ప్రతిభకు పరీక్ష పెట్టి సామర్థ్యాన్ని స్వయంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారధ పరిశీలించారు. శనివారం నల్లబెల్లి మండలంలోని బోల్లోనిపల్లి , శనిగరం ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మీక తనీఖీ చేసి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యంపై ఆరా తీశారు. ముఖ్యంగా గణితంపై విద్యార్థుల అవగాహనను స్వయంగా పరిక్షించి వివిధ లెక్కలు గణిత సమస్యలను విద్యార్థులకు ఇచ్చి వాటిని ఏవిధంగా పరిష్కరిస్తున్నారో పరీశీలించారు. పాఠశాల తనీఖీలో నర్సంపేట అర్డిఓ ఉమారాణి, తహసిల్థార్ ఎం.కృష్ణ తదితరులు పాల్గోన్నారు .

## హోటళ్లు, బేకరీల్లో ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని హోటళ్లు, బేకరీలు, ఆన్‌లైన్ ఫుడ్ స్టోర్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. వినియోగదారుల జాతీయ ప్రతినిధుల ఫిర్యాదుల మేరకు గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఫుడ్ సేఫ్టీ అధికారి మౌనిక తనిఖీ చేపట్టారు. వినియోగదారుల జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్, రాష్ట్ర ప్రతినిధి రావుల రంజిత్‌కుమార్ వారితో కలిసి పాల్గొన్నారు. కొత్తవాడలోని జెప్టో ఆన్‌లైన్ మార్కెటింగ్ స్టోర్ నుండి బజార్‌లోని రెడ్ బకెట్ బిర్యానీ, కాంటినెంటల్ బేకరీ, గ్రాంపస్ బేకరీల్లో తనిఖీలు చేశారు. స్వస్తిక్ బ్రాండ్ కారం పొడి ప్యాకెట్‌పై 100 శాతం నేచురల్ అనే ముద్రణ నిబంధనలకు విరుద్ధంగా ఉందని ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో అధికారులు సంబంధిత కారం పొడి ప్యాకెట్లను సేకరించారు. ఆన్‌లైన్ విక్రయాల్లో ధరల వ్యత్యాసాలపై వినియోగదారుల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. రూ.15 ధర ఉన్న ఎగ్ పఫ్‌ను ఆన్‌లైన్‌లో రూ.70కు విక్రయిస్తున్నారని, రూ.130 విలువైన స్మాల్ బకెట్ బిర్యానీని యాప్‌ల ద్వారా రూ.180కు విక్రయించడంతో పాటు అదనంగా ప్లాట్‌ఫాం ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. వినియోగదారుల ఆహార భద్రత, ధరలు, ఆన్‌లైన్ విక్రయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రతినిధులు సూచించారు. నిబంధనలకు విరుద్ధమైన ఆహార విక్రయాలు, నాణ్యత లోపాలు, అధిక ధరలపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు సకాలంలో సమాచారం అందించాలని కోరారు.

## సయ్యద్ వలి ఉల్లా ఖాద్రికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/వరంగల్:** తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక చేపట్టిన ఓదార్పు యాత్ర రెండో రోజు సందర్భంగా వరంగల్ నగరంలోని ఎల్‌బి నగర్‌లో డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి నివాసానికి చేరుకున్న వేదిక నాయకులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా, కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకుడిగా, విద్యార్థి, యువజన సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా, సమాజ సేవలో విశిష్ట సేవలు అందించినందుకు డాక్టర్ ఖాద్రిని అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక చైర్మన్ జి. రవికుమార్ మాట్లాడుతూ డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడన్నారు. వరంగల్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఆయన తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించారని, ఉద్యమ సమయంలో ఆయనపై వందకు పైగా పోలీసు కేసులు నమోదయ్యాయని, తెలంగాణ కోసం జైలుశిక్ష కూడా అనుభవించారని గుర్తు చేశారు. అంతేకాకుండా, వరంగల్ విద్యార్థి ఉద్యమ చరిత్రలో అత్యున్నత స్థాయికి చేరుకుని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం వరంగల్ ప్రజలకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు, యువత, సమాజ అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, యువజన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎల్‌బినగర్ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాల అమలు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాల అమలు చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి సంబందించిన 36మంది కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 36లక్షల 04వేల 176రూపాయల విలువగల చెక్కులను అలాగే 33మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 17లక్షల 11వేల 500రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మాత్రం లేదని అన్నారు. దానికి కారణం దేవాదుల ప్రాజెక్టు ద్వారా మన రిజర్వాయర్లను నింపుకొని పంటలకు సాగు అందిస్తున్నట్లు తెలిపారు. 20ఏళ్ల క్రితం ఒక చిన్న మొక్కగా ప్రారంభించిన దేవాదులఎత్తిపోతల పథకం నేడు మహా వృక్షంగా ఎదిగి ఉమ్మడి వరంగల్ జిల్లాకే సాగు నీరు, త్రాగు నీరు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడివో, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఎంపీల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎంపీల్యాడ్స్ నిధులతో జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీ లాడ్స్ )ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, టీజీఐడీసీ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మిగతా అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజుల్లో ఎంపీల్యాడ్స్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సత్యనారాయణ రెడ్డి, దేవిక చౌహాన్, గాయత్రి, రాజగోపాల్ రావు, శ్రీనివాసరావు, శిరీష, యుగంధర్, రామ్ దేవ్, నరేందర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలో జరిగే వినాయక నిమజ్జన వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సిఐ ఒ వెంకటేష్, ఎస్ఐ ఎన్ రమేష్ గౌడ్ తెలిపారు. శనివారం స్థానిక గిద్దె చెరువు, జక్కుల చెరువులలో ఏర్పాట్లను పరిశీలించారు.

## వినాయక మంటపాల వద్ద బాంబ్ డిస్పోజల్ టీమ్ తనిఖీలు



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలంలోని వినాయక మంటపాల వద్ద శనివారం బాంబ్ డిస్పోజల్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ బి.వంశీకృష్ణ ఆధ్వర్యంలో బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో కలిసి మండలంలోని వివిధ వినాయక మంటపాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ప్రజలు, మంటపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి శాంతియుతంగా, సురక్షితంగా వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్ఐ సూచించారు.

## 'ఆల్ఫోర్స్ ఇ–టెక్నో'లో భవిత అవగాహన సదస్సు





**ప్రజాపక్షం / కొత్తపల్లి :** విద్యార్థులు తప్పనిసరిగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఎస్.బాలచంద్ర, అభయ ఫౌండేషన్ చైర్మన్, పల్లవి, అభయ ఫౌండేషన్ స్పీకర్ డా.కే.అమర్నాథ్, ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు సిఏ ఎం.హరీష్ బాబు, స్వదేశీ జాగరన్ మంచ్ రాష్ట్ర అధ్యక్షులతో స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో నిర్వహించిన భవిత అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా తల్లిదండ్రుల యొక్క మార్గదర్శకాలను పాటించాలని, గురువులు బోధించినటువంటి విషయాలను నిర్లక్ష్యం చేయకుండా సాధన చేసి వివిధ పోటీ పరీక్షలకు హాజరై ప్రతిభను చాటి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. చాలామంది విద్యార్థులకు భద్రత పట్ల అవగాహన లేకపోవడం వల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. శనివారం సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 300 మంది బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మయ్య కరుణాకర్ రెడ్డిలు తెలిపారు. ఎంపిక పోటీలకు ఆతిథ్యమిచ్చిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ ప్రిన్సిపాల్ సత్యం,వ్యాయామ ఉపాధ్యాయులు,దాసరి రమేష్, ప్రణయ్, దాసరి ప్రసాద్,ఆలేటి సంపత్,గెల్లు మధుకర్ యాదవ్,మహమ్మద్ షఫీ,కిషోర్,రాజేందర్ ప్రసాద్,శివ,పిట్ట భాస్కర్ తదితరులున్నారు.

## నిర్లక్ష్యం నీడన ప్రధాన రహదారి



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజి వద్ద వి ద్యార్థులు ఎలాంటి ట్రాఫి క్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా నృ త్యాలు చేస్తుండడం మీ డియా కంట పడింది. సిరిసిల్ల కామారెడ్డి ప్రధా న రహదారి వెంట నిత్యం వందలాది వాహనాలు నడుస్తుంటాయి, అ లాంటి రహదారి మధ్యలో విద్యార్థులు గుంపులుగా నిలబడడం వలన ఏ దైన ప్రమాదం జరుగుతే ఏవరు బాధ్యత వహిస్తార ని, కావున కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించి, తగు చర్యలు తీసుకో వాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## డిసిసి ప్రధాన కార్యదర్శిగా అమన్‌జిత్ సింగ్



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సిసి) ప్రధాన కార్యదర్శిగా నగరంలోని అమన్ జిత్ సింగ్ నియమితులయ్యారు. రేకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే, డి సిసి అధ్యక్షుడు డా.మేడిపల్లి సత్యం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని అన్ని మతాలు, వర్గాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే సిక్కు మైనార్టీ వర్గానికి చెందిన అమన్‌జిత్ సింగ్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జ్లిలా కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌కు అమన్‌జిత్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, మైనార్టీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తా నని స్పష్టం చేశారు.

# వేగవంతంగా అభివృద్ధి పనులు పూర్తి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్





**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్/రాయికల్ :** అభివృద్ధి పనులనుమరింత వేగవంతం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో జగిత్యాల పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు.జగిత్యాల పట్టణంలో ఆవశ్యకంగా ఉన్న నూతనంగా అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం,పట్టణంలో తాగు నీటిసరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.నూతన వాటర్ ట్యాంక్,పైప్ లైన్‌ల నిర్మాణం, పట్టణ పారిశుధ్యం విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలన్నారు. ఎస్ఇగంగాధర్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,డిఇ వరుణ్, ఎఇ.లు దీపక్ ,రాహుల్,దివ్య మున్సిపల్ అధికారులు,పాల్గొన్నారు.

**డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు ప్రారంభం**

రాయికల్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.30 లక్షల వ్యయంతో నాలుగు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాయికల్ మండలంలో గృహజ్యోతి పథకం అమలుకు సుమారు రూ.11.70 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం అవసరమైన డిడి చెల్లించిన వారికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాకు చర్యలుఈ వర్షాకాలంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ తారా స్థాయికి చేరినప్పటికీ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్ అందించేందుకు 14 రూపాయలకు యూనిట్ చొప్పున ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తోందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఉచిత విద్యుత్‌తో పాటు రుణమాఫీ, రైతుభరోసా తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాయికల్ పట్టణ,మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధా న్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మైతాపూర్–రామాజీపేట బ్రిడ్జి పనులు పూర్తి చేశామని, మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. గత ంలో సీనియర్ నాయకులు రోడ్లు, భవనాల శాఖ మం త్రిగా ఉన్న సమయంలో పూర్తి కాలేని బ్రిడ్జి పనులను పూ ర్తి చేస్తామని అన్నారు .ఎవరు ఎన్ని విమర్శలు చేసినా రా యికల్ పట్టణ, మండల అభివృద్ధి మాత్రం ఆగదని ఎ మ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వ సతులు కల్పిస్తూ రాయికల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు,సర్పంచులు,రాయికల్ పట్టణ మండల నాయకులు,విద్యుత్ అధికారులు,పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఉత్సవాల నిర్వహణ


### కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్‌పి అశోక్ కుమార్‌లతో కలిసి ఏర్పాట్లు పరిశీలన



**ప్రజాపక్షం/జగిత్యాల :** భక్తి శ్రద్ధలతో జగిత్యాల పట్టణంలో ఈ నెల 23, 24వ తేదీలలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్,పోలీస్,రెవెన్యూ,అగ్నిమాపక ఇతర శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,ఎస్‌పిఅశోక్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక మంటపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు.వినాయక నిమజ్జనానికి కావలసిన,స్టేజ్,విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని,వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ,అధికారులు సేవలు అందించాలని,నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని,భారీ క్రేన్లు, చిన్న క్రేన్‌లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి,మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, తహసీల్దార్ రాం మోహన్,తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహనలో పరిశోధన ప్రతిపాదనలపై సదస్సు

### రిజిస్ట్రార్ సతీష్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ రూరల్ :** శాతవాహన వి శ్వవిద్యాలయంలో అంతర్గత నాణ్యత హామీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కా ర్యాచరణలో భాగంగా శనివారం కీలక సదస్సు నిర్వహించారు. విశ్వ విద్యాలయ డా.బి.ఆర్. అంబేద్కర్ లైబ్రరీ ఆడిటోరియంలో పరిశోధన ఫలితాల సమర్పణ, ప్రతిభావంతమైన పరిశోధన ప్రతిపాదనల రచన అనే అంశంపై ప్రత్యేక నిపుణుల ప్రసంగ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డా.వి. శ్రీరంగ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. విశ్వ విద్యాలయాన్ని పరిశోధనా రంగంలో సరికొత్త శిఖరాలకు చేర్చే ఉద్దేశంతో అధ్యాపకులు వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రాజెక్టులను దక్కించుకునేలా ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్య వక్తగా కీలక ఉపన్యాసకుడిగా విశ్వ విద్యాలయ రి జిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ పెద్దపల్లి హాజరై దిశానిర్దేశం చేశారు. జపాన్, చైనా, స్లోవేనియా, ఆస్ట్రేలియా తదితర అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలతో కలిసి పరిశోధనలు చేసిన త మ సుదీర్ఘ అనుభవాన్ని ఈ సందర్భంగా ఆయన పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విసి ఒఎస్‌డి డా.డి.హరికాంత్, సిడిసిడీన్ ఆచార్య జాఫర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.పద్మావతి, పరీక్షల నియంత్రణాధికారి డా.సురేశ్ కుమార్, ఆచార్య జయంతి, ఆచార్య నమ్రత, డా.మనోహర్‌లతోపాటు విశ్వ విద్యాలయ, అనుబంధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విషయ నిపుణులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయకుడి పూజలు

### సిద్దిపేటలో 45 మంటపాల్లోని గణనాథులను దర్శించుకున్న మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సకల కార్యాలకు తొలి పూజలు అందుకునే విఘ్నేశ్వరుని అనుగ్రహం మనం అందరిపై ఉండాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం 45 మండపాలలో గణనాథులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు ఉన్నాయి. ఆయన పెద్ద తల గొప్పగా ఆలోచించమని చెబుతుంది.పెద్ద చెవులు, ప్రజల మాట వినాలని చెబుతాయని, చిన్న కళ్లు లక్ష్యంపై దృష్టి పెట్టాలని చెబుతాయన్నారు. ఆయన తొండం పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాలని నేర్పుతుందన్నారు. అందుకే గణపతి కేవలం పూజించే దేవుడు మాత్రమే కాదు మన జీవితానికి మార్గదర్శకుడని చెప్పాడు. మట్టి వినాయకుణ్ణి ప్రతిష్ఠించండి... పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. సిద్దిపేట పట్టణంలో శ్రీనగర్ కాలనీ, గణేష్ నగర్, సాయివిద్యా నగర్, ప్రశాంత్ నగర్, కాళ్ళ కుంట కాలనీ, సుభాష్ నగర్, లాల్ కమాన్, బోయి గల్లీ, శంకర్ నగర్, అంబేద్కర్ నగర్ హోసింగ్ బోర్డు కాలనీలలో కొలువైన గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులను మాజీ మంత్రి హరీష్ రావును సన్మానించారు.

## ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ యుద్ధప్రతిపాదికన పూర్తి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి




**ప్రజాపక్షం/సిద్దిపేట :** ఇందిరమ్మ ఇళ్లు రెండవ విడుత లబ్ధిదారుల వివరాలను గెజిటెడ్ అధికారులు వేరిఫికేషన్ యుద్ధప్రతిపాదికన పూర్తి చే యాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో ఇందిరమ్మ ఇళ్లు ,జలసిరి పనులపైన ఎంపిడిఒ, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు రెండవ విడత లబ్ధిదారుల వివరాలను,వెరిఫై చేసిన తరవాత ఆ దస్త్రాలను కలెక్టరేట్‌కి పంపించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలు వేగంగా నిర్మించుకుని గృహప్రవేశాలకు అయ్యేలాగా పనిచెయ్యాలని ఎంపిడిఒలను ఆదేశించారు.వివిజి రామ్ జి లో పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని, కూలీల సంఖ్యను పెంచితేనే వివిజి రామ్ జి చేపట్టిన పనులను పూర్తి చేసేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కనిపిస్తుందని అప్పుడప్పుడు అడపాదడపా కురిసే వర్షపు నీటి ని ఒడిసిపట్టుకునేందుకి జలసిరి పనులు తప్పనిసరిగా నిర్మించాలని ఆదేశించారు. భూమి కలిగిన అధికారు లు, కార్యాలయ సి బ్బంది, మహి ళా సమాఖ్య సభ్యులు, సర్పంచ్, వార్డు స భ్యులు ప్రతి ఒక్క రూ ఫామ్ ఫౌండ్ నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముందుగా మండలాల్లోనీ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రూ ఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మించాలని ఆదేశించారు. చేయూత పెన్షన్లు దరఖాస్తులను ఫీల్డ్ స్థాయి వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఎంపిడిఒలను ఆదేశించారు.ఈ కా ర్యక్రమంలో డిఆర్‌డిఒ రమేష్, గృహనిర్మాణ శా ఖ అధికారి భగవంత్ రావు, డిపిఒపాల్గొన్నారు.


## విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే 'ఉద్యమం ఉధృతం'

### * ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్ హెచ్చరిక




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను సెప్టెంబర్ 28,29,30తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 90వార్షికోత్సవాల వాల్ పోస్టర్‌ను జిల్లా నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేరిపోతుల జనార్ధన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా రంగంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ,కార్పొరేటీకరణను అడ్డుకోవడంతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం,రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని, ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఇప్పటికి అమలు చేయడం లేదని,హనుమకొండ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో జరిగే వార్షికోత్సవాలకు విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని, ఈ వార్షికోత్సవాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి విద్యార్థి ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని, విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని,తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులను మత రాజకీయాల కోసం వాడుకుంటే ఆయా పార్టీలను,సంఘాలను తరిమికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్,జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్,జిల్లా నాయకులు బత్తుల రంజిత్, సందీప్,సాయిప్రమోద్,ప్రణవ్, రోహిత్,వినయ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను ప్రోత్సహించాలి



కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వరి సాగులో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించేలా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.శనివారం పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరి వరహాలు' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా సో అండ్ రీప్ ఎన్‌జిఒ సంస్థ ఆధ్వర్యంలో వరి సాగులో నీటిని సమర్థవంతంగా వినియోగించిన రైతులకు ఎకరాకు రూ. 500 చొప్పున ప్రోత్సాహక చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఎంతో ముఖ్యమని తెలిపారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఇందుకోసం శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,నీటి సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.కరీంనగర్ ప్రాంతంలో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులను సాంప్రదాయ వరి సాగు విధానాల నుంచి ఆధునిక సాంకేతిక పద్ధతుల వైపు మళ్లించడంలో సో అండ్ రీప్ ఎన్‌జిఒ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన కలెక్టర్ పేర్కొన్నారు. వరి సాగులో నీటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు పంటకు అవసరమైన సమయంలో తగిన మోతాదులో నీటిని అందించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతు నీటి సమర్థ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా పంట దిగుబడులను పెంచడంతో పాటు చీడపీడల సమస్యలను కూడా నియంత్రించవచ్చని తెలిపారు.ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి విజయవంతమైన రైతులు తమ అనుభవాలను చుట్టుపక్కల రైతులతో పంచుకోవాలని కోరారు.రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులపై మరింత అవగాహన కల్పిస్తూ, నీటి పొదుపు, శాస్త్రీయ సాగు, అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తుల సాధన దిశగా వ్యవసాయ శాఖ, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, సో అండ్ రీప్ ఎన్‌జిఒ ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

### కలెక్టర్ చిత్రా మిశ్రా




**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ముఖ్యంగా నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో అర్హులైన ఒక్కరూ మిస్ కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, ఎపిడిఒలతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా వివిధ కార్యక్రమాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.సిసి రోడ్లు, ఇజిఎస్ పనులు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అమలు, ప్రజాపాలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాని, వివిధ దశల్లో ఉన్న చోట్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేసేలా అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పనులను సైతం సత్వరమే చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేయూత పింఛన్ల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించా రు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హత ఉన్న ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకూడదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాల ని స్పష్టం చేశారు. గ్రామాలోసిసి రోడ్లు, ఈజీఎ స్ పనులు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో వీఓ భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజాపాలన, ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్‌డిఒ గీత, ఎంపిడిఒలు, గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఫ్‌టిఎలతో భారత యువతకు కొత్త ఉపాధి అవకాశాలు

- 'రోజ్‌గార్ మేళా'లో ప్రధాని నరేంద్ర మోదీ
- 51,000కు పైగా అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**న్యూఢిల్లీ :** వివిధ దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదుర్చుకోవడం వల్ల యువతకు ఉపాధి అవకాశాల విషయంలో కొత్త ద్వారాలు తెరిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. శనివారం ఆయన 'రోజ్‌గార్ మేళా' (ఉపాధి కల్పన కార్యక్రమం)లో వర్చువల్ విధానంలో ప్రసంగించారు. భారతీయ యువత ప్రతిభ, నైపుణ్యాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని పొందాయని, భారతీయ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, దేశ యువశక్తిపై ప్రపంచానికి గొప్ప అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'భారత్ 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ ఒప్పందాలు మన యువతకు కొత్త అవకాశాల ద్వారాలను తెరుస్తున్నాయి. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు మన పారిశ్రామికవేత్తలకు కొత్త భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేస్తాయి, కొత్త మార్కెట్లకు దారులు తెరుస్తాయి. యువతకు కెరీర్ పరంగా కొత్త అవకాశాలను సృష్టిస్తాయి' అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో చేరనున్న నూతనంగా ఎంపికైన యువతకు ప్రధాన మంత్రి వర్చువల్ విధానంలో 51,000కు పైగా నియామక పత్రాలను అందజేశారు. ఇటీవల ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం గురించి ప్రస్తావిస్తూ, బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకుండా చూసేందుకు భారత్ కృషి చేస్తోందని మోదీ చెప్పారు. 'మన పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత ఇలా ప్రతి ఒక్కరూ ఈ భాగస్వామ్యంలో క్రియాశీల భాగస్వాములు కావాలి' అని ఆయన అన్నారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ, ఇందులో భారతీయ యువశక్తి ప్రతిబింబిస్తోందని, స్టార్టప్ వ్యవస్థ ఇకపై కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా ఇతర నగరాలకు కూడా విస్తరించిందని ప్రధాన మంత్రి అన్నారు. 'నేడు భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను కలిగి ఉంది. భారత స్టార్టప్ ప్రస్థానం ఇకపై కేవలం పెద్ద నగరాల కథ మాత్రమే కాదు. నేడు, గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్–2, టైర్–3 నగరాల్లోనే ఉన్నాయి' అని ఆయన చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే అత్యంత కీలకమైన లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. 'ఇందులో మీలాంటి యువత కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ప్రభుత్వంలో పనిచేస్తున్నప్పుడు, అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధి గల భారత్ కోసం సాగుతున్న ఉద్యమాన్ని నిరంతరం బలోపేతం చేసే నిర్ణయాలనే మీరు తీసుకోవాలి. యువకులుగా మీకు ఒక ప్రత్యేక బాధ్యత ఉంది, ముఖ్యంగా తోటి యువత పట్ల' అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొత్తం 45 'రోజ్‌గార్ మేళాలు' (ఉపాధి కల్పన కార్యక్రమాలు) నిర్వహించబడ్డాయి. ప్రధాన మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, కొత్తగా ఎంపికైన అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో (రెవెన్యూ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం మరియు రక్షణ మంత్రిత్వ శాఖతో సహా) విధుల్లో చేరనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంపై, దేశ అభివృద్ధి ప్రయాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడంపై ప్రభుత్వం నిరంతరం చూపుతున్న శ్రద్ధకు ఈ ' రోజ్‌గార్ మేళా' (ఉపాధి మేళా) నిదర్శనమని అధికారిక ప్రకటన పేర్కొంది. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి, ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో 12.75 లక్షల మంది యువత నియామక పత్రాలను అందుకున్నారని ఆ ప్రకటన తెలిపింది.

# విద్యార్థులు ప్రశ్నించడం వ్యవస్థకు ఇష్టం లేదు

ఇండోర్‌లో 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో రాహుల్‌గాంధీ



**ఇండోర్ :** దేశం మొత్తాన్ని ఒక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడం ఆ వ్యవస్థకు ఇష్టం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) అనే యువజన సంప్రదింపుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశం నుండి ద్వేషాన్ని తొలగించే శక్తి కేవలం విద్యార్థులకే ఉందని, ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుదారులనుద్దేశించి విమర్శకులు వాడే 'అంధభక్తులు' (గుడ్డి అనుచరులు) దీన్ని చేయలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు తమ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఒబిసి కోటా పెంపుపై ఉన్న న్యాయపరమైన వివాదాల కారణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో 13 శాతం నిలిపివేత వంటి అంశాలను వారు లేవనెత్తారు. విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు అని, వారు లేకుండా ఏ దేశమూ బలపడదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. అదానీ, అంబానీ, జై షా, ఇతరులతో కూడిన 'వ్యవస్థ' గురించి విద్యార్థులు ప్రశ్నలు అడుగుతుంటే, 'అంధభక్తులు' వారిని వ్యతిరేకిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు జిజ్ఞాస, ప్రేమ, వినయం, సహనం, నిజాయితీలకు ప్రతీకలుగా ఉంటారని, అదే అంధభక్తులలో ఈ గుణాలు ఏవీ ఉండవని, పైగా వారు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తారని ఆయన అన్నారు. దేశంలో పది లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 55 శాతంతో సహా మొత్తం లక్ష పాఠశాలలు మూతపడ్డాయి అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2014లో యుపిఎ ప్రభుత్వం బడ్జెట్‌లో 4.6 శాతాన్ని విద్యకు కేటాయించగా, ఇప్పుడు ఆ కేటాయింపు 2.6 శాతానికి (రూ. 7.7 లక్షల కోట్లు) పడిపోయిందని ఆయన చెప్పారు. 'విద్యార్థులే దేశానికి పునాది. విద్యార్థులే దేశాన్ని నిర్మిస్తారు. నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, విద్య అనేది విలాసం కాదు. విద్య అనేది ఒక ఉపకారం కాదు. విద్య అనేది భారతదేశంలోని ప్రతి విద్యార్థి హక్కు' అని అన్నారు. ప్రభుత్వం సమర్థవంతమైన విద్యా వ్యవస్థను నడపాలి. కానీ దేశంలో దీనికి విరుద్ధంగా జరుగుతోందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. స్కాలర్‌షిప్‌ల గురించి ప్రస్తావిస్తూ, గత 10 ఏళ్లలో 1.5 కోట్ల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దూరమయ్యారని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. 'భారత దేశం (కేంద్ర ప్రభుత్వం), ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు 1.5 కోట్ల కంటే తక్కువ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాయి. ఇక ఉపాధ్యాయుల విషయానికి వస్తే, సుమారు 10 లక్షల ఉద్యోగాలు (ఖాళీలు) ఉన్నాయి' అని ఆయన అన్నారు. కఠినమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, పూర్తిగా కప్పి, బారికేడ్లతో ఏర్పాటు చేసిన ఈ సభా ప్రాంగణానికి విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ పలువురు విద్యార్థులను వేదికపైకి ఆహ్వానించి, వ్యవస్థాగత పరిపాలనా వైఫల్యాలను, సురక్షితమైన విద్యార్థి వసతి మౌలిక సదుపాయాల తీవ్ర కొరతను ఎత్తిచూపుతూ, ఢిల్లీలో ఇటీవల సత్యనికేతన్ భవనం కూలిపోయిన ఘటనకు సంబంధించిన ఫుటేజ్‌తో సహా పలు దృశ్య క్లిప్‌లను ప్రదర్శించారు.

# 'ప్రజాస్వామ్యం హత్య'

బెంగాల్‌లో ఇసి, బిజెపి కుమ్మక్కైంది : కపిల్ సిబల్




**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘంపై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయిందని (జుగల్‌బందీ) ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను ఆయన 'ప్రజాస్వామ్యం హత్య'గా, జవాబుదారీతనం లేని సంపూర్ణ నియంతృత్వ ధోరణిగా అభివర్ణించారు. నందిగ్రామ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్ అరెస్టు 'పగటిపూట జరిగిన ప్రజాస్వామ్య హత్య' అని సిబల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు వ్యవస్థాగత జవాబుదారీతనం లోపించిందనడానికి నిదర్శనమని ఆయన అన్నారు. 'ఎన్నికల సంఘం, ప్రభుత్వం మధ్య ఉన్న ఈ కుమ్మక్కు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులు, నియంతృత్వ నిర్ణయాలు, స్పీకర్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు... ఇవన్నీ ఇంకెంతకాలం కొనసాగుతాయి?' అని సిబల్ శనివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. దేశమంతా ఈ పరిణామాలను గమనిస్తోందని, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యం, అలాగే మన వ్యవస్థలు కూడా డొల్లగా మారిపోయాయనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం సెప్టెంబర్ 7న ప్రకటించిందని సిబల్ గుర్తుచేశారు. 13న టిఎంసికి చెందిన సంచితా ప్రధాన్ దే నందిగ్రామ్ నుండి, రబియుల్ ఆలం చౌదరి రెజినగర్ నుండి నామినేషన్లు దాఖలు చేశారని ఆయన తెలిపారు. నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా మిలన్ ప్రధాన్, బిజెపి అభ్యర్థిగా హసిరాణి రాత్ పోటీలో ఉన్నారని సిబల్ పేర్కొన్నారు. 'సెప్టెంబర్ 17 సాయంత్రం, ఎన్నికల సంఘం టీఎంసీ గుర్తును స్తంభింపజేసింది. ఇది చాలా అసాధారణమైన విషయం ఎన్నికల ప్రకటన అప్పటికే వెలువడింది, అదే సమయంలో పార్టీ గుర్తును కూడా స్తంభింపజేశారు' అని ఆయన అన్నారు. ఆ తర్వాత సంచితా ప్రధాన్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారని సిబల్ చెప్పారు. ఆమె నామినేషన్ ఉపసంహరణ అనంతరం, సెప్టెంబర్ 18న సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో మమతా బెనర్జీ వర్గం కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు. అదే రోజు సాయంత్రం 5:30 నుండి 6:30 గంటల మధ్య, 2007 నాటి ఒక ఘటనకు సంబంధించి 2021, 2023లో జారీ అయిన వారెంట్ల ఆధారంగా ప్రధాన్‌ను అరెస్టు చేశారని సిబల్ పేర్కొన్నారు. ఈ అరెస్టును 'ప్రజాస్వామ్య హత్య'గా అభివర్ణించిన సిబల్, ఇది వ్యవస్థాగత జవాబుదారీతనం లేకపోవడాన్ని ఎత్తిచూపుతోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సంఘం, రాష్ట్ర అధికారుల తీరును ఆయన విమర్శిస్తూ, ఈ పరిణామాలను ఒక 'వికారమైన కుట్ర'గా, 'జవాబుదారీతనం లేని సంపూర్ణ నిరంకుశత్వం'గా అభివర్ణించారు.

# విద్యార్థి ప్రాణం తీసిన చాట్ జిపిటి

**ముంబై:** కృత్రిమ మేధ (ఎఐ) ప్రజల, ప్రత్యేకించి విద్యార్థుల దైనందిన జీవితంలో వేగంగా భాగమవుతోంది. సమాచారాన్ని వెతకడం, అనువాదం చేయడం, పాఠాలు అర్థం చేసుకోవడం, రాయడం, కోడింగ్, వైద్య సమాచారంపై ప్రాథమిక అవగాహన పొందడం వంటి అనేక పనుల్లో ఎఐ మనిషికి సహాయక సాధనంగా మారింది. ఈ సాంకేతికతను ఉపయోగించడంలో సహజంగానే ఎలాంటి ప్రమాదం లేదు. అయితే ఒక సాధనాన్ని ఉపయోగించడం, ఆ సాధనంపైనే ఎక్కువగా ఆధారపడటం మధ్య చాలా తేడా ఉంది. ముంబయి ఐఐటిలో చోటు చేసుకున్న తాజా ఘటన ఈ తేడాను మరోసారి గుర్తుచేస్తోంది. వివరాల్లోకి వెళ్తే..పరీక్షలో చాట్ జిపిటి ఉపయోగిస్తూ పట్టుబడ్డ ఐఐటి బాంబే విద్యార్థి హాస్టల్‌లోని తన గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహారాష్ట్ర యవత్మాల్ జిల్లాకు చెందిన సాహిల్ రవీంద్ర వాకోడె (22) శుక్రవారం సాయంత్రం తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడని పోలీసులు తెలిపారు. సాహిల్ ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం రెండో సంవత్సరం చదువుతున్నాడని వారు పేర్కొన్నారు. ఐఐటి బాంబే అధికారుల వివరాల ప్రకారం పరీక్ష సమయంలో సమాధానాలు తెలుసుకోవడానికి ప్రశ్న పత్రాన్ని చాట్ జిపిటిలో అప్‌లోడ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించామని పోలీసులు వెల్లడించారు. సాహిల్ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరిపించాలని విద్యార్థులు ఆందోళన చేశారు. కాగా..సదరు సంస్థ ప్రకారం, పరీక్షలో జరిగిన ఘటనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ప్రారంభించలేదు. అధ్యాపకులు, విభాగాధిపతి విద్యార్థితో మాట్లాడి, అతని విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం ఉండదని భరోసా ఇచ్చినట్లు సంస్థ పేర్కొంది. ఈ మరణానికి ఖచ్చితమైన కారణాలను దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారించలేం. అందువల్ల ఎఐ వినియోగాన్ని ఈ విషాదానికి నేరుగా కారణంగా పేర్కొనడం కూడా సరికాదు. అయితే ఈ ఘటనను విస్తృతమైన ప్రశ్నను పరిశీలించడానికి ఒక ఉదాహరణగా చూడవచ్చు. ఎఐ మనకు సమాధానం ఇవ్వగలదు. కానీ ప్రతి సమాధానాన్ని మనమే ఆలోచించి అర్థం చేసుకునే అలవాటును అది భర్తీ చేయకూడదు. విద్యార్థి ఒక సమస్యను ఎదుర్కొన్నప్పుడు ముందుగా ఆలోచించడం, తప్పులు చేయడం, మళ్లీ ప్రయత్నించడం, ఉపాధ్యాయుడిని లేదా సహచరుడిని సంప్రదించడం వంటి ప్రక్రియలు నేర్చుకునే భాగాలు. ప్రతి దశలో ఎఐ సమాధానాన్ని సిద్ధంగా అందిస్తే, ఆలోచనా ప్రక్రియ క్రమంగా బలహీనపడే ప్రమాదం ఉంది. ఇదే విషయం విద్యా వ్యవస్థను దాటి సమాజానికీ వర్తిస్తుంది.

# డియుఎస్‌యు ఎన్నికల్లో ఎబివిపి విజయం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (డియుఎస్‌యు) ఎన్నికలలో, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అయిన ఎబివిపి నాలుగు కేంద్ర ప్యానెల్ పదవులలో మూడింటిని గెలుచుకుంది. అదే సమయంలో, ఎన్‌ఎస్‌యుఐ టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దీపాన్షు షోకీన్ ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నాడు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యుఐ) ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. అయితే ఆ యూనియన్ అభ్యర్థులు అధ్యక్ష, సంయుక్త కార్యదర్శి పదవులను చాలా తక్కువ తేడాతో కోల్పోయారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 13,700కు పైగా భారీ ఓట్ల మెజారిటీతో ఉపాధ్యక్ష పదవిని గెలుచుకున్న ఎన్‌ఎస్‌యుఐ రెబల్ అభ్యర్థి దీపాన్షు షోకీన్ కారణంగా ఎన్‌ఎస్‌యుఐకు తీవ్ర ఎదురుదెబ్బ తాకింది. ఎబివిపి అధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను గెలుచుకోవడంతో, ఎన్‌ఎస్‌యుఐ నాలుగు కేంద్ర ప్యానెల్ పదవులలో దేనినీ సాధించలేకపోయింది. జంతర్ మంతర్ వద్ద జన్ జీ నిరసనలు, ఐదుగురు ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న సత్యనికేతన్ భవనం కూలిపోయే ఘటన వంటి పరిణామాల నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో, ఎబివిపి అభ్యర్థి యశ్ దాబాస్ అధ్యక్ష పదవిని గెలుచుకుని ఘనవిజయం సాధించారు. అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో, దాబాస్ 24,576 ఓట్లు సాధించి, ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాను 2,053 ఓట్ల తేడాతో ఓడించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దీపాన్షు షోకీన్ 30,615 ఓట్లతో ఉపాధ్యక్ష పదవిని గెలుచుకున్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో, సమాజ్‌వాదీ ఛాత్ర సభ అభ్యర్థికి వచ్చిన 15,778 ఓట్లతో పోలిస్తే ఎబివిపి అభ్యర్థి 16,615 ఓట్లు సాధించారు. కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో, ఎబివిపి అభ్యర్థి 21,650 ఓట్లు సాధించగా, ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి 14,869 ఓట్లు పొందారు. షోకీన్, విశేష్ యాదవ్‌లతో సహా స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీని ఇచ్చారు. ఎబివిపి, ఎన్‌ఎస్‌యుఐ రెండింటికీ చెందిన గణనీయమైన సంఖ్యలో ఓట్లను చీల్చడం ద్వారా వారు ఫలితాలను ప్రభావితం చేయగలిగారు. ఎబివిపికి చెందిన లక్ష్య రాజ్ సింగ్ 16,615 ఓట్లు సాధించి సంయుక్త కార్యదర్శి పదవిని గెలుచుకోగా, ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి గోపాల్ చౌదరి 15,206 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు.

# మమత పార్టీలో హైడ్రామా


- పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన రెజీనగర్ అభ్యర్థి
- గంటల్లో నిర్ణయం ఉపసంహరణ : పోటీలో ఉన్నట్లు ప్రకటన



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికలవేళ నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మమతా బెనర్జీ పార్టీ తరపున రెజీనగర్ ఉప ఎన్నిక అభ్యర్థిగా ఉన్న రబియుల్ ఆలం చౌదరి శనివారం నాడు పోటీ నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, కొన్ని గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను వెనక్కి తీసుకుని, పార్టీ అధినేత్రి కోరిక మేరకు అక్టోబర్ 6న జరిగే ఎన్నికల పోరులో పాల్గొంటానని స్పష్టం చేశారు. నందిగ్రామ్ ఉప ఎన్నికలో మమతా పార్టీ అభ్యర్థిగా ఉన్న సంచితా ప్రధాన్ డే, సువేందు అధికారితో సమావేశమైన తర్వాత తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్న మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. మాజీ టిఎంసి ఎమ్మెల్యే అయిన చౌదరి, అంతకుముందు ముర్షిదాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ 'నిరంతరం వేధింపులకు గురవుతున్న క్షేత్రస్థాయి కార్యకర్తలను ఉత్సాహపరచడం నాకు కష్టంగా మారింది. అలాగే, ఇంత తక్కువ సమయంలో ఓటర్లకు కొత్త 'ఫుట్‌బాలర్' గుర్తు గురించి అవగాహన కల్పించడం కూడా చాలా కష్టమైన పని. ఈ పరిస్థితుల్లో, పోటీ చేయకూడదన్న నా నిర్ణయాన్ని శుక్రవారం రాత్రే మమతా దీదీకి తెలియజేశాను...' అని అన్నారు. అయితే, కొన్ని గంటల తర్వాత హడావిడిగా ఏర్పాటు చేసిన మరో విలేకరుల సమావేశంలో 'నేను ఉప ఎన్నికలో పోటీ చేస్తాను. పార్టీ అధినేత్రి (మమత) జోక్యం చేసుకున్న తర్వాత పోలీసులు నాకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు... నేను పార్టీ అధినేతతో మాట్లాడాను, వారు నన్ను ఎన్నికల బరి నుండి తప్పుకోవద్దని సూచించారు. నేను బెల్డంగా పోలీస్ స్టేషన్ అధికారులను కలిశాను, ప్రచార సమయంలో నాకు, నా కార్యకర్తలకు భద్రత కల్పిస్తామని వారు కూడా హామీ ఇచ్చారు. నా మునుపటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాను. మా కార్యకర్తలు ఎవరూ వేధింపులకు గురికాకుండా చూసుకుంటాను. నా దగ్గర కేవలం 10 మంది కార్యకర్తలు ఉన్నా సరే, నేను గెలుస్తాను' అని ఆయన స్పష్టం చేశారు.

# అవినీతి కేసులో ప్రభుత్వ ఉద్యోగిని నిర్దోషిగా విడుదల చేసిన సుప్రీంకోర్టు

సిబిఐ విచారణలో లోపాలు, అసహనాన్ని ఎత్తిచూపిన ధర్మాసనం



**న్యూఢిల్లీ :** రెండు దశాబ్దాలకు పైగా పాతదైన ఒక అవినీతి కేసులో, లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై ఉచ్చు పన్నిన నేపథ్యంలో, అత్యున్నత న్యాయస్థానం ఒక ప్రభుత్వ ఉద్యోగిని నిర్దోషిగా విడుదల చేసింది. అదే సమయంలో, ఈ కేసు దర్యాప్తులో సిబిఐ నుంచి ఉన్న 'తీవ్రమైన లోపాలు, అసహనాన్ని' కూడా సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. ప్రత్యేక విచారణ కోర్టు విధించిన అతని నేర నిర్ధారణ, శిక్షను ధృవీకరించిన కేరళ హైకోర్టు వెలువరించిన మే 2024 ఉత్తర్వులను సవాల్ చేస్తూ అతను దాఖలు చేసిన అప్పీళ్లపై తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, 'ఆ ఉచ్చును పూర్తిగా అమలుకానివ్వలేదు' అని స్వాధీనం చేసుకున్న లంచం డబ్బు అతని కోసమేనని సిబిఐ నిరూపించలేకపోయిందని పేర్కొంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్‌గా పనిచేస్తున్నప్పుడు బదిలీలు, పోస్టింగ్‌లు, ఇతర సర్వీస్ సంబంధిత ప్రయోజనాలను కోరుతున్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది నుండి, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కింది స్థాయి అధికారుల ద్వారా అక్రమ లంచాలు డిమాండ్ చేయడం, పొందడం ద్వారా అప్పీల్‌దారుడు తన అధికారిక పరిధిని దుర్వినియోగం చేశాడనే ఆరోపణను ఎదుర్కొన్నాడు. ఈ దర్యాప్తు అక్రమ లంచాల ఆరోపణలకు సంబంధించిన వేర్వేరు లావాదేవీల ఆధారంగా పలు తుది నివేదికలను దాఖలు చేయడం, అనేక అభియోగాలను ప్రారంభించడంతో ముగిసింది. ఈ కేసులో ఉచ్చు పన్నిన తీరులో సందేహాస్పద అంశాలు ఉన్నాయని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్. కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అప్పీల్‌దారుడు లంచం డిమాండ్ చేశాడనే ఆరోపణల గురించి ఫిర్యాదుదారుడు 2005 ఆగస్టు 3న సిబిఐకి తెలియజేయగా, దర్యాప్తు సంస్థ మరుసటి రోజే ఉచ్చు పన్నాలని నిర్ణయించుకుందని ధర్మాసనం పేర్కొంది. 2005, ఆగస్టు 4న ఎఫ్‌ఐఆర్ నమోదైందని అదే రోజు ఉచ్చు పన్నారని అందులో పేర్కొన్నారు.'అధికారికంగా ఎఫ్‌ఐఆర్ నమోదు కాకముందే, లంచం ఫిర్యాదును ధృవీకరించడం ద్వారా సిబిఐ ఒక విచారణార్హమైన నేరం(కాగ్నిజిబుల్ ఆఫెన్స్)పై దర్యాప్తు ప్రారంభించడం ఆశ్చర్యం కలిగిస్తోందని ధర్మాసనం తెలిపింది. అంతేకాకుండా, ఉచ్చు పన్నడానికి చాలా తక్కువ వ్యవధిలోనే సిబిఐ ఇద్దరు స్వతంత్ర సాక్షులను ఏర్పాటు చేసినట్లు కూడా గమనించబడింది' అని సెప్టెంబరు 16న వెలువరించిన తన తీర్పులో ధర్మాసనం పేర్కొంది. ఇంత 'అసాధారణ వేగం'తో ఉచ్చు పన్నినందుకు దర్యాప్తు సంస్థను తప్పు పట్టలేనప్పటికీ, దానిపై కొన్ని సందేహాలు తలెత్తుతున్నాయని బెంచ్ తెలిపింది. ట్రయల్ కోర్టు అప్పీల్‌దారుడు లేవనెత్తిన సందేహాలను తోసిపుచ్చిందని ధర్మాసనం పేర్కొంది. 'ట్రయల్ కోర్టు గుర్తించిన లోపాలు, మా అభిప్రాయంలో, ప్రాసిక్యూషన్ కేసుపై సహేతుకమైన సందేహాన్ని కలిగిస్తున్నాయి' అని ద్విసభ్య ధర్మాసనం వివరించింది. 'సహేతుకమైన సందేహాలు ఇంకా మిగిలి ఉన్నందున', అప్పీల్‌దారుడిపై ఉన్న అభియోగం రుజువైందని చెప్పలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రెండు అప్పీళ్లను అనుమతిస్తూ, ఈ కేసుల్లో అప్పీల్‌దారుడిని అన్ని ఆరోపణల నుంచి సుప్రీంకోర్టు నిర్దోషిగా విడుదల చేసింది.

# రాష్ట్రపతి పాలన విధించినట్లయితే యుటి ఎల్‌జిలకు... అంతర్‌రాష్ట్ర మండలి సమావేశాలలో పాల్గొనే ఛాన్స్

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంబంధిత నిబంధనలను సవరించిన నేపథ్యంలో పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతాలలో రాష్ట్రపతి పాలన అమలులో ఉన్నప్పుడు, ఆయా ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు (ఎల్‌జిలు) అంతర్‌రాష్ట్ర మండలి సమావేశాలలో పాల్గొనే అవకాశం కలుగుతుంది. మండలిని ఏర్పాటుచేసిన 1990 అంతర్‌రాష్ట్ర మండలి ఉత్తర్వులోని సవరణను, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెప్టెంబరు 9న నోటిఫై చేయగా, శుక్రవారం (సెప్టెంబరు 18న) ప్రచురించింది. 1990 మే నాటి ఉత్తర్వు ప్రకారం, ఈ అంతర్‌రాష్ట్ర మండలిలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, నిర్దిష్ట కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు, కేబినెట్ హోదా కలిగిన ఆరుగురు కేంద్ర మంత్రులు ఉంటారు. ఆ సంవత్సరం జులైలో ప్రవేశపెట్టబడిన దాని నిబంధన, వారి వారి రాష్ట్రాలలో ఆర్టికల్ 356 కింద ప్రకటన అమలులో ఉన్నప్పుడు, లేదా జమ్మూ, కశ్మీర్ రాజ్యాంగంలోని సెక్షన్ 92 కింద పూర్వపు జమ్మూ, కశ్మీర్ రాష్ట్ర గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వు అమలులో ఉన్నప్పుడు గవర్నర్ హాజరును ప్రస్తావించింది. 2019లో, ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌ను, జమ్మూ కశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. 2026 నాటి ఉత్తర్వు, 1990 జులై నాటి ఆ నిబంధన స్థానంలో నాలుగు భాగాలు కలిగిన ఒక నిబంధనను ప్రవేశపెడుతుంది. ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రానికి సంబంధించిన నిబంధనను ఇది కొనసాగిస్తుంది. 'ఆ రాష్ట్ర గవర్నర్‌ను కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడానికి ఆహ్వానించాలి' అని ఆ ఉత్తర్వు నిర్దేశిస్తుంది. ఆ తర్వాత, శాసనసభలు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన మూడు నిబంధనలను ఇదిజోడిస్తుంది. శాసనసభలు కలిగిన మూడు కేంద్ర పాలిత ప్రాంతాల (పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్, ఢిల్లీ ఎన్‌సిటి) పాలనకు సంబంధించిన చట్టాలలోని నిబంధనల ప్రకారం రాష్ట్రపతి పాలన విధించినప్పుడు, ఆయా కౌన్సిల్ సమావేశాలలో లెఫ్టినెంట్ గవర్నర్ పాల్గొనడానికి ఈ సవరణ వీలు కల్పిస్తుంది. పుదుచ్చేరికి సంబంధించి , 1963 కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టంలోని సెక్షన్ 5 కింద ఒక ఉత్తర్వు అమలులో ఉన్నప్పుడు, 'పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్‌ను మండలి సమావేశాలకు హాజరుకావడానికి ఆహ్వానించాలి' అని ఇది నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 293 ఎబి కింద ఏదైనా ఉత్తర్వు అమలులో ఉన్నప్పుడు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఆహ్వానిస్తారని అది పేర్కొంది. ఒక రాష్ట్రంలో లేదా కేంద్రపాలిత ప్రాంతంలో రాజ్యాంగ యంత్రాంగం విఫలమైనప్పుడు రాష్ట్రపతి పాలన విధిస్తారు.

# సైబర్ వలలో యుపి ఎమ్మెల్యే

- ఫోన్‌పే, యుపిఐ ద్వారా సుమారు రూ.1.55 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

**ప్రయాగ్‌రాజ్ :** సైబర్ వలలో పడి డబ్బులు కోల్పోయిన ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువ అవుతున్నాయి. సామాన్యుల నుంచి మొదలుకుని ప్రజాప్రతినిధుల వరకు కేటుగాళ్లు ఎవరిని వదిలిపెట్టడంలేదు. తాజాగా, ఉత్తర్‌ప్రదేశ్ కౌశంబీ జిల్లాలో చాయల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పూజా పాల్, సైబర్ మోసగాళ్ల బారిన పడ్డారు. సైబర్ కేటుగాళ్లు ఆమె బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసి, ఫోన్‌పే, యుపిఐ ద్వారా సుమారు రూ.1.55 లక్షలు కాజేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు ఆధారంగా, ప్రయాగ్‌రాజ్ కమిషనరేట్‌లోని ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం, ఎమ్మెల్యే పూజా పాల్‌కు ధూమన్‌గంజ్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉంది. అయితే, ఈ ఏడాది ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 13 మధ్య, ఆమె ఖాతా నుంచి ఫోన్‌పే, యుపిఐ ద్వారా అనేక అనుమానాస్పద లావాదేవీలు జరిగాయి. సెప్టెంబర్ 14న ఆమె ఖాతా స్టేట్‌మెంట్ బ్యాంక్ వివరాలను పరిశీలించినప్పుడు ఈ మోసం బయటపడింది. అయితే, అప్పటికే, మోసగాళ్లు ఆమె ఖాతా నుంచి విడతల వారీగా డబ్బును లాగేసుకున్నారు. ఈ మోసాన్ని గుర్తించిన పూజా పాల్, సైబర్ క్రైమ్ అధికారులకు, స్థానిక ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్, సంబంధిత బ్యాంకులో ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించి యుపిఐ లావాదేవీల స్క్రీన్‌షాట్‌లు, బ్యాంకు స్టేట్‌మెంట్‌లను పోలీసులకు అందించారు. తన ఐఫోన్ 17ను ఎవరో హ్యాక్ చేసి ఈ అనధికార లావాదేవీలు నిర్వహించి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పూజా పాల్ ఫిర్యాదు ఆధారంగా, ధూమన్‌గంజ్ పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# అణుశక్తి పురోగతిని వ్యతిరేకులు అడ్డుకుంటున్నారు

- ప్రధాని మోదీ
- వాతావరణ మార్పులకు అభివృద్ధి చెందుతున్న దేశాలను తరచూ నిందిస్తున్నారని ధ్వజం

**న్యూఢిల్లీ :** అభివృద్ధిచెందిన దేశాలు భారతదేశం కంటే ఆరు రెట్లు ఎక్కువగా తలసరి కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయని, అయినప్పటికీ, వాతావరణ మార్పులకు అభివృద్ధి చెందుతున్న దేశాలను తరచుగా, అన్యాయంగా నిందిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీధ్వజమెత్తారు. ఆయన శనివారం ఇక్కడ పర్యావరణం, వాతావరణంపై జరిగిన అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ, అణుశక్తి ఉత్పత్తిపై దేశం వేగంగా పని చేస్తోందని చెప్పారు. అయితే, తాను అణుశక్తి ఉత్పత్తిపై పనిని ముందుకు తీసుకెళ్లినప్పుడల్లా, పర్యావరణం గురించి గట్టిగా ప్రభోదించే వారే, ప్రభుత్వ అణుకార్యక్రమాలను నిలిపివేయడానికి కోర్టు కేసులు వేస్తూ స్వచ్ఛ ఇంధన పరిష్కారాలను చురుకుగా వ్యతిరేకిస్తున్నారని ప్రధాని ఆరోపించారు. 'కార్బన్ ఉద్గారాల బాధ్యతను తరచుగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తప్పుగా మోపుతున్నారనే విషయం మనందరికీ తెలుసు. అయితే, చారిత్రక వాస్తవం ఏమిటంటే, నేటికీ తలసరి కార్బన ఉద్గారాల విషయంలో భారతదేశం వాటా ప్రపంచ సగటులో సగం కన్నా తక్కువగానే ఉంది' అని పర్యావరణ నిపుణులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు, ఉన్నత ప్రభుత్వ అధికారులు హాజరైన రెండు రోజుల కార్యక్రమంలో ఆయన తెలిపారు. భారతదేశంతో పోలిస్తే, అభివృద్ధి చెందిన దేశాలలో తలసరి కార్బన్ ఉద్గారాలు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని, ఈ వాస్తవాన్ని న్యూఢిల్లీ ప్రపంచ వేదికలపై బలంగా బలంగా ప్రస్తావిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. 'ప్రతీ భారతీయుడికి నేను చెప్పేది ఏమిటంటే, మీరు కూడా ఈ విషయాన్ని బలంగా చెప్పండి' అని మోదీ కోరారు. భారతదేశం ప్రపంచంలోని ఇతర దేశాలతో కలిసి పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని తెలియజేశారు. 'మన అభివృద్ధి వేగవంతమైనది, అలాగే సుస్థిరమైనది' అని మోదీ నొక్కిచెప్పారు. భారతదేశం పునరుత్పాదక ఇంధనంపై దృష్టి సారిస్తోందని, పారిస్ (సిఓపి 21) ఒప్పందానికి నిర్దేశించిన గడువు కంటే చాలా ముందే తన కట్టుబాట్లను నెరవేర్చిన ఏకైక దేశం జి–20లో భారతదేశం మాత్రమేనని ప్రధాని చెప్పారు. ఇదే నూతన భారతదేశపు శక్తి. శిలాజేతర ఇంధనాలు, సౌరశక్తి సామర్థ్యం, కార్బన్ ఉద్గారాల నిలుపుదల..ఇలాంటి అన్ని కొలమానాల్లో భారతదేశపు పనితీరు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది' అని ఆయన తెలియజేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
20-09-2026
www.prajapaksham.in
ప్రపంచం
WORLD NEWS

# రష్యా డ్యూమాకు కొనసాగుతున్న ఎన్నికలు

● ఉక్రేన్ ఆక్రమిత ప్రాంతాల్లో తొలిసారి పోలింగ్ ● మా భవితకోసం ఓటేశాం:డోనెట్స్క్ ఓటర్ వెల్లడి



**మాస్కో:**ఒకవైపు ఉక్రేన్‌తో యుద్ధం ఉద్ధృతస్థాయిలో కొనసాగుతున్న తరుణంలో రష్యా పార్లమెంటు డ్యూమా (దిగువసభ )కు తొమ్మిదవసారి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. సెప్టెంబరు 18న ప్రారంభమైన పోలింగ్ శనివారం రెండోరోజు కూడా జోరుగా కొనసాగింది. ఆదివారం రాత్రి వరకూ పోలింగ్ కేంద్రాలు తెరచే ఉంటాయని ఎన్నికల అధికారులు ప్రకటించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో రెండోరోజు శనివారం పోలింగ్ ఎంతో ఉత్సాహంగా కొనసాగుతోందని ఎన్నికల సంఘం ఛైర్మన్ (సిఇసి)ఎల్లా పామ్‌ఫిలోవా చెప్పారు. 89 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఖచ్చితమైన సమయానికి తెరచుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నాయని ఆమె చెప్పారు.ఉక్రేన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మొదటిసారి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉక్రేన్‌లో ఆక్రమించిన ప్రాంతాలను కూడా కలిపి కొత్త రీజియన్స్‌లో మొదటిసారి ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నారు. డోనెట్స్క్‌లో జరిగిన పోలింగ్ సందర్భంగా అక్కడి ఓటర్లు ''తమ భవిష్యత్తుకోసం ఈ ఓటింగ్‌లో పాల్గొంటున్నాం'' అని చెప్పారు. ఉక్రేన్‌లో దాదాపు 20 శాతం ప్రాంతాన్ని రష్యా తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. డోనెట్స్క్, లూహాన్స్క్, జపోరిఝియా,ఖెర్సాన్‌ఓబ్లాస్ట్ రీజియన్లు రష్యా అధీనంలో ఉన్నాయి. రష్యన్ ఫెడరేషన్ పరిధిలో నిర్ణీత సమాయనికి ముందుగానే 46,63,960 మంది ఓటు హక్కు ఉపయోగించుకున్నారని సిఇసి ఎల్లా పామ్ ఫిలోవా శనివారం మీడియా సమావేశంలో చెప్పారు.మార్షల్ లా అమలులో ఉన్న 12 ప్రాంతాలలో 44 లక్షలమంది ప్రజలు ముందుగానే ఓట్లు వేశారని చెప్పారు.450 స్థానాలు ఉన్న రష్యా డ్యూమాలో అధికారం చెలాయించడానికి ఏ పార్టీ అయినాగానీ 226 స్థానాలు గెలుచుకోవాలి.దిగువసభ ''ఫెడరల్ అసెంబ్లీ''కి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో ఆల్ రష్యన్ పొలిటికల్ పార్టీ ''యునైటెడ్ రష్యా'' 324 సీట్లు గెలుచుకుని 48.9 శాతం ఓట్లతో అధికారం చేపట్టింది. యునైటెడ్ రష్యా 2001 నుండీ అధికారంలో కొనసాగుతోంది.2011లో పుతిన్ స్థాపించిన ఆల్ రష్యా యునైటెడ్ ఫ్రంట్‌లో యునైటెడ్ రష్యా ప్రధానపార్టీగా ఉంది. ఈసారి ఎన్నికల్లో మొత్తం పది పార్టీలు పాల్గొంటున్నాయి.యునైటెడ్ రష్యాతో పాటు కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ద రష్యన్ ఫెడరేషన్,న్యూ పీపుల్,ఎ జస్ట్ రష్యా–ఫర్ ట్రూత్,పార్టీ ఆఫ్ పెన్షనర్స్ ఫర్ సోషల్ జస్టిస్,కమ్యూనిస్ట్స్ ఆఫ్ రష్యా,రోడినా,పార్టీ ఆఫ్ డైరెక్ట్ డెమోక్రసీ,గ్రీన్స్ ఎకోలాజికల్‌పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రష్యాలోని 39 ప్రాంతీయ విభాగాలకు సంబంధించిన ప్రాంతీయ శాసనసభలకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి.ఎనిమిది ప్రాంతాలలో నాయకులు నేరుగా ఎన్నికవుతారు. మూడు ప్రాంతాలలో నాయకులను ప్రాంతీయ పార్లమెంటులు ఎన్నికల చేస్తాయి.మొత్తం 23,000 స్థానాలను ఎన్నికల ద్వారా భర్తీచేస్తారు.

# హెచ్–1బికి మరో ఏడాది లక్షడాలర్ల ఫీజు

ట్రంప్ తాజా ఉత్తర్వు




**వాషింగ్టన్:**కొత్తగా హెచ్–1 బి వీసాలు మంజూరు చేయడానికి లక్ష డాలర్లు ఫీజు చెల్లించాలని ట్రంప్ గతంలో విధించిన ఉత్తర్వును ఏడాదిపాటు పొడిగించారు. గత ఏడాది అమలులోకి తెచ్చిన ఈ రుసుము విధింపు ఉత్తర్వు గడువు ఈనెలాఖరుతో పూర్తి కావాల్సి ఉండగా దీనిని మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వు ఇచ్చారు. ఇప్పటికే అఎరికాలో విద్యార్థి వీసాలపై లక్షలమంది ఉన్నారు. గతంలో హెచ్–1 బి వీసాలు తీసుకున్నవారికి ఈ లక్షడాలర్ల ఫీజు వర్తించదు.ఈ పరిస్థితుల్లో నవంబరు ఎన్నికల ఒత్తిడిని తట్టుకోవడానికి గడువు పెంచారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వరంగ విభాగాలమధ్య సమన్వయంతో కఠినంగా ఈ వీసాలను మీక్ష చేయడానికి,దరఖాస్తుల పరిశీలను కఠినతరం చేయడానికి మరో ప్రత్యేక ఉత్తర్వు కూడా జారీ చేశారు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న విదేశీ నైపుణ్య కార్మికుల పరిస్థితిని సమీక్షిండానికి సంబంధించి యాజమాన్యాలను ప్రశ్నించడానికి 30 రోజులు గడువు ఇచ్చారు. అనర్హులను చిన్న ఉద్యోగాల్లో కొనససాగిస్తే యాజమాన్యాలపై ఈ సమీక్ష ద్వారా చర్యలు తీసుకుంటారు. ఈ వీసాల వల్ల ప్రయోజనం పొందేవారిలో భారతదేశీయులే అగ్రస్థానంలో ఉన్నారు.అమెరికన్లు చేయగలిగిన చిన్న చిన్న ఉద్యోగాలను కూడా ఈ వీసాలు ఇచ్చి విదేశీయులను పిలిపించి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నారని, కేవలం ఎంతో గొప్ప నైపుణ్యం ఉన్న ఉద్యోగులను రప్పించడంకోసమే ఈ వీసాలను ఉపయోగించాలనేది ట్రంప్ ఉద్దేశం. హెచ్–1 బి వీసాలకు ఈ విధంగా ఏడాదిపాటు లక్ష డాలర్లు రుసుము ఈ వీసాలపై విధించడంవల్ల స్థానికంగా పుట్టిన దేశీయ అమెరికన్ పౌరులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, జాతీయ భద్రతకు భరోసా వస్తుందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పారు.హెచ్–1బి వీసా మంజూరు చేయడానికి లక్ష డాలర్లు విదేశీయులు చెల్లించాలని ట్రంప్ 2025లో తెచ్చిన ఉత్తర్వు ఇప్పటికే న్యాయపరమైన సవాళ్ళను ఎదుర్కొంటోంది.అమెరికాలోని రెండు వేరు వేరు న్యాయస్థానాలలో ఈ విషయంపై విచారణలు కొనసాగుతున్నాయి. లక్షడాలర్లు వసూలు చేయాలనే ఉత్తర్వులు ఇచ్చినప్పటినుండీ అమెరికాలోని అత్యున్నత స్థాయీ ఐటీ కంపెనీలకు ఈ వీసాలపై వచ్చేందుకు విదేశీ ఉద్యోగులు దాఖలు చేసుకునే రిజిస్ట్రేషన్లు 92 శాతం మేరకు తగ్గారని ట్రంప్ వాదిస్తున్నారు. ఈ ఉత్తర్వు ద్వారా గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. ఈ విధానం వల్ల అమెరికాలో ఉంటే స్థానిక గ్రాడ్యుయేట్లకు ఉద్యోగావకాశాలు పెరుతాయన్నారు. దేశంలో లేని, అత్యున్నతమైన నైపుణ్యంగల ఉద్యోగులను మాత్రమే అవసరాలకు అనుగుణంగా కంపెనీలు అమెరికాకు తెచ్చుకోవడానికి వీలు కలగుతుందని, ఇప్పటివరకూ ఈ విధానంపై కఠిన నిబంధనలు లేకపోవడంవల్ల నైపు ణ్యంతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ అమెరికా వస్తున్నారని, చిన్న చిన్న ఉద్యోగాలలో చేరుతున్నారని, దీనివల్ల స్థానికంగా పుట్టిన అమెరికన్లు తాము చేయగలిగిన ఉద్యోగావకాశాలు కూడా కోల్పోతున్నారని ట్రంప్ అన్నారు. ఈ ఉత్తర్వు ద్వారా ఈ పరిస్థితిని అదుపు చేశామన్నారు.

# రష్యాపై ఆంక్షల బిల్లుకు చట్టరూపం

**వాషింగ్టన్:**రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు వీలుగా అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించన బిల్లుపై ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. ఈ చట్టం ద్వారా ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడానికి విశేషాధికారాలు లభిస్తాయి. కానీ రష్యాకు అనేక దశాబ్దాలుగా చమురు,సహజవాయువు కొనుగోలుదారుడిగా ఉన్న చైనాపై ఆంక్షలను అమలు చేయడం ట్రంప్‌కు అంత తేలికైన విషయం కాదు.చైనా నుండి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించినప్పుడు ఎంతో సాహసంతో సవాలు చేసిన చైనా కూడా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించింది.అంతర్జాతీయ చట్టాలతో,భద్రతా మండలితో సంబంధం లేని ఈ చట్టం చైనాను తమ పట్టించుకోబోమని, దానికి ఎలాంటి చట్టబద్ధత లేదని ఇప్పటికే చైనా స్పష్టం చేసింది. భారతదేశం కూడా తగిన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు జరిమానాగా ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు.భారత్‌కు 40 శాతంగా ఉండే రష్యా చమురు దిగుమతులు ఆ తర్వాత 19 శాతానికి తగ్గిపోయాయి. అమెరికా సుప్రీంకోర్టు గడచిన ఫిబ్రవరిలో ట్రంప్ అడ్డగోలు సుంకాలను రద్దుచేశాక ఈ దిగుమతులు మళ్ళీ 51 శాతానికి పెరిగాయి.ఉక్రేన్‌ను ఆక్రమించాలని చూసే యుద్ధోన్మాది రష్యాను ప్రోత్సహిస్తున్నాయంటూ భారత్,చైనా సహా మరికొన్ని దేశాలను ట్రంప్ లక్ష్యంగా చేసుకుని ఈ చట్టం తీసుకువచ్చారు.గడచిన ఆగస్టునెలలో 86–11 ఓట్లతో సెనేట్, 262–159 ఓట్ల తేడాతో అమెరికా ప్రతినిధులసభ సెప్టెంబరు 17న ఆమోదించింది. ఈ మంత్రం ఎన్నికల ప్రచారానికి తప్ప చైనాపై పనిచేయదని అమెరికా బిజినెస్‌లాబీ పెదవి విరిచింది.

# మూడు మీడియా సంస్థలపై ట్రంప్ నిషేధం

● ఆ హక్కు నాకుందని ఉద్ఘాటన ● చట్టవిరుద్ధమైన దాడి:మీడియా ఖండన



**వాషింగ్టన్:**వైట్‌హౌస్ నుండి సిఎన్ఎన్,పొలిటికో, ఎంఎస్ నౌ మీడియా సంస్థలను డోనాల్డ్ ట్రంప్ నిషేధించారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని ప్రకటించారు. తప్పుడు కథనాలు, వ్యతిరేక కథనాలు రాసే మీడియా సంస్థలపై నిషేధం విధించే హక్కు,అధికారాలు తనకు ఉన్నాయని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ఈ మూడు మీడియా సంస్థలు కల్పిత కథలు, తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని, అసత్య ప్రచారం చేస్తున్నాయని వాటిని సహించలేనన్నారు.ఐతే ఆరోపణల నిర్ధారణకుగాను ఆయన ఎలాంటి ఉదాహరణలను పేర్కొనలేదు. ఇది చాలా సులభమైన నిషేధమన్నారు. ఐతే ఈ మీడియా సంస్థలను వైట్‌హౌస్ ప్రాంగణంలోకి రాకుండా అడ్డుకుంటారా? అనే విషయంలో ఎలాంటి స్పష్టతా లేదు.ఐతే ఈ నిషేధాన్ని సిఎన్ఎన్ సంస్థ చట్టవిరుద్ధమైన దాడిగా పేర్కొంది. తీవ్రమైన చర్యగా ఖండించింది. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆటంకాలు లేకుండా,ప్రభుత్వ జోక్యం లేకుండా రిపోర్టింగ్ చేయడానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం హక్కులు ఉన్నాయని సిఎన్ఎన్ ఒక ప్రకటనలో తెలియజేసింది. అధ్యక్షుడు విధించిన నిషేధం నిజంగా అమలులోకి వస్తే అది రాజ్యాంగ విరుద్ధం కాగలదని పేర్కొంది. ట్రంప్ చర్యను ఈ మూడు మీడియా సంస్థలు చట్టబద్ధంగా,న్యాయపరంగా సవాలు చేసి ప్రతిఘటించే అవకాశాలున్నాయి.ఈ ప్రకటన వెలువడిన తర్వాత కూడా సిఎన్ఎన్,పొలిటికో మీడియా సంస్థలకు చెందిన అధికార ప్రతినిధులు వైట్‌హౌస్ ప్రాంగణంలోనే తిరుగాడుతూ ఉంటున్నట్లు మీడియా గమనించింది. సిఎన్ఎన్ బృందం ఒకటి జె.డి.వాన్స్‌తో కలిసి అయోవాలో ఒక కార్యక్రమంలో పాల్గొంది. 'పొలిటికో' మీడియా సంస్థ కూడా ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ సార్వభౌమంలోని వైట్‌హౌస్ మాత్రమే కాదు, భవిష్యత్ వైట్‌హౌస్ కార్యకలాపాలను కూడా రిపోర్టింగ్ చేసే హక్కులు తమకు ఉన్నాయని పేర్కొంది. ఐతే ట్రంప్ చర్యను చట్టవిరుద్ధమైనదిగా ఫ్రీడమ్ ఆఫ్ ద ప్రెస్ ఫౌండేషన్ తప్పుపట్టింది. గతంలో కూడా ట్రంప్ ద వాల్ స్ట్రీట్ జర్నల్,ద న్యూయార్క్ టైమ్స్, బిబిసిసహా పలు అమెరికా, అంతర్జాతీయ మీడియా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థానాలలో వ్యాజ్యాల ఫలితంగా కొన్ని మీడియా సంస్థలు కోట్లాదిరూపాయలు పరిహారం చెల్లించడానికి సిద్ధపడ్డాయి. అదేవిధంగా బిబిసిపై ట్రంప్ వేసిన వ్యాజ్యం కోర్టులో ఇంకా విచారణలోనే ఉంది.

# క్యూబాలో మళ్ళీ గ్రిడ్ వైఫల్యం

● దేశవ్యాప్తంగా అంధకారం

**హవానా:**క్యూబాలో మరోసారి అంధకారం అలముకుంది. గ్రిడ్ విఫలం కావడంతో క్యూబా దేశవ్యాప్తంగా ప్రజలకు విద్యుత్ సరఫరా లేకుండాపోయింది. ఈ ఏడాదిలో ఈ విధంగా గ్రిడ్ విఫలం కావడం ఏడోసారి. విద్యుత్ గ్రిడ్ పూర్తిగా విఫలమైందని, ప్రజలు అంధకారంలో ఉన్నారని ఇంధన మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. ఒకవైపు అమెరికా చమురు ఆంక్షలు కొనసాగుతున్న సమయంలోనే క్యూబన్ ప్రజలు ఈ విద్యుత్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఐతే రాజధాని హవానాలోని కొన్ని ఆసుపత్రులు,నీటి పంపింగ్ కేంద్రాలకు కొద్ది గంటల తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. క్యూబాలో విద్యుత్ మౌలిక సదుపాయాలు అనేక దశాబ్దాలుగా ఉన్నవే. వాటిలో మార్పులు చేయలేదు. అమెరికా ఆంక్షల కారణంగా కొత్త విద్యుత్ సామాగ్రిని ఏర్పాటు చేసి కొత్త యంత్రాలు ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోవడంవల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి చేసుకోవడంలో తీవ్ర కొరతను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. ఒక ప్రత్యామ్నాయ విధానంగా సోలార్ ప్యానెల్స్‌ను క్యూబా అంతటా ఏర్పాటు చేస్తూ ప్రజలను ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలవైపు నడిపిస్తోంది.అదేవిధంగా ఇటీవలికాలంలో ఆహారం,ఔషధాల కొరత కొనసాగుతోంది. ఆసుపత్రులు కూడా సరిగ్గా పనిచేయలేని దశకు వస్తున్నాయి.పాఠశాలలను,కార్యాలయాలను తరచు మూసివేయాల్సి వస్తోంది. ఇవన్నీ అమెరికా అనుసరిస్తున్న విద్వేషపూరిత విధానాల ఫలితమే.గతంలో కేవలం అప్పుడప్పుడు మాత్రమే అవాంతరాలువచ్చేవని, ఇప్పుడు ఆంక్షలు పెరిగిపోవడంవల్ల తరచు అవాంతరరాలు వస్తున్నాయని క్యూబన్ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

# ప్రజల దృష్టి మళ్లించేందుకు బిఆర్ఎస్ నేతలడైవర్షన్ డ్రామాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కల్వకుంట్ల కుటుంబం భూ వ్యవహారాలు బయటపడటంతోనే బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు ప్రజల దృష్టి మళించేందుకు డైవర్షన్ డ్రామాలకు తెర లేపారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు . ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేవనెత్తిన భూ అంశాలపై సమాధానం చెప్పలేకనే నీటి సమస్యను తెరపైకి తెచ్చి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు ప్రధాన కారణాలని వారు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా లేక ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గాయని, ఈ పరిస్థితిపై ప్రభుత్వం ముందుగానే రైతులను అప్రమత్తం చేసిందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని ప్రభుత్వం సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు అవసరమైన విద్యుత్‌ను చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు.

# శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదం

● ముగ్గురు కూలీలు మృత్యువాత ● సపోర్ట్ రాళ్లు తేవడానికి వెళ్లిన మరో ఇద్దరు కూలీలకు తప్పిన ప్రాణగండం





**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఔటర్ రింగ్ రోడ్డుపై అశోక్ లేలాండ్ వాహనాన్ని డిసిఎం వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు కూలీలు మృత్యువాత పడిన సంఘటన శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ఎగ్జిట్ 7లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాద సంఘటన వివరాలను శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి తెలిపారు. హైద్రాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హుస్సేన్ (టిఎస్ 09 యుడి 3611) నెంబర్ గల అశోక్ లేలాండ్ వాహనాన్ని చేగుంట నుంచి స్క్రాప్ లోడ్ చేసుకుని నలుగురు కూలీలు ఇబ్రహీం, రింకు, అశోక్, బీమ్‌షాలను ఎక్కించుకుని శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కీసర వైపు వస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో అశోక్ లేలాండ్ వాహనం వెనక టైర్ పంక్చరయ్యింది. వాహనాన్ని ఎమర్జెన్సీ లైన్ పక్కకు ఆపాడు. ఆ వాహనం టైర్ పంక్చర్ చేయడానికి మహ్మద్ హుస్సేన్, రింకులు జాకీ, రాడ్లతో ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో షేక్ ఇబ్రహీం టార్చ్ లైట్ పట్టుకుని సహయ పడుతున్నాడు. మరో ఇద్దరు కూలీలైన బీమ్‌షా, అశోక్‌లు సపోర్ట్ రాళ్లు తేవడానికి సమీపంలోకి వెళ్లారు. ఆ సమయంలో ఔటర్ రింగ్ రోడ్డుపై మృత్యురూపంలో దూసుకొచ్చిన డిసిఎం వ్యాన్ (టిఎస్ 15 యుడి 8932) ను నడుపుతున్న డ్రైవర్ నాగరాజు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుతు అశోక్ లేలాండ్ వాహనాన్ని వెనకాల నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశోక్ లేలాండ్ వాహనం కింద ఉన్న ఇద్దరు కూలీలు మహ్మద్ హుస్సేన్ (26), రింకు(34)లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో కూలీ ఇబ్రహీం (20) తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. సపోర్ట్ రాళ్లు తేవడానికి వెళ్లిన బీమ్‌షా, అశోక్‌లకు ప్రాణగండం తప్పింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి తెలిపారు.

# త్రిముఖ వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షించనున్నారు. తద్వారా రవాణలో వేగం పెరగడంతో పాటు రవాణాలో పారదర్శకంగా సాగనుంది.

**'ఫిజికల్ వెరిఫికేషన్' యాప్‌తో ఆకస్మిక తనిఖీలు:**

క్షేత్రస్థాయిలో అధికారుల జవాబుదారీతనాన్ని పెంచేందుకు 'ఫిజికల్ వెరిఫికేషన్' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఈ యాప్ ద్వారా మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. తద్వారా కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు, నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. ముఖ్యంగా నకిలీ రశీదులు, ఫేక్ షీట్లు సృష్టించే పిపిసి ఇంఛార్జీలపై కఠిన చర్యలకు పౌర సరఫరాల శాఖ సిద్ధమవుతోంది.

**వర్షాల నుంచి ధాన్యానికి రక్షణ :**

ఖరీఫ్ కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను ముందుగానే అన్ని వసతులతో సిద్ధం చేస్తున్నారు. రైతులు తెచ్చిన ధాన్యం తడిసి నష్టపోకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు, నిల్వ ప్రాంతాల్లో మాయిశ్చర్ మీటర్లు, క్లీనర్లు, డ్రయ్యర్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ధాన్యం నాణ్యతను కాపాడటంతో పాటు తేమ కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించండి : స్టీఫెన్ రవీంద్ర**

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యేనాటికి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి శనివారం ఆయన ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాములు, ప్రత్యామ్నాయ నిల్వ ప్రాంతాలు, రవాణా వాహనాలు, హమాలీల లభ్యత, కొనుగోలు కేంద్రాల సన్నద్ధతపై వివరాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండి కొర్ర లక్ష్మి , జిల్లా పౌరసరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

# గ్రీన్‌లాండ్

(మొదటి పేజీ తరువాయి)

సంతకాల తతంగం పూర్తిచేస్తారని భావిస్తున్నట్లు వారు చెప్పారు.ఐతే ఒప్పందంలో ఏ అంశాలు ఉన్నాయో వారెవ్వరూ వివరించలేదు.భవిష్యత్తులో గ్రీన్‌లాండ్ ఒక స్వయంప్రతిపత్తి సార్వభౌమాధికారదేశంగా మారినప్పటికీ, ఈ ఒప్పందం గడువు ముగిసేఅవకాశం లేదని అంగీకృత నిబంధనలలో ఉన్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా విదేశాంగశాఖాధికారి చెప్పినట్లు బిబిసి పేర్కొంది. అదేవిధంగా గ్రీన్‌లాండ్,డెన్మార్క్ పాలకుల అనుమతి లేకుండానే ఈ ప్రాంతంలో సైనిక స్థావరాలను,కేంద్రాలను నిర్మించుకోవడానికి అమెరికాకు ఏకపక్ష అధికారాలున్నాయని అధికారి చెప్పారు.ఐతే నాటోయేతర దేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేయకుండా ఒప్పందం నిషేధిస్తుంది.అమెరికా తనకు కావాల్సినన్ని దళాలను గ్రీన్‌లాండ్‌కు పంపి అక్కడే ఉంచుకోవచ్చు. వ్యూహాత్మక ఆయుధాలను మోహరించవచ్చు.గ్రీన్‌లాండ్ వాయువ్య కొనప్రాంతం ఫిటుఫిక్‌లో ఇప్పటికే అమెరికా 100 మంది సైనికులను మోహరించింది.రక్షణ విషయం పక్కనపెడితే గ్రీన్‌లాండ్‌లో అత్యంత విలువైన,అరుదైన ఖనిజ సంపద ఉంది. ఈ ఖనిజాలు మొబైల్‌ఫోన్లు,ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఎంతో కీలకమైనవి.చైనా–రష్యాల నుండి అమెరికాపై భవిష్యత్తు దాడులను అడ్డుకోవాలంటే గ్రీన్‌లాండ్‌లో వ్యూహాత్మక ఆయుధాలు మోహరించాలని, యుద్ధ ఎత్తుగడల్లో అమెరికా రక్షణకు గ్రీన్‌లాండ్ అత్యంత కీలకమైన ప్రదేశమని,దానిని స్వాధీనం చేసుకుంటామని,లేకపోతే ఎంత డబ్బైనా ఇచ్చి కొనుగోలు చేస్తామని ఆ మధ్య ట్రంప్ ప్రకటనలతో తీవ్ర వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. దీనివల్ల నాటో కూటమిలో కూడా విభేదాలు బహిర్గతమయ్యాయి.ఈ రగడ చల్లారిపోయిందని అందరూ అనుకున్న తరుణంలో ట్రంప్ పట్టు వదలకుండా చాపకింద నీరులా తన ప్రయత్నాలన్నీ పూర్తిచేశారు.గ్రీన్‌లాండ్‌లో అపారమైన ఖనిజ సంపద ఉంది. ఈ విషయాన్ని ట్రంప్ మరుగున పరిచారు. చైనా–రష్యాలు అమెరికాపై దాడి చేయడానికి గ్రీన్‌లాండ్ అనువైన ప్రాతంగా ఉందని, వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా దీనిని అమెరికా రక్షణకు వ్యూహాత్మక ఆయుధ మోహరింపు కేంద్రంగా మార్చుకుంటానని అనేక నెలలు ట్రంప్ బహిరంగ ప్రకటనలు చేశారు.ఒప్పందం తర్వాత ఎలాంటి పూర్తిపాఠాన్నీ విడుదల చేయలేదు.గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని ట్రంప్ లేవనెత్తిన బెదిరింపులతో చెలరేగిన దౌత్యపరమైన వివాదాన్ని పరిష్కరిస్తూ ఒప్పందం కుదిరింది. పాక్షిక స్వయంప్రతిపత్తిగల డేనిష్ భూభాగం గ్రీన్‌లాండ్ భద్రత, ఇతర అవసరాలకు సంబంధించి ఈ ఒప్పందం ద్వారా శాశ్వత నియంత్రణ వచ్చిందని ట్రంప్ అన్నారు.ఈ ఒప్పందాన్ని డెన్మార్క్,గ్రీన్‌లాండ్ పాలకులు స్వాగతించారు. ''ఇకమీదట శత్రుదేశాలు మా స్పష్టమైన,లిఖితపూర్వక అనుమతి లేకుండా ఎలాంటి సైనిక కార్యకలాపాలు సాగించే దుస్సాహసానికి పాల్పడలేవు,ఈ మేరకు ఒప్పందంలో ఒక నిబంధన జోడించాం'' అని ఎక్స్ వేదికగా ట్రంప్ చెప్పారు.ఈ ఒప్పందంవల్ల అమెరికాకు ఎలాంటి ఖర్చు ఉండదని,గ్రీన్‌లాండ్ భద్రత,రక్షణకు సంబంధించి ఏం చేయాలన్నా అమెరికాకు ఈ ఒప్పందం పూర్తి అధికారాలు ఇస్తుందని చెప్పారు.గ్రీన్‌లాండ్ ద్వీపం భౌగోళికంగా ఉత్తర అమెరికా భూభాగంలో ఉన్నప్పటికీ సాంస్కృతికంగా యూరప్‌తోనే సంపూర్ణ అనుబంధం కలిగి ఉంది. అంటార్కిటికా తర్వాత అత్యధికంగా భూమి ఉపరితం అంతా ఐస్‌తో పేరుకుపోయి ఉంటుంది.మూడువంతుల భూభాగం మంచుగడ్డలతో నిండి ఉంటుంది.

# త్వరలో ముగింపు (మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్‌బి నగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాము బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్నా ఇప్పుడు వాటిని నెల రోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లు కూల్చదని స్పష్టం చేశారు. జీవో 118 సహకారంతో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకోని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ ఇబ్రహీం పట్నం శాసనసభ్యులు డి.సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపి, ఎల్ బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# లోటు వర్షపాతం

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలు, అలాగే పంజాబ్, సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల నుండి కూడా రుతుపవనాలు ఉపసంహరించుకోవడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆ శాఖ పేర్కొంది. 'సాధారణంగా సెప్టెంబర్ 17న జరగాల్సిన ఈ ప్రక్రియ, ఈ ఏడాది సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాల ఉపసంహరణతో మొదలైంది' అని ఐఎండి ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎండి గణాంకాల ప్రకారం ఆగస్టు 31న విడుదల చేసిన నెలవారీ అంచనాలో గత నెలలో దేశవ్యాప్తంగా 213.3 మి.మీ వర్షపాతం నమోదైందని ఐఎండి పేర్కొంది. 2001 తర్వాత ఆగస్టు నెలలో నమోదైన వర్షపాతంలో ఇది ఏడవ అత్యల్ప స్థాయి. ఈ రుతుపవన సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే దేశ వ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఆ నెలలో సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, 283.3 మి.మీ వర్షం కురిసింది. జూన్‌లో మొత్తం వర్షపాత లోటు 35 శాతంగా ఉంది. ఆ నెలలో సగటు వర్షపాతం 165 మి.మీ ఉండాలి, కానీ కేవలం 106.8 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. ఈ రుతుపవన సీజన్‌లో వర్షపాత లోటుకు ఒక ప్రధాన కారణం జూన్ నెలలో భూమధ్యరేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటం. 'ఎల్ నినో' అనేది 'ఎల్ నినో సదరన్ ఆసిలేషన్' (ఇఎన్ఎస్ఒ) అనే వాతావరణ ప్రక్రియలోని మూడు దశలలో ఒకటి. మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర ఉష్ణోగ్రతలలో మార్పులు, వాటికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే హెచ్చుతగ్గులు దీని ప్రధాన లక్షణాలు. ఎల్ నినో భూమిపై ఉష్ణోగ్రతలను పెంచే ప్రభావాన్ని కలిగి ఉండి, భారతదేశంలో తక్కువ వర్షపాతానికి కారణమవుతుందని భావిస్తారు. దీనికి విరుద్ధమైన దశ అయిన 'లా నినా' సాధారణంగా చల్లని వాతావరణ పరిస్థితులకు దారితీస్తుంది. ఇఎన్ఎస్ఒలో ఒక తటస్థ దశ కూడా ఉంటుంది.

# మెగా జాబ్‌మేళా

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు పొందిన యువతకు శాసనసభ శాసనమండలి సభాపతులు గడ్డం ప్రసాద్, ఐటి మంత్రివర్యులు శ్రీధర్‌బాబు, గుత్తా సుఖేందర్‌రెడ్డిలతో కలిసి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల ప్రజలు తన కుటుంబ సభ్యులని, వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు పొందేందుకు ఒక వేదిక ఈ జాబ్‌మేళా అని గత సంవత్సరం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఫ్యాక్స్‌ఖాన్ ప్రముఖ కంపెనీతో పాటు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలోని ప్రతి కంపెనీని కూడా ఇక్కడకు ఆహ్వానించామన్నారు. 350 కంపెనీలు ఇక్కడికి రాగా 30వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఇంతపెద్ద ఎత్తున జరిగిన జాబ్‌మేళా ఇదేనని అభివర్ణించారు. ఇక్కడ 4వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. తాము పదవులలో ఉన్న లేకపోయినా ఇక్కడి ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తూనే ఉంటామన్నారు. శాసనసభ మండలి సభాపతులు గడ్డం ప్రసాద్, గుత్తా సుఖేందర్‌రెడ్డి లు మాట్లాడుతూ కనీవిని ఎరగని రీతిలో ఈ జాబ్‌మేళా నిర్వహించినందుకు మంత్రి ఉత్తమ్ పద్మావతి దంపతులను అభినందిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 60వేల ఉద్యోగాలు భర్తీ చేసి పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తుందన్నారు. కృత్రిమ మేధకు ధీటుగా యువత అప్‌డేట్ కావాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాఅభివృద్ధికి మంత్రి ఉ త్తమ్ పదివేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పద్మావతి అధ్యక్షతన వహించిన ఈసమావేశంలో ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆసియా క్రీడలు ఆరంభం

## త్రివర్ణ పతాకం చేతబూని భారత బృందం కవాతు





క్రీడాలోకం అమితాసక్తి కనబరుస్తున్న ఆసియా క్రీడలు ప్రారంభమయ్యాయి. అంతేకాదు దేశాల అనంతర్వులు నడుమ జపాన్‌లోని నగోయాలో శనివారం అట్టహాసంగా ఆరంభ వేడుకలు జరిగాయి. ఈ సెరెమోనీలో ఒలింపిక్ విజేత మనూ భాకర్, కబడ్డీ ఆటగాడు పవన్ షెహ్రావత్‌లు భారత బృందానికి నేతృత్వం వహించారు. వీరి ద్దరూ పతాకధారులుగా ముందు నడువగా.. అథ్లెటిక్స్ బృందం మువ్వన్నెల జెండాను చేబూని కవాతు చేసింది. అద్భుతంగా కన్నులపండువను తలపించిన ఈ దృశ్యం అనంతరం పతక వేట షురూ కానుంది. జపాన్ వేదికగా 20వ ఆసియా క్రీడలు మొదలయ్యాయి. ఆసియాలోని పలు దేశాల అథ్లెట్లు పతక వేటకు సిద్ధమవ్వగా శని వారం సంబరంగా ఆరంభ వేడుక నిర్వహించారు. మిజుహో పార్క్ అథ్లెటిక్స్ స్టేడియంలో.. ఒలింపిక్ విజేత మనూ భాకర్, కబడ్డీ ఆటగాడు పవన్ షెహ్రావత్‌లు ఈ సెరెమోనీలో భారత బృందా నికి పతాకధారులుగా వ్యవహరించారు. షూటర్ మనూతో పాటుగా తజిందర్‌పాల్ తూర్ మువ్వ న్నెల జెండా చేబూని ముందు నడవాల్సింది. కానీ, ఆఖరికి అధికారికంగా జెర్సీ అందడం ఆలస్యం కావడంతో ఆమెతో కలిసి పవన్ భారత దళానికి నేతృత్వం వహించారు. ఆసియా క్రీడల ఆరంభం సందర్భంగా.. నగోయాలో వసతుల కొరత, అసౌక ర్యాలను పక్కనపెట్టేసి పతకంపై దృష్టి సారించా లని మనూ భాకర్ భారత బృందానికి సూచిం చింది. గత సీజన్లో మాదిరిగానే ఈసారి కూడా వందకుపైగా పతకాలు లక్ష్యంగా మన అథ్లెట్లు పోటీ పడనున్నారు. 20వ ఆసియా క్రీడల్లో ఇండియా నుంచి 36 క్రీడా విభాగాల్లో.. 499 మంది పోటీ పడుతున్నారు. అక్టోబర్ 4వ తేదీ వరకూ ఈ మెగా టోర్నీ జరుగనుంది.

# భారత జట్టులో 'టఫ్ బ్యాటర్' అతడే

## ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్



భారత క్రికెటర్లలో ఎవరికి బౌలింగ్ చేయడం కష్టం? అని అడగ్గానే.. విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మ అని టక్కున చెప్పేస్తారు ఎవరైనా. కానీ, ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాత్రం వీరిద్దరు కాదంటున్నాడు. ఇటీవల కమిన్స్ మాట్లా డుతూ తనకు సవాల్ విసిరిన భారత క్రికెటర్ పేరును ఇటీవల వెల్లడించాడు. తన సుదీర్ఘ కెరీర్లో పలుదేశాల నుంచి సవాల్ విసిరిన ఆటగాళ్ల గురిం చి చెప్పిన ఆసీస్ సారథి.. టీమిండియాతో మ్యాచు ల్లో విరాట్, హిట్‌మాన్ కాకుండా తనను ఛతేశ్వర్ పుజారా ఎక్కువగా ఇబ్బంది పెట్టాడని తెలిపాడు. భారత క్రికెట్‌లో దిగ్గజ ఆటగాళ్లు చాలామందే ఉన్నారు. వరల్డ్‌క్లాస్ బ్యాటింగ్ విన్యాసాలతో మేటి బౌలర్లను గడగడ వణికించిన వారికి కొదవలేదు. అయితే.. వీరిలో టన్నుల కొద్ది పరుగులు సాధిం చిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అందరికంటే కాస్త ముందు వరసలో ఉంటారనుకుంటాం. ఎందరో బౌలర్లపై పైచేయి సాధించిన ఈ ఇద్దరు తనను అంతగా ఇబ్బంది పెట్టలేదని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అంటున్నాడు. భారత్ విషయాని కొస్తే.. తనను అత్యంత కష్టపెట్టింది మాత్రం ఛతే శ్వర్ పుజారా అని కమిన్స్ అన్నాడు. తాజాగా ప్రైమ్‌వీడియో స్పోర్ట్స్ అంజ్లో మాట్లాడిన ప్యాటీ .. పుజారా పట్టుదల, అంకితభావం అమోఘమని, అందుకే అతడిని ఔట్ చేయడం కష్టంగా తోచేదని పేర్కొన్నాడు. టీమిండియాలో పుజారాను ఔట్ చేయడం చాలా కష్టం. అతడు నా వ్యూహాలను చిత్తు చేసేవాడు. అతడు అనుకుంటే సంతోషంగా 100 డాట్ బాల్స్ ఆడేవాడు. అంతేతప్ప ప్రత్యర్థి బౌలర్లకు ఒక్క అవకా శం కూడా ఇచ్చేవాడు కాదు అని కమిన్స్ వెల్లడించాడు.

**కుక్, డివిలియర్స్...** అలానే వివిధ దేశాల జట్లలో తనకు సవాల్ విసిరిన, తాను ఫిదా అయిన క్రికె టర్ల పేర్లను ఆసీస్ కెప్టెన్ ఈ వీడియోలో చెప్పాడు. మూడు ఫార్మాట్ల కెరీర్లో బ్రెండన్ మెక్కల్లమ్(న్యూ జిలాండ్), తిలకరత్నే దిల్షాన్ (శ్రీలంక), అలెస్టర్ కుక్(ఇంగ్లండ్), ఏబీ డివిలియర్స్(దక్షిణాఫ్రికా), క్రిస్ గేల్ (వెస్టిండీస్)లు తనను ఇబ్బంది పెట్టారని కమిన్స్ వివరించాడు. ఇక పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ఓవర్లో ఆఖరి బంతికి తాను క్లీన్‌బౌల్ అవ్వడం తనకింకా గుర్తుందని కమిన్స్ అన్నాడు. అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్కు సిద్ధమవుతున్నాడీ వెటరన్ పేసర్.




## ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 74,781.76 పాయింట్లు. ముగింపు 74,294.96 పాయింట్లు. నష్టం 486.80 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 23,398.10 పాయింట్లు. ముగింపు 23,346.40 పాయింట్లు. నష్టం 51.70 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు వరుసగా ఆరో వారం కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే, గతవారంతో పోలిస్తే, ఈ వారం నష్టం వేల పాయింట్ల నుంచి వందల పాయింట్లలోకి తగ్గింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ఇప్పటికీ తీవ్ర ప్రభావాన్ని చవిచూస్తునే ఉన్నాయి. అయితే, క్రమంగా కోలుకోవడం శుభపరిణామం)

# రష్యా చమురుపై అమెరికా ఒత్తిడి




రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి కల్పించే చట్టం ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త అనిశ్చితిని తెచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చట్టంపై సంతకం జరిగింది. అయితే 100 శాతం సుంకం వెంటనే అమలవుతుందని అర్థం కాదు. దాన్ని ఎప్పుడు, ఏ దేశాలపై ఎంత మేర కు అమలు చేయాలనే విషయంలో అమెరికా ప్రభుత్వానిదే నిర్ణయాధికారం. భారతదేశానికి ఈ పరిణామం ముఖ్యంగా చమురు దిగుమతు ల కారణంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దేశీయ చమురు అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు రష్యా ప్రస్తుతం ప్రధాన సరఫరాదారుగా ఉంది. 2026 జూన్ మాసంలో భారత్ దిగుమతి చేసుకున్న మొత్తం ముడి చమురులో రష్యా వాటా దాదాపు 49 శాతానికి చేరింది. జులైలో అది 50 శాతాన్ని దాటినట్లు వివిధ మార్కెట్ అంచనాలు సూచిస్తున్నాయి. ఇక్కడ సమస్య కేవలం అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై అదనపు సుంకంతో ఆగిపోదు. భారత్‌పై అమెరికా భారీ సుంకం విధిస్తే, అమెరికా మార్కెట్‌పై ఆధారపడే భారత ఎగుమతిదారుల వ్యయాలు, ధరల పోటీతత్వం, ఆర్డర్లు, ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఔషధా లు, ఆభరణాలు వంటి అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే రంగాలు తమ ధరల వ్యూహాన్ని పునఃపరిశీలించాల్సి రావచ్చు. అయితే వాస్తవ ప్రభావం సుంకం అమలు విధానం, మినహా యింపులు, కాలపరిమితి వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు రష్యన్ చము రును వేగంగా తగ్గించి ప్రత్యామ్నాయ సరఫరా దారుల నుంచి కొనుగోలు చేస్తే దేశీయ ఇంధన వ్యయంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ప్రపంచ చమురు ధరలు కూడా సరఫరా పరిస్థి తులు, పశ్చిమాసియా పరిణామాలు వంటి అనేక అంశాలపై ఆధారపడతాయి. కాబట్టి పెట్రోల్, డీజిల్ ధరలు ఎంత పెరుగుతాయో ఇప్పుడే ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. ఇలాంటి సమయం లో ప్రభుత్వానికి ఎదురయ్యే ప్రధాన ఆర్థిక సవాలు పార దర్శకమైన ప్రమాద అంచనా.

# ఎండిఆర్‌పై ప్రకంపనలు




యుపిఐ చెల్లింపులపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించే నిర్ణయం ప్రకంపనలు సృష్టిస్తున్నది. రాజ కీయ, వ్యాపార వర్గాల్లో చర్చకు దారితీ స్తోంది. అక్టోబర్ 15, 2026 నుంచి రూ.2,000కు మించిన కొన్ని వ్యక్తినుంచివ్యా పారి (పి2ఎం) యుపిఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండిఆర్ అమల్లోకి వస్తుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఈ రుసుము గరిష్ఠంగా రూ.300గా ఉంటుంది. వ్యక్తినుంచివ్యక్తికి జరిగే యుపిఐ బదిలీలకు ఈ ఛార్జీ వర్తిం చదు. రూ.2,000 వరకు జరిగే వ్యాపారి చెల్లింపుల్లో కూడా ఎక్కువ భాగం ఉచితం గానే కొనసాగుతాయి. ప్రభుత్వ వివరణ ప్రకారం ఎండిఆర్ అనేది పన్ను కాదు. చెల్లింపు వ్యవస్థలో పాల్గొనే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యుపిఐ యాప్‌లు వంటి సంస్థల మధ్య ఈ మొత్తాన్ని పంచుకుంటారు. యుపిఐ మౌలిక వసతులు, సైబర్ భద్రత, వ్యవస్థ విస్తరణ వంటి ఖర్చు లకు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కల్పించ డమే ఈ మార్పు ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. దాదాపు 96 శాతం పి2ఎం లావాదేవీలు ఈ మార్పు ప్రభావానికి దూరంగా ఉంటాయని కూడా ప్రభుత్వం వెల్ల డించింది. అయితే వ్యాపార వర్గాలు, కొన్ని రాజ కీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని విమర్శిస్తు న్నాయి. అధిక విలువ కలిగిన లావాదేవీలపై ఖర్చు పెరగడం వల్ల చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై అదనపు భారం పడుతుందని వారి వాదన. ఈ ఖర్చును వ్యాపారులు స్వయంగా భరిస్తారా, లేక ధరలను పెంచి పరోక్షంగా వినియోగదారులపై మోపుతారా అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. ప్రభుత్వం మాత్రం ఎండిఆర్ భారాన్ని విని యోగదారుల నుంచి వసూలు చేయకుండా పర్యవేక్షణ చర్యలు తీసుకుంటామని చెబు తోంది. ఈ నిర్ణయంపై కొన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. యుపిఐని విస్తృతంగా ప్రోత్సహించిన తర్వాత ఇప్పుడు దానిపై ఛార్జీలు విధించడం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ప్రజల విశ్వా సాన్ని ప్రభావితం చేయవచ్చని విమర్శకులు అంటున్నారు. మరోవైపు, యుపిఐ విని యోగం భారీగా పెరిగిన నేపథ్యంలో దాని నిర్వహణ, భద్రత, విస్తరణకు స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. అందువల్ల అసలు చర్చ 0.4 శాతం రుసుము పరిమాణం గురించి మాత్రమే కాకుండా, దేశంలోని విస్తృత డిజిటల్ చెల్లింపుల మౌలిక వ్యవస్థ ఖర్చును భవిష్యత్తులో ఎవరు భరించాలి అనే అంశం చుట్టూ కూడా సాగుతోంది.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర(సుమారుగా)

24 క్యారెట్లు: రూ.1,54,530

22 క్యారెట్లు: రూ.1,41,550

18 క్యారెట్లు: రూ. 1,15,900

(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

# హనుమకొండలో ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవం

## విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి పిలుపు




**ప్రజాపక్షం/హనుమకొండ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఏర్పాటై 90 సంవ త్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, హనుమ కొండ వేదికగా ఈనెల 28,29,30 తేదీల్లో నిర్వ హించనున్న రాష్ట్ర స్థాయి వార్షికోత్సవ వేడుకలను విద్యార్థి లోకం విజయవంతం చేయాలని ఎఐఎస్ ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీని వాస్‌రావు కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఏదు నూరి వెంకట్రాజం అధ్యక్షతన ఎఐఎస్‌ఎఫ్ వార్షి కోత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. సమా వేశానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హనుమకొండ వేదికగా రాష్ట్రస్థాయి ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాలను ఘనం గా నిర్వహించనున్నట్టు తెలిపారు. దేశంలో విద్యార్థి హక్కులు, ఉచిత నాణ్యమైన విద్య, నిరు ద్యోగ నిర్మూలన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న ఎఐఎస్‌ఎఫ్ చరి త్రలో ఈ 90వ వార్షికోత్సవం ఎంతో చారిత్రాత్మ కమైనదని తెలిపారు. విద్యార్థులు, యువకులు, ప్రగతిశీలవాదులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్య లో హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయా ల్సిందిగా ఆయన కోరారు. రాష్ట్ర, జాతీయ నాయ కులు ఈ వేడుకలకు హాజరై దిశానిర్దేశం చేయను న్నారని తెలిపారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు కర్రె బిక్షపతి, సిరబోయిన కరు ణాకర్, తోట బిక్షపతి, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, ఉట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూని వర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉట్కూరు ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్, దిడ్డి పార్థసారథి, ల్యాదెల్ల శరత్ తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ 90 వార్షికో త్సవాల స్ఫూర్తి బ్యానర్‌ను జాతీయ మాజీ అధ్య క్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు.




# పేదలకు విద్యను దూరం చేస్తున్న పాలకులు

## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్

## ఘనంగా ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా 28వ మహాసభలు




**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశంలో విద్య కాషాయిక రణ ప్రమాదంలో ఉందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్య దర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. విద్యను కాషాయిక రణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందు కు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపిం చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు శనివారం స్థానిక ఐఎంఎ హాల్‌లో జరిగాయి. మహాసభలను పురస్కరించు కుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూనగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా పోటు ప్రసాద్‌నగర్ (ఐఎంఎ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. మహాసభలను పురస్కరించుకుని ఎఐఎస్‌ఎఫ్ పతాకాన్ని మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్క రించారు. మదుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభ ల్లో పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ పాలకులు అవలంభిస్తున్న విధానాలు పేదలకు విద్యకు దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యకు నిధుల కేటాయింపు పూర్తిగా తగ్గిపోయిందని, కేటాయించిన బడ్జెట్‌ను కూడా ఖర్చు చేయడం లేదని లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే విద్యకు అత్యంత ప్రాధన్యతనిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి పాలన ఆ దిశగా సాగడం లేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని, పోరాటాలు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయ న్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొను గోలు శక్తి ఉన్న వారికే విద్య అందుబాటులో ఉంద న్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఎఐఎస్‌ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి రావిశి వరామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.




# బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.5వేలు వెంటనే అమలు చేయాలి

## సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్

**ప్రజాపక్షం/కోరుట్ల :** బీడీ పరిశ్రమలలో పనిచేసే బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షు డు బి.గోవర్ధన్, ప్రధానకార్యదర్శి సుతారి రాము లు డిమాండ్ చేశారు. శనివారం బీడీ వర్కర్స్ ఫెడ రేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మండల కేం ద్రంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లా డుతూ కేంద్రప్రభుత్వం బీడీ కార్మికులకు పెన్షన్ పెంపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి 2016 కొరకు 2014 సంవత్సరం కటాఫ్ డేటును ఎత్తివేసి ప్రావి డెంట్ ఫండ్ కార్డు ఉన్న బీడీ కార్మికులందరికీ అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికులకు నెలకు 26రోజుల పనిదినాలు కల్పించి, నాణ్యమై న తునికాకును సరఫరా చేయాలని, బీడీ కార్మిక సంక్షేమ ఆస్పత్రి ద్వారా ఉచిత మందులు సర ఫరా చేయాలని, ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు 2010లో నిలి పివేసిన కనీస వేతనాల జీవో 41ను అమలు చేయాలని, దీనికొరకు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా సద స్సులు నిర్వహిస్తామని వివరించారు. సమావేశం లో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎండి మౌలానా, ఉపా ధ్యక్షులు రంగారెడ్డి, ఎండి.ముక్రం, రాష్ట్ర సహాయ కార్యదర్శులు భాను, అయ్యవారిల లక్ష్మణ్, కెవి అనసూయ, గంగాధర్, మహమ్మద్ అలీ, జక్కు రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం




## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పి, విడు దల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని, కమిషన్ల కోసమే ఫీజు బకా యిలు ఇవ్వకుండా ఆపుతున్నారని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపిం చారు. ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా19వమహాసభ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఎఐఎస్‌ఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ జెండా ఎగర వేశారు. సభకు కసిరెడ్డి మణికంఠరెడ్డి ముఖ్యఅతి థిగా హాజరై మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విలీనం చేయడం ద్వారా సాంకేతిక విద్య నిర్వీర్యం అవుతుందని, సిఎం రేవంత్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలల భవనా లను, స్థలాలను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నా డని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మొత్తం వెంటనే విడుదల చేయాలని, స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి ప్రభు త్వం బలికాక తప్పదని హెచ్చరించారు. సమావే శంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, నూనావత్ శ్రీనివాస నాయక్, కనకం సాగర్, కేశబోయిన రాము, లద్దు నూరి విష్ణు, గర్ల్స్ వింగ్ కన్వీనర్ జోష్న, అనోష్, బోయినీ విష్ణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కులు, సామాజిక న్యాయం పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

## దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** భారత రాజ్యాంగా న్ని మార్చేందుకు దేశంలో కుట్రలు జరుగుతున్నా యని, రాజ్యాంగం జోలికి వస్తే తీవ్రంగా ప్రతిఘ టిస్తామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ హెచ్చరించారు. రాజ్యాంగం ప్రజల హక్కులు, సామాజిక న్యాయానికి రక్షణగా ఉందని, దాని పరిరక్షణకు దళితులు, పేదలు, ప్రజాస్వామ్యవా దులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపుని చ్చారు. శనివారం వరంగల్ జిల్లాకేంద్రంలోని తమ్మెర భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు జన్ను రవి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మాట్లా డుతూ రాజ్యాంగ పరిరక్షణకు అన్నివర్గాల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. దళితుల పట్ల వివక్షకు సంబంధించిన ఘటనలు, దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాసిమియా మాట్లాడు తూ తెలంగాణలో దళితుల సామాజిక, ఆర్థిక అభి వృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి మాట్లాడుతూ దళితుల అభి వృద్ధిని సంక్షేమ పథకాలకే పరిమితం చేయ కుండా భూమి, ఇల్లు, ఉపాధి అనే మూడు అంశా లపై సమగ్ర విధానం రూపొందించాలని కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ మాట్లాడుతూ భూమిలేని దళిత కుటుంబాలకు భూమి, ఇల్లు లేని వారికి గృహ వసతి, యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించా లని డిమాండ్ చేశారు. ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంపై పారదర్శక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘి ఎలేందర్ కోరారు. సమావేశం లో సంఘం నాయకులు జాన్‌పాల్, రాచర్ల రాజేం దర్, జన్ను హరిబాబు, సిలివేరు రాజేష్, వేల్పుల బాబు, ఆరోగ్యం, తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి

# నల్లగొండ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య

### డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత

### ఇంటి స్థలంతో పాటు రూ.10 లక్షలు కేటాయించాలి

### మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

### రెండో రోజు దీక్షలకు సిపిఐ(ఎం) మద్దతు



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ నగర జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కోసం వచ్చే వారం రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస నేత అన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణ జర్నలిస్టుల స్థలాల కోసం చేపట్టిన రెండో రోజు దీక్షకు శనివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల కోసం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించడానికి జిల్లా మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తో కలిసి నల్లగొండ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. జర్నలిస్టులు అడుగుతున్న ఇళ్లస్థలం న్యాయబద్ధమైనదని, ధర్మం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం చేయాల్సిన బాధ్యత తాము చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు జర్నలిస్టులు సమాజానికి బ్యాక్ బోన్ పిల్లర్ల వంటి వారన్నారు. నల్లగొండలో జర్నలిస్టులు నిర్వహిస్తున్న దీక్షల వేదిక నుంచే సీఎం రేవంత్ రెడ్డికి రెండు చేతులు జోడించి కోరుతున్నానని, నల్లగొండలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తానే ముందు ఉండి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం పొందడం ఆత్మగౌరవం అన్నారు.

**మంత్రి కోమటిరెడ్డి జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చి ప్రతి ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలి:మాజీ ఎమ్మెల్యే కంచర్ల**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే నల్లగొండ పట్టణ జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు,ప్రతి రిపోర్టర్‌కు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను శాసన సభ్యునిగా ఉన్న కాలంలో 113 మందికి ఇళ్ల స్థలాల పట్టాలకై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని ప్లాట్లు కూడా విభజించడం జరిగిందన్నారు. జర్నలిస్టులు అందరి దగ్గర దరఖాస్తులు కూడా స్వీకరించామని.ఈలోగా ఎన్నికలు రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ ఆగిపోయిందని తెలియజేశారు.న్యాయమైన మీ కోరికను తీర్చవలసిన బాధ్యత నేటి మంత్రి,జిల్లా కలెక్టర్ పై ఉన్నదని,రెడీగా ఉన్న ప్లాట్లను ఫైల్ తెప్పించుకొని అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,నాయకులు దండంపెల్లి సత్తయ్య,కేవిపిఎస్ జిల్లా నాయకుడు పాలడుగు నాగార్జున సంఘీభావం తెలిపారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం జిల్లా కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, యూనియన్ నాయకులు దోటి శ్రీనివాస్,జిల్లా యాదయ్య,ఆశ్వక్ అహ్మద్,అబ్బోజు మదనాచారి,పిట్టల రామకృష్ణ,వంగాల శ్రీనివాసరెడ్డి, కత్తుల యాదగిరి,చింత యాదగిరి,సయ్యద్,తెలగమల్ల దశరథ,సోమ చంద్రశేఖర్,ఉయ్యాల లింగయ్య గౌడ్,రమేష్,జాజాల కృష్ణ,రమేష్, చెనగోని రెడ్డిపల్లి యాదగిరి,చేపూరి రవి,సుధాకర్,సూరారపు రాంప్రసాద్, నగరా భాస్కర్,కంది సూర్యనారాయణ,అశోక్, గంగాధర వెంకటేశ్వర్లు, స్వామి దీక్షలో పాల్గొన్నారు.



## తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు

### తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో సిపిఐ ధర్నా

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని 3వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మూడవ వార్డులో గత మూడు నెలల నుండి తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వార్డులోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలకు అవసరమైన మేరకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు ,4వ వార్డు కౌన్సిలర్ జెల్ల ధనమ్మశ్రీనివాసులు , దోటి వెంకన్న, దోటి యాదయ్య , గడ్డం నవీన్ , అందిర్క పరమేష్, పరమేష్ , సాలమ్మ , వెంకటమ్మ పాల్గొన్నారు.

## వేగవంతంగా రీ సర్వే పనులు

### యాదాద్రి జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర రావు అన్నారు. శనివారం రాజాపేట మండలం బసంతాపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే పనుల పురోగతిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, రీ సర్వే కార్యక్రమంలో రైతులు చురుగ్గా పాల్గొని సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు. రీ సర్వే పనులను నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాజాపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్తో కలిసి జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీలోని అటెండెన్స్ రిజిస్టర్ను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల తహసీల్దార్ రవి కిరణ్ కుమార్, సర్వేయర్ సత్యం, మండల గిర్దావర్ పల్లెపాటి నరసింహులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ సలావుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్

**ప్రజాపక్షం/యాదాద్రి :** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న భువనగిరి పట్టణంలోని 27వ వార్డు మాజీ కౌన్సిలర్ సలావుద్దీన్ ( రఫీవుద్దీన్)ను కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఎన్నికల సమయంలో పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా వ్యవహరించడం, ఇతర పార్టీలకు మద్దతు తెలపడం ,సోషల్ మీడియా, వాట్సాప్ వేదికల ద్వారా పార్టీ ఉన్నత స్థాయి నాయకాలపై అవాస్తవ ప్రచారాలు చేస్తూ పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా ప్రవర్తించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్ర క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన సలావుద్దీన్ను వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో, అధిష్టానం ఆదేశాల మేరకు ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని రకాల బాధ్యతల నుండి సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఇకపై సలావుద్దీన్తో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఎవరూ ఆయనతో ఎలాంటి పార్టీ పరమైన లావాదేవీలు లేదా కార్యక్రమాలలో పాల్గొనవద్దని కూర వెంకటేష్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ప్రజాపక్షం/చివ్వెంల :** వ్యవసాయానికి ప్రభుత్వం 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తిరుమలగిరి సబ్‌స్టేషన్ ఎదుట గుంజలూరు గ్రామ రైతులు నిరసన తెలిపి మాట్లాడారు. కొన్ని మండలాల్లో 12 గంటలు, మరికొన్ని మండలాల్లో 10 గంటల విద్యుత్ సరఫరా చేస్తోందని అదేవిధంగా తమకు కూడా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కోతల కారణంగా వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు నాణ్యమైన 12 గంటల విద్యుత్ సరఫరా చేయకపోతే అన్ని గ్రామాల రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లికొండ గోపి, ఎక్కటి ఉపేందర్, ఐతరాజు మోహన్, పెద్ది బాలకృష్ణ, పరాలా మల్లికార్జున్, ఎక్కటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.





## రైతులతో కలిసి పత్తిపంట పొలాల క్షేత్ర సందర్శన

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రస్తుత ఎల్ నినో ప్రభావ పరిస్థితుల్లో సాగు చేసిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి ఊట్ల వినోద్ కుమార్ శనివారం పరిశీలించారు.మండలంలోని పులిపల్పుల క్లస్టర్ పరిధిలోని సింగారం గ్రామంలో వానాకాలంలో సాగు చేసిన పత్తి పంట పొలాలను రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా పత్తి పంటలో ప్రస్తుత పరిస్థితుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులను ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల వివరాలు,ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగారం,ఊకొండి,కొంపల్లి గ్రామాలలోని పంట పొలాలను సందర్శించారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాదగోని నరసింహా గౌడ్,నిఖిల్ కుమార్,అభిలాష్,రైతులు కారింగు సత్తయ్య,వట్టి అంజిరెడ్డి,సరికొండ సైదులు, రావుల నరసింహ,రాంబాబు, కవిత,ఉప్పునూతల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి హక్కుల కోసం 90 ఏళ్ల అలుపెరుగని పోరాటం

### హనుమకొండలో జరిగే ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి: శాంతి కుమార్




**ప్రజాపక్షం/భువనగిరి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 28, 29, 30 తేదీలలో హనుమకొండలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ 90 ఏళ్లుగా విద్యార్థుల హక్కులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థుల పక్షాన నిలుస్తున్న సంఘంగా ముందుకు సాగుతోందన్నారు.చదువుపోరాడు అనే నినాదంతో విద్యార్థుల్లో చైతన్యం నింపుతూ, విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని, విద్యారంగంలో ప్రభుత్వ బాధ్యత పెరగాలని నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్లు విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు.విద్యార్థుల సమస్య ఏదైనా ఏఐఎస్ఎఫ్ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. హనుమకొండలో మూడు రోజుల పాటు జరిగే ఈ వార్షికోత్సవాల్లో విద్యార్థులు, యువత, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కందుల మధు నాయకులు అశోక్, నరేందర్, రవీందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వాటర్‌షెడ్ పనులపై విచారణ

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన డిఆర్‌డిఎ పిడి సురేష్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో వాటర్షెడ్ కార్యక్రమం కింద నిర్మించిన కుంటలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, అవకతవకల ఆరోపణలపై డిఆర్డిఏ పిడి సురేష్ శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కుంటల నిర్మాణ పనులకు సంబంధించిన సమస్యలు, తమకు ఎదురైన ఇబ్బందులు, పనులపై ఉన్న అభ్యంతరాలను డిఆర్డిఏ పి డి వివరించారు. ముఖ్యంగా గ్రామస్థులు, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులకు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియకుండానే కొన్ని పనులు చేపట్టారని ఆరోపించారు.అవసరం లేని ప్రాంతాల్లో, నీటి వసతి లేని చోట్ల కూడా ఊట కుంటలు నిర్మించడంతో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు గ్రామస్థులు అధికారికి విన్నవించారు. అలాగే కుంటల నిర్మాణ పనులను స్థానికులకు కాకుండా ఇతర గ్రామాలకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించి, వారి ఇష్టానుసారంగా పనులు నిర్వహించినట్లు ఆరోపించారు. పనుల ఎంపిక, నిర్మాణ నాణ్యత, ఖర్చులు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని గ్రామస్థులు కోరారు.గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న డిఆర్డిఏ పి డి సురేష్, అధికారులతో కలిసి వాటర్‌షెడ్ ద్వారా నిర్మించిన కుంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పనుల నాణ్యత, నిర్మాణ వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా డిఆర్డిఏ పి డి సురేష్ మాట్లాడుతూ, విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలను జిల్లా కలెక్టర్కు నివేదిక రూపంలో సమర్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ, సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య, మాజీ సర్పంచ్ చెరుకుపల్లి నరసింహ, బీజేపీ మండల కార్యదర్శి కోడూరు బీరయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాచకొండ జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మల్లేష్ గౌడ్, సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు పాఠశాల స్థాయిలో చదువుతో పాటు క్రీడారంగంలో కూడా విశేషంగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. మిర్యాలగూడ మండల పరిధిలోని తుంగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రావీణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ వాక్స్ పోటీలు





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పర్యాటక రంగాన్ని దేశ అభివృద్ధిలో భాగం చేయడానికి ఎన్‌జి కళాశాల విద్యార్థులు,కోఆర్డినేటర్ సభ్యులు తమ వంతు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని చారిత్రక,పర్యాటక,సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహిస్తూ 2047 నాటికి వికసిత్ భారత్, రైజింగ్ తెలంగాణ లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తేవడానికి హెరిటేజ్ వాక్స్,పాటల పోటీలు, డాన్స్, ఆర్ట్, క్రాఫ్ట్, రీల్స్,షార్ట్ ఫిల్మ్ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఛాయా సోమేశ్వరాలయం,క్లాక్ టవర్,చర్చి,లతీఫ్ సాహెబ్ గుట్ట వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించామని తెలిపారు. టూరిజం ఇంచార్జ్ మహ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 40 పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, ఇంకా గుర్తించాల్సిన ప్రాంతాలు చాలా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య,బాటనీ లెక్చరర్ కృష్ణ, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్.కె.హబీబ్, కె.శివరాణి,శిరీష,యువ టూరిజం క్లబ్ సభ్యులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పనులను వేగవంతం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండల ప్రజా పరిషత్ ఆవరణలో ఆయన అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, నూతన కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ అధికారి మేకల రుషేంద్రమణి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యాశాఖ ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, రెండు జతల పాఠశాల దుస్తులు పంపిణీ చేసినట్లు ఎంఈవో ధర్మానాయక్ తెలిపారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు అందజేశామని పశుసంవర్ధక అధికారి జ్ఞానేశ్వర్ ప్రసాద్ వివరించారు.తక్కెలపాడు, ఆలగడప, లక్ష్మీపురంలో నిలిచిపోయిన వివో భవనాల నిర్మాణాలను తక్షణమే ప్రారంభించాలని, ఎస్బీఎం నిధుల కింద మంజూరైన డ్రెయిన్లు, కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈ వరలక్ష్మి కోరారు. వాటర్ ట్యాంక్ తండా వద్ద ఆర్ 5 ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరమ్మతు పనులను పూర్తి చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ప్రభాకర్ స్పష్టం చేశారు. మిర్యాలగూడ నుండి దిలావర్‌పూర్ వరకు టీక్యతాండా మీదుగా రోడ్డు వెడల్పు పనులు ప్రగతిలో ఉన్నాయని ఆర్అండ్‌బీ ఏఈ వెల్లడించారు. సమావేశానికి ఏఈ రాకుండా లైన్‌మన్‌ను పంపడంపై సర్పంచులు నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్‌గా ఈడ్దుల మస్తాన్‌బాబు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్‌గా దండుమల్కాపురం గ్రామానికి చెందిన ఈడ్దుల మస్తాన్‌బాబు ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా పర్నే శివారెడ్డి,సుర్కంటి లక్ష్మమ్మ,నల్ల నరేందర్‌రెడ్డి, బొబ్బిళ్ళ రాజేందర్,జక్కిడి వెంకట్‌రెడ్డి,రావుల స్వామి,ఎర్ర పెంటయ్య, పానుగోతు లచ్చిరాం,గుర్రం మనోహర్‌రెడ్డి,సుగుణమ్మ,దేవేందర్‌రెడ్డి, శ్రీహరిలను నియమించింది. పాలకవర్గ సభ్యులు శనివారం సింగిల్ విండో కార్యాలయంలో పదవి బాధ్యలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్,మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్,మునిసిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మద్దెలమ్మ దేవాలయంలో చోరీ

### నగదు అపహరణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పురపాలక పరిధిలోని భావనాఋషి పేటలోని శ్రీశ్రీశ్రీ మద్దేలమ్మ దేవాలయంలో శుక్రవారం అర్థరాత్రి కొందరు దుండగులు చోరీకి పాల్పడ్డ ఘటన చోటు చేసుకుంది.ఆలయ పూజారి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటి మాదిరిగానే శుక్రవారం రాత్రి భజన కార్యక్రమం ముగించుకొని ఆలయ ప్రధాన ద్వారానికి తాళాలు వేసి ఇళ్ళకు వెళ్ళి పడుకున్నారు. శనివారం హోమం కార్యక్రమం ఉండటంతో ఆలయం తెరిచేందుకు వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్టేషన్ హౌజ్ ఆఫీసర్ జగన్ బృందం విచారణ చేపట్టారు.గేట్ తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు.హుండీ లాక్ విరగగొట్టి నగదును ,సిసి కెమెరాలు అపహరించారు.చోరి దృశ్యాలు చిక్కకుండా సిసి కెమెరాలను ఎత్తుకెళ్ళినట్లు ప్రాథమికంగా దర్యాప్తులో భావిస్తున్నారు.ఇటీవలే బోనాల జాతర ఉత్సవాలు జరగటంతో హుండీలో భారీగా నగదు ఉంటుందనే పక్క ప్రణాళికతో గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడ్డేరేమో అనే కోణంలో క్లూస్ టీం దర్యాప్తు చేస్తున్నారు.భక్తులు వేసిన కానుకలు కాబట్టి నగదు ఎంత దోచుకున్నారో స్పష్టంగా చెప్పలేమని ఆలయ నిర్వాహకులు చెప్పారు.వేలిముద్రలు ఇతర ఆధారాలతో దొంగలను వెతికే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు

మంచిర్యాల డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్ తెలిపారు. బెల్లంపల్లి పరిసర ప్రాంతాల విగ్రహాల నిమజ్జనం జరిగే పోచమ్మ చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను శనివారం మున్సిపల్ చైర్పర్సన్ స్వాతి, సబ్ కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. విగ్రహాలు వచ్చే మార్గాలు, నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 2,800 విగ్రహాల నిమజ్జనం జరగనుందని, నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఈత రానివారు నీటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన పాయింట్ల వద్ద ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నామని, నిమజ్జన ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేసి పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి రవికుమార్, బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ హనోక్, టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మహ్మద్ రిజ్వాన్‌కు మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్ మజీద్ వాడకు చెందిన మహ్మద్ రిజ్వాన్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రిజ్వాన్ కుటుంబ సభ్యులకు చికిత్స కోసం రెండు లక్షల ఐదు వేల రూపాయల విలువ గల ఎల్ఓసిని అందజేశారు.

## వినాయక నిమజ్జనంలో విషాదం

చెరువులో మునిగి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/జైనూర్ :** వినాయక నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన మండలంలో చోటుచేసుకుంది. జామ్ని పంచాయతీ పరిధిలోని సాంబాగూడ చెరువులో శుక్రవారం రాత్రి విగ్రహ నిమజ్జనం చేస్తుండగా ముండే రజనీకాంత్ (35) ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు రాత్రి ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం రెస్క్యూ బృందం సహాయంతో గాలింపు చర్యలు చేయగా రజనీకాంత్ మృతదేహం లభ్యమైంది. చేతికందిన కొడుకు విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. జామ్ని గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/భైంసా :** కుబీర్ మండలం లోని కుబీర్ గ్రామానికి చెందిన ముచ్చిండ్ల నీల అనే లబ్ధిదారునికి సుమారు 32000వేల రూపాయలు కతుర్ గజ్జవ్వ అనే లబ్ధిదారులు 5,500 వేల రూపాయలు.సీఎం సహాయ అనేది చెక్కును బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి అందజేయడం జరిగింది.చెక్కును మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కుటుంబ సభ్యులు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పెంటజి, కాంగ్రెస్ పార్టీ డిసిసి ప్రధాన కార్యదర్శి సుది రాజన్న,భైంసా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిందే గజానన్ పటేల్ మాజీ ఎంపీటీసీ లింగన్న,కుబీర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాథోడ్ అరుణ్ కుమార్,పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ

జిల్లా ఎస్పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సహకారంతో ఉచిత ప్రీ రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పి డా. జి. జానకి షర్మిల తెలిపారు.ఈ నెల 28వ తేదీ సోమవారం నుంచి నిర్మల్‌లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఆసక్తి గల అభ్యర్థులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను సంప్రదించి బయోడేటాను సమర్పించి శిక్షణలో అడ్మిషన్ పొందాలని ఎస్పి సూచించారు. శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న నిర్మల్ జిల్లా యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, శిక్షణ పొంది పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎస్పి ఆకాంక్షించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న పిప్రి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుంగెన నర్సింగ్ రావు కు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వేదం పాఠశాల ప్రిన్సిపాల్ దడిగే రమేష్, కరస్పాండెంట్ దోడొల్ల మల్లేష్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందడం పట్ల ప్రధానోపాధ్యాయుడిని అభినందిస్తూ,విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వేదం పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని సన్మానిత ఉపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. విద్యారంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉపాధ్యాయులకు స్ఫూర్తి కలుగుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.




## కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి..

# తాత్కాలిక భవనాలు సిద్ధం

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు అనువైన పాఠశాల భవనాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ చాంబర్లో కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్, సంతోష్ కుమార్ , అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎ. ఇజ్రాయల్, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సిఇఒ ఎల్లయ్య, తో కలిసి సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వసతులను పెంచేందుకు క్రమంగా కొత్త విద్యాలయాలను మంజూరు చేస్తోంది అని ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందని, మెదక్ జిల్లాలో నూతన కేంద్రీయ విద్యాలయ నెలకొల్పేందుకు హవేలీ ఘనపూర్ మండలంలో వై పి ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ పరిసర ప్రాంతాలలో 06 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు.అందులో భాగంగా మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలికంగా ప్రారంభించేందుకు అనువైన విద్యాలయ భవన సముదాయాలను గుర్తించాలని, గుర్తించిన వెంటనే కేంద్రీయ విద్యాలయం తాత్కాలికంగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని నూతన కేంద్రీయ విద్యాలయం నిర్మాణం పూర్తయిన వెంటనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయాన్ని నూతన భవనాల్లోకి తరలించే విధంగా భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మెదక్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయ నెలకొల్పడానికి భవనాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, గణాంక అధికారి నవీన్, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** గ్రామాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేట తో పాటు, కొత్త లింగయ్య పల్లి, పాత లింగయ్య పల్లి, కొంపల్లి, డాక్యా తాండ, కొడుపాక లలో సుడిగాలి పర్యటన చేపట్టారు. పలు గ్రామాల్లో పర్యటించి బోరుబావులను ప్రారంభించడంతో పాటు డాక్య తండాలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. బోరుబావుల ప్రారంభంతో తాగునీటి కష్టాలు తీరనున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికి తమ సమస్యలను విన్నవించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డాక్య తండాలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడంతో లబ్ధిదారుల కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. సొంతింటి కల సాకారం చేసినందుకు ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, ప్రశాంత్ రెడ్డి డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచులు పావని నరేందర్‌గౌడ్, శ్రీధర్, సిద్దప్ప, హీరాలాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలు అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కె.హరిత హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తూ సమయపాలన పాటించని వారిపై, విధులకు తరచూ గైర్హాజరయ్యే వారిపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులంతా నిబద్ధతతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, ప్రొఫెసర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌టిసి విలీన హామీని నిలబెట్టుకోవాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** ఆర్‌టిసి కార్మికుల హక్కుల పరిరక్షణ ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యమని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. ఆసిఫాబాద్ డిపో ఎదుట శనివారం ఇయు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కార్మికులు బస్సు గుర్తుకు ఓటు వేసి ఇయును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తాము గెలిస్తే ఆర్‌టిసి విలీనం, ఉద్యోగ భద్రత, అధికారుల వేధింపుల అరికట్టడం, పెండింగ్‌లో ఉన్న సిసిఎస్ నిధులు, పిఆర్‌సి బకాయిల చెల్లింపుతో పాటు 2025 వేతన సవరణ అమలుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎ.చిరంజీవి, డిపో సెక్రటరీ ఏల్పుల అశోక్, నాయకులు మహేష్, మోహన్ బాబు, నరేష్, రఫీక్, తలీఫ్, ప్రసాద్, సతీష్, దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'కోడ్ ఫర్ చేంజ్' సాంకేతిక రంగంలో యువతే లక్ష్యం

పోలీస్ కమిషనర్ సాయిచైతన్య




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** యువత మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు, యువత, టెక్నాలజీ నిపుణులతో ముచ్చటిస్తూ వారు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు, సమస్యల పరిష్కార విధానాలను పంచుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. శనివారం ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎన్ హాకథాన్ 2026 కోడ్ ఫర్ చేంజ్ కార్యక్రమాన్ని ఐటి టవర్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు కీలకంగా మారుతుందని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వివిద సామాజిక సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. యువతలో ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సాంకేతిక నైపుణ్యాలను సరైన దిశలో వినియోగిస్తే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, కోడ్ ఫర్ చేంజ్ వంటి కార్యక్రమాలు యువతను సాంకేతిక రంగంలో మరింత ప్రోత్సహించడంతోపాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు వేదికగా నిలుస్తాయన్నారు.నజీబ్ (సి.ఈ.ఓ), షేక్ సబ్బార్ (మేనేజర్), రజనీకాంత్ (కాకతీయ ప్రిన్సిపాల్) ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్ ప్రతినిదులు, నిర్వాహకులు, టెక్నాలజీ నిపుణులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన

జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సుచరిత

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి సుచరిత తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని అప్పాజీ పల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.చట్టాలపై అవగాహన కలిగి ఉండడం వల్ల సమాజంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. కు టుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించి బాధితులు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. క్షణిక ఆవేశంతో ఇరు వర్గాలు కేసులు పెట్టుకుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టు తిరుగుతూ విలువైన సమయాన్ని కోల్పోతున్నారని, రాజీ మార్గమే రాజమార్గమని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ గంధాలి రవికుమార్, తదితరులున్నారు.



## భూకబ్జాలపై ఉన్న శ్రద్ధ విద్యపై ఏదీ?

తెలంగాణ విద్యాకమిషన్


మాజీ చైర్మన్ ఐఎఎస్ అధికారి ఆకునూరి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నాణ్యమైన విద్య అందించేంత వరకు ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని అందరూ కలిసి ప్రభుత్వాన్ని నిలదీయాలని అప్పుడు మాత్రమే వారు వైఖరి మార్చుకుని నాణ్యమైన విద్యనందించేందుకు ముందుకు వస్తారని, తెలంగాణ విద్యాకమీషన్ మాజీ చైర్మన్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. మూడు లక్షల రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.6వేల కోట్లు ఇస్తే 2 వేల స్కూళ్లు బాగుపడుతాయన్నారు. బిఆర్ఎస్ హయాంలో లెక్కకు మించి భూకబ్జాలు జరిగాయని, విద్యను విస్మరిస్తూ ఎన్నికల కొరకు కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించి లబ్ధి పొందారని, డబుల్ బెడ్‌రూమ్‌లు, ప్రాజెక్టులు ఈ కోవకే చెందుతాయన్నారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాబస్సు యాత్రలో భాగంగా శనివారం పెన్షనర్స్ భవనంలో మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌లోని రాష్ట్రంలో స్కూళ్లను ఇవ్వడానికి రూ.6వేల కోట్లు లేవా అని ప్రశ్నించారు.

## గడువు దాటినా పూర్తికాని 65వ జాతీయ రహదారి పనులు

నరకప్రాయంగా నేషనల్ హైవే -65

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** అత్యవసర సేవలకు అంతరాయం , ప్రయాణికుల స్థానికుల తీవ్ర ఇక్కట్లు అసంపూర్తి నిర్మాణాలు ,నాణ్యతా లోపాలపై పర్యవేక్షణ కరువు ఇలాంటి సమస్యలతో అల్లాడిపోతున్న నేషనల్ హైవే 65 రహదారి పనులు, సంగారెడ్డి ఎక్స్‌రోడ్స్ నుంచి మదీన గూడ వరకు ఎస్‌హెచ్ 65 పై చేపట్టిన 6 వరుసల రహదారి విస్తరణ పనులు నిర్ణయించిన గడువు దాటినా పూర్తికాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్నున్నారు ప్రజలు కిలోమీటర్ 493/000 నుంచి 524/000 వరకు 29,35 కిలో మీటర్ల మేర చేపట్టిన ఈ ప్రాజెక్టు రూ. 1,29775 కోట్ల వ్యయం మంజూరైంది. అసలు పూర్తి గడువు 03072026 కాగా అనంతరం కేంద్ర ప్రభుత్వ పార్లమెంటరీ సమాచారంలో 31 032027 గడువు పొడిగించినట్లు తెలిసింది. అదే సమాచారంలో ప్రస్తుత ప్రాజెక్టు పనులు 32 శాతం మాత్రమే పూర్తియినట్లు పేర్కొన్నారు. రూ. 1,297 కోట్లకు పైగా ప్రజాదనంతో చేపట్టిన 29, 35 కిలోమీటర్ల పనుల్లో ఇప్పటి వరకు 32 శాతం మాత్రమే భౌతిక పురోగతి నమోదవడం మిగిలిన పనులు ఇంకా కొనసాగుతుందడం ఆందోళన కలిగించే అంశమని ఎక్కడ చూసినా సగం పనులు చేసి వదిలేయడం పూర్తి స్థాయిలో రహదారి పనులు చేపట్టకపోవడం వల్ల ప్రయాణికులు ,స్థానిక ప్రజలు ,విద్యార్థులు ,ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాణ్యతా లోపాలు గుర్తిస్తే కాంట్రాక్టర్‌ను హెచ్చరించడంతో పాటు నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. రహదారి సర్వీస్ రోడ్లు బాక్సెన్ నిర్మాణ సామాగ్రి తదతర పనులపై నాణ్యతా పరీక్షలు నిర్వహించి లోపాలు ఉన్నట్లు తేలితే వాటిని కాంట్రాక్టర్‌తో సరిచేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న




పనులను పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన నాణ్యమైన రహదారిని అందించాలని ,ప్రజాధనం భారీగా ఖర్చు చేస్తున్న ఈ ప్రాజెక్టులో నాణ్య త,భద్రత సమయపాలనలో అదికారులు కఠినం గా వ్యవహరించాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

## వెదురు ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అదనపు ఆదాయం

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి తక్కువ నీటి వినియోగంతో మెరుగైన దిగుబడులు అదనపు ఆదాయం పొందేలా పంటల మర్పిడిని ప్రొత్సహించాలని జిల్లా ఉద్యాన అదికారి పి సోమేశ్వరరావు సూచించారు. కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో వెదురు సాగుపై అవగాహన సదస్సుతో పాటు ఆయిల్ ఫామ్ సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉద్యాన శాఖ అదికారులు రైతులకు వెదురు ,ఆయిల్ ఫామ్ సాగు విధానాలు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ,రాయితీలు పంటల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. వెదురు సాగుకు ప్రభుత్వ రాయితీలు జాతీయ వెదురు మిషన్‌లో భాగంగా ఈ ఏడాది గట్లపై వెదురు మొక్కలను సాగు చేసుకునే రైతులకు ఒక్కొ మొక్కకు 90 చోప్పున సబ్సిడీ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా ఎకరానికి రూ. 14,400 చొప్పున సబ్సిలడీని ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి సోమశ్వరరావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయిల్ ఫామ్ విస్తీర్ణ కార్యక్రమంలో భాగంగా రైతులకు 90 శాతం రాయతితో అయిల్ పామ్ మొక్కలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటల సాగు పంట నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఎకరానికి రూ. 4,200 చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని వివరించారు. రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో అయిల్ పామ్, తోటలో కోకో వాను అంతర పంటగా సాగు చేస్తున్న విదానాన్ని రైతులకు



ప్రత్యక్షంగా వివరించారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 4,994 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతొందని జిల్లా ఉద్యాన అధికారి పి సోమేశ్వరరావు తెలిపారు.ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు సుమారు రూ. 24 వేల వరకు ఉందని పేర్కొంటూ రైతులు ఆయిల్‌పామ్ సాగుపై మరింత ఆసక్తి చూపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారి కె . సునీత రోజ్ కేవికే శాస్త్రవేత్త శైలజ ,హెచ్ ఓ సతీష్, గోద్రెజ్ ఆగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వృద్ధుడికి అండగా జిల్లా యంత్రాంగం

కలెక్టర్ కె.హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కుటుంబ సభ్యుల ఆదరణ కోల్పోయి నిస్సహాయ స్థితిలో కలెక్టరేట్‌కు వచ్చిన ఓ వృద్ధుడికి కలెక్టర్ కె.హరిత మానవతా దృక్పథంతో అండగా నిలిచి తిరిగి కుటుంబంతో కలిపారు. కాగజ్‌నగర్ మండలం బోడేపల్లికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడు తన కొడుకు పోషణ బాధ్యతలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ నెల 18న కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంటనే స్పందించి స్వయంగా ఆయన సమస్యలను తెలుసుకుని తక్షణ రక్షణ, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమాచారం తెలుసుకున్న వృద్ధుడి కుమారుడు తన తండ్రి పోషణ బాధ్యతలను పూర్తిగా స్వీకరిస్తానని, ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటానని అధికారులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ కుమారుడితో మాట్లాడి వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హితవు పలికారు. కుమారుడు తనను తిరిగి ఇంటికి తీసుకెళ్లడంతో వృద్ధుడు సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధులు కుటుంబానికి భారం కాదని, భద్రత, గౌరవాన్ని కాపాడటం కుటుంబ సభ్యుల కర్తవ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
20-09-2026
www.prajapaksham.in

"కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో ఎంఎస్ రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కెఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు ఈ మూవీని నిర్మించారు. ఈ డివైన్ బ్లాక్ బస్టర్ మూవీ 25 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది."

# రీల్

## 'సిగ్మా' అడ్వెంచర్ ట్రైలర్ రిలీజ్



సందీప్ కిషన్ యాక్షన్‌అడ్వెంచర్, హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. మోసపోయిన హీరో, జరిగిన దాన్ని మర్చిపోయి ముందుకు వెళ్లకుండా.. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి సాధించుకోవాలని పోరాటం మొదలుపెడతాడు. డ్రగ్స్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన రూ.500 కోట్ల భారీ రాకెట్ ఈ కథలో కీలకంగా ఉంటుంది. దీంతో హీరో క్రైమ్, మోసం, ప్రమాదాలతో కూడిన ప్రపంచంలోకి అడుగుపెడతాడు. మరోవైపు ఓ ఆర్‌జెతో ప్రేమలో ఉన్న హీరో.. తన స్నేహితుల సహాయంతో భారీ హీస్ట్‌కు ప్లాన్ చేస్తాడు. అయితే ఎంతో పక్కాగా వేసుకున్న ఆ ప్లాన్‌కు రెడ్డి అడ్డుపడటంతో మొత్తం ఆపరేషన్ గందరగోళంగా మారుతుంది. ఓటమిని అంగీకరించని హీరో మరింత బలంగా తిరిగి వచ్చి.. అన్ని అడ్డంకులను అధిగమించి తన లక్ష్యాన్ని ఎలా సాధించాడనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా తల్లికొడుకు ఎమోషన్ సినిమాకు మంచి డెప్త్‌ను తీసుకొచ్చేలా కనిపిస్తోంది. కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ స్టైలిష్, కాంటెంపరరీ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. యాక్షన్, అడ్వెంచర్ ప్రపంచాన్ని యాటిట్యూడ్‌తో ప్రజెంట్ చేశారు. ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ స్కోర్ సినిమాకు మరింత ఇంటెన్సిటీ, ఎనర్జీని తీసుకొచ్చింది. ప్రవీణ్ కేఎల్ షార్ప్ కట్స్‌తో నెరేషన్‌ను క్రిస్ప్‌గా ఉంచారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ విలువలు కనిపిస్తున్నాయి.

## మహిళ సమస్యలతో 'ఆక్టోపస్'..

తమిళ జీ5 ఒరిజినల్ సిరీస్‌లకు సంబంధించిన విభాగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటూ.. విభిన్న జోనర్స్‌లో ఆసక్తికరమైన ప్రాంతీయ కథలను ప్రేక్షకులకు అందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తన కథనానికి సంబంధించిన శైలిని మరో స్థాయికి తీసుకెళ్తూ.. 'ఆక్టోపస్' అనే ఉత్కంఠభరితమైన సస్పెన్స్ థ్రిల్లర్‌ను ప్రీమియర్‌కు సిద్ధం చేసింది. ఈ సిరీస్‌లో శక్తివంతమైన మహిళా ప్రధాన కథతో పాటు.. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో ఇప్పటివరకు ఉన్న సంప్రదాయ కథనాలకు భిన్నంగా కొత్త తరహా అనుభూతిని అందించనుంది. జయచంద్ర హాష్మీ దర్శకత్వంలో రూపొందిన ఈ 7 ఎపిసోడ్స్ తమిళ జీ5 ఒరిజినల్ సిరీస్‌లో అశ్విన్, అర్చన, వినోత్ కిషన్, సిద్ధు కుమరేశన్, కలైవాణి భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమిళ జీ5 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో 'ఆక్టోపస్' లాంచ్ ప్రోమో విడుదలైనప్పటి నుంచి ఈ సిరీస్‌పై ఆన్‌లైన్‌లో మంచి ఆసక్తి నెలకొంది. ఆసక్తికరమైన కథాంశంతో పాటు అభిమానుల చర్చలు, అంచనాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలతో 'ఆక్టోపస్'పై క్యూరియాసిటీ పెరుగుతోంది. కేవలం సస్పెన్స్ థ్రిల్లర్‌గానే కాకుండా.. నమ్మకం, సంబంధాలు, పట్టుదల, మనుషుల మధ్య ఉండే బంధాల బలం వంటి ఆసక్తికరమైన అంశాలను కూడా ఈ సిరీస్‌లో చూపించనున్నారు. మన రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పరిస్థితులను ఆధారంగా చేసుకుని, బలమైన భావోద్వేగాలతో సాగే కథనం ప్రేక్షకులను చివరి వరకు ఆసక్తిగా చూసేలా చేయడంతో పాటు.. అసలు ఏం జరగబోతోందనే ఉత్కంఠను కొనసాగించనుంది.



## ఆకట్టుకుంటున్న 'నీ వల్లే' పాట



'ఎక్స్' ద్వారా విడుదల చేసిన ఎ.ఆర్.రెహ్మాన్

అచు రాజామణి మెలోడీకి విక్రమ్ శివ హృద్యమైన సాహిత్యం.. నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని జంటను పరిచయం చేసిన అందమైన ప్రేమగీతం ఇది. యువతను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న 'సంగీత్' నుంచి తొలి పాట 'నీ వల్లే' విడుదలైంది. కథానాయకుడు నిఖిల్ విజయేంద్ర సింహా ఆయన అభిమానులకు, సంగీత ప్రియులకు ఒక ప్రత్యేకమైన మ్యూజికల్ ట్రీట్‌గా నిలిచింది. సంగీత ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్న సిద్ శ్రీరామ్ గాత్రం, ప్రముఖ సంగీత దర్శకుడు అచు రాజామణి అందించిన మధురమైన స్వరాలతో 'నీ వల్లే' ఒక హృద్యమైన రొమాంటిక్ మెలోడీగా రూపు దిద్దుకుంది. విక్రమ్ శివ ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు. 'నీ వల్లే' పాటలో అచు రాజామణి అందించిన సంగీతం ప్రేమ, భావోద్వేగాలను అద్భుతం గా ప్రతిబింబిస్తుంది. మెలోడీకి తగిన ఆహ్లాదకరమైన ఆర్కెస్ట్రేషన్‌తో పాటను అందంగా తీర్చిదిద్దారు. సిద్ శ్రీరామ్ తన విలక్షణమైన గా త్రంతో ఈ పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించారు. నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని మధ్య ప్రేమను, వారి కెమిస్ట్రీని పరిచయం చేసేలా ఈ పాటను చిత్రీకరించారు. హృద్యమైన సాహిత్యం, మధురమైన సంగీతం, సిద్ శ్రీరామ్ గాత్రం కలిసి 'నీ వల్లే'ను ఆకట్టుకునే రొమాంటిక్ మెలోడీగా నిలిపాయి. లహరి ఫిల్మ్స్ ఆర్‌బి స్టూడియోస్ బ్యానర్లపై జి. మనోహరన్, ఎల్. బాలకృష్ణ సమర్పణలో 'సంగీత్' తెరకెక్కుతోంది. నిఖిల్ విజయేంద్ర సిం హా హీరోగా పరిచయం అవుతున్న చిత్రం నిఖిల్ సరసన తేజు అశ్విని నటిస్తున్నారు. దర్శకత్వం: సాద్ ఖాన్ కథ: సాద్ ఖాన్ & సిద్ధాంత్ సుందర్ నిర్మాతలు: నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, శ్రావంతి నవీన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మాజ్ ఖాన్.

## భావన స్టూడియోస్‌లో 'పిక్నిక్' సందడి



'బెత్లహేమ్ కుటుంబ యూనిట్'తో భారీ గ్లోబల్ సక్సెస్‌ను అందుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ భావన స్టూడియోస్ తమ కొత్త సినిమాను ప్రకటించింది. 'పిక్ నిక్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సందీప్ ప్రదీప్, ఇంద్రజిత్ సుకుమారన్, దిలీష్ పోతన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఫ్యామిలీ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.ఈ సినిమాతో రచయిత కిరణ్ జోసీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సెన్సేషనల్ హిట్స్ 'ప్రేమలు', 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్' చిత్రాలకు కోరైటర్‌గా పనిచేసిన కిరణ్ జోసీ.. ఆసక్తికరమైన, మన సంస్కృతికి దగ్గరగా ఉండే ఎంటర్‌టైనింగ్ కథలను అందించడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కేరళతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయన గత రచనలకు మంచి ఆదరణ లభించడంతో.. దర్శకుడిగా ఆయన తొలి సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. సందీప్ ప్రదీప్, దిలీష్ పోతన్, ఇంద్రజిత్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 'పిక్నిక్'ను మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత, నిర్మాతలు: ఫహద్ ఫాజిల్, దిలీష్ పోతన్, శ్యామ్ .

## అక్టోబర్ 9న థియేటర్స్‌లోకి 'అ'

రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న ''అ'' సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. ఇటీవల అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో.. తాజాగా చిత్రబృందం 'బ్లడీ హంగర్' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. డెబ్యూ ప్రొడక్షన్ హౌస్‌లు స్టార్ బాక్స్ స్టోరీస్, రిపుల్ స్లైడ్ స్టూడియోస్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ థ్రిల్లర్‌లో రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. కనకరావు తొనంగి, అభిషేక్ కె, ప్రముఖ ఎడిటర్ గ్యారీ బి హెచ్ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది. మోనిష్ భూపతి రాజు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అభినవ్ వి. కునపరెడ్డి, గ్యారీ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చిత్రానికి కోప్రొడ్యూసర్: అభినవ్ వి. కునపరెడ్డి సంగీత దర్శకుడు: శ్రీచరణ్ పాకాల డీఓపీ: మోనిష్ భూపతి రాజు



## 'సీన్' గ్లింప్స్ రిలీజ్

వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకెళ్తున్న స్టార్ హీరో సూర్య.. మలయాళ దర్శకుడు జితు మాధవన్‌తో కలిసి తన 47వ చిత్రాన్ని చేస్తున్నారు. 'ఆవేశం' ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో నజ్రియా నజీమ్ కథానాయికగా నటిస్తుండగా.. ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియాన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యాక్షన్‌కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని జఘరం స్టూడియోస్, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై జ్యోతిక, సూర్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా 'సీన్' టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాను దీపావళి సందర్భంగా నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. సూర్య అసలు ఇంట్రడక్షన్‌ను మాత్రం గ్లింప్స్‌లో అదిరిపోయేలా డిజైన్ చేశారు. డిఎస్పీ ప్రేమ్‌రాజ్ గా సూర్య పవర్‌ఫుల్ ఎంట్రీ అదిరిపోయింది. ఓ కానిస్టేబుల్ భుజంపై చేయి వేసుకుని నడుస్తూ వచ్చే సూర్య.. ఎంత కష్టమైన క్రిమినల్ అయినా అతడిని ట్రాక్ చేసి పట్టుకోగల తన ప్రత్యేక సామర్థ్యాన్ని తెలియజేసే పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం ఆకట్టుకుంది.



## సంబంధాల్లో ఒడిదుడుకులు

(మొదటి పేజీ తరువాయి)

దేశాలపై భారీగా సుంకాల వడ్డన ప్రారంభించారు. అప్పటినుండీ భారత్ సహా అనేక దేశాలకు సమస్యలు మొదలయ్యాయి. ముఖ్యంగా గత ఏడాది నుండి ఇరు దేశాల వాణిజ్యంలో సుంకాల విషయంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి.తేదీలవారీగా పరిశీలిస్తే ఈ మార్పులు అర్థమవుతాయి. రష్యా–ఇరాన్ దేశాల నుండి చమురు,సహజవాయువు కొనుగోలు చేసే భారత్–చైనాలను దెబ్బతీసేందుకు ట్రంప్ రిపబ్లికన్‌పార్టీ అమెరికా కాంగ్రెస్‌లో ఆంక్షల బిల్లును గురువారం ఆమోదించింది. ఈ బిల్లుపై ట్రంప్ శుక్రవారం (సెప్టెంబరు 18) సంతకం చేయడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. దీంతో భారత్‌పై నూటికినూరుశాతం సుంకాలు విధించే పరిస్థితి తలెత్తింది. ''ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం–2026'' ఇప్పుడు అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 2025,2026 సంవత్సరాలలో ఇప్పటివరకూ భారత్–అమెరికా మధ్య టారిఫ్ విషయాల్లో క్రమానుగత మార్పులు తేదీలవారీగా ఈ క్రిందివిధంగా ఉన్నాయి.

**2025,ఏప్రిల్ 2:విముక్తి దినం:** భారత్ నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులపై మొత్తంగా 26 శాతం సుంకాలను ట్రంప్ విధించారు. ఇందులో పదీశాతం ప్రాథమిక సుంకాలు కాగా, 16 శాతం పరస్పర దిగుమతుల్లో వ్యత్యాసాలకు సంబంధించిన సుంకా లు. అంతకు ముందు వరకూ అమెరికాకు మోస్ట్ ఫేవర్డ్ నేషన్ జాబితాలో ఉన్న భారత్‌కు డబ్ల్యుటిఓ సభ్యదేశాల నుండి దిగుమతయ్యే వస్తువులపై సుంకాలు అమలులో ఉండేవి.

**2025,ఏప్రిల్ 9:** భారతదేశంపై అదనంగా విధిం చిన 16 శాతం పరస్పర సుంకాలను 90 రోజులపాటు అంటే 2025 జులై తొమ్మిదో తేదీ వరకూ నిలిపివేసింది.

**2025,జులై 31:** ఏప్రిల్ 2 నుండి ఆగస్టు ఆరో తేదీ వరకూ పదీశాతం సుంకాలు వసూలు చేసిన అమెరికా ఆగస్టు ఏడో తేదీ నుండి 25 శాతం సుంకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించింది.

2025,ఆగస్టు 6ః రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకుగాను అదనంగా 25 శాతం సుంకాలను భారత్‌నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై జరిమానాగా అమెరికా విధించింది. దీంతో భారత్‌పై మొత్తం సుంకాల భారం 50 శాతానికి పెరిగింది.

**2025,ఆగస్టు,27:** అమెరికా మార్కెట్‌లో భారత వస్తువులు 50 శాతం సుంకాలు ఎదుర్కొన్నాయి. వివరంగా చూస్తే ఇందు లో 25 శాతం పరస్పర సమానత్వ సాధనకు సంబంధించిన సుంకాలు కాగా, మరో 25 సుంకాలు రష్యా చమురు దిగుమతిపై జరిమానాగా విధించారు.

**2026, ఫిబ్రవరి 2:** ప్రస్తుతం భారత్‌పై ఉన్న 25 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గించేందుకు భారత్–అమెరికా మధ్య అంగీకారం కుదిరింది. కానీ ఈ 18 శాతం సుంకాలను ఇప్పటివరకూ అమలులోకి రాలేదు.

**2026, ఫిబ్రవరి6:** ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటిదశ అమలు నిమిత్తం ఒక నిబంధనల చట్రాన్ని అమలు చేసేందుకు అంగీకారానికి వచ్చినట్లు భారత్–అమెరికా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

**2026, ఫిబ్రవరి 7:** రష్యా నుండి చమురు కొనుగోలు చేసినందుకు అప్పటివరకూ భారత్ సరుకులపై విధించిన 25 శాతం జరిమానాను అమెరికా రద్దు చేసింది.

**2026,జులై 24:** భారత్ సహా అన్ని దేశాలపై 150 రోజులపాటు ట్రంప్ విధించిన పదీశాతం సుంకాల గడువు ముగిసిపోయింది.ఐతే భారత్‌లో కార్మికులపై బలవంతంగా మెడలువంచి అధికశ్రమ చేయించి ఉత్పత్తులు చేస్తున్నారనే వంకతో అమెరికా సెక్షన్ 301 కింద ట్రంప్ సుంకాలు విధించారు. దీంతో రద్దుచేసిన పదీశాతం సుంకాల స్థానంలో ఈ కొత్తసుంకాలు అమలులోకి వచ్చాయి. దీంతోపాటే ఎంఎఫ్ఎన్ పేరుతో ఉన్న రాయితీ సుంకాలు కూడా కొనసాగుతాయి.

**2026, ఫిబ్రవరి 20 :** ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించింది. ఈ తీర్పు ప్రకారం వివిధ దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దుచేసింది. దీంతో అంతకుమునుపు ఉన్న మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) అనే హోదాలో తగ్గింపుతో విధించిన సుంకాలు మాత్రమే అమలులోకి వచ్చాయి.

**2026, ఫిబ్రవరి 24:** కోర్టు తీర్పు తర్వాత దొడ్డిదారిన మరోచట్టాన్ని ఉపయోగించి ట్రంప్ కొత్తగా 10 శాతం సుంకాలను అన్ని దేశాలపైనా విధించారు.భారత్‌కు సంబంధించి ఎంఎఫ్ఎన్‌తోపాటు ఈ సుంకాలు కూడా వర్తిస్తాయి. అంటే ఈ పదీశాతం సుంకాలను కేవలం 150 రోజులు అమలులో ఉండేవిధంగా విధించారు.

**2026,సెప్టెంబరు18:** ఉక్రేన్‌పై యుద్ధం చేస్తున్నందుకు రష్యాను,పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధి మూసివేత,అణు వివాదం పేరుతో ఇరాన్‌ను ఏకకాలంలో దెబ్బతీసేందుకు వీలుగా అమెరికా కాంగ్రెస్ ద్వారా ఆమోదించిన ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ బిల్లు–2026పై ట్రంప్ సంతకం చేశారు. దీంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. తద్వారా రష్యా నుండి చమురు,సహజవాయువు దిగుమతులు చేసుకునే భారత్–చైనా సహా సంబంధిత దేశాలపై 100 కు 100 శాతం సుంకాలు విధించేందుకు విశేషాధికారాలు సంక్రమిస్తాయి.

**ప్రస్తుత పరిస్థితి:** భారత్ నుండి అమెరికాకు ఎగుమతి చేసే సరుకులపై సెక్షన్ 301 కింద 10 శాతం సుంకాలు వర్తిస్తాయి. ఐతే కొన్ని వస్తువులకు దీని నుండి మినహాయింపు ఉంటుంది. దీంతోపాటు విభాగాల వారీగా చూస్తే, ఉక్కు,అల్యూమినియం వంటి ఎగుమతులపై 50 శాతం సుంకాలు వర్తిస్తాయి. ఆటో విడిభాగాలపై 25 శాతం సుంకాలు వర్తిస్తాయి. కానీ స్మార్ట్‌ఫోన్లు, ఔషధాలు,ఇంధన ఉత్పత్తులకు వీటి నుండి మినహాయింపు ఉంటుంది.

**అదనపు లేదా పరస్పర సుంకాలు:**

ఉదాహరణకు ఒక చొక్కాను భారత్ నుండి ఎగుమతి చేసి అమెరికాలో విక్రయిస్తే, ఐదూశాతం ఎంఎఎన్ఎఫ్ సుంకం వర్తిస్తుంది. దీంతోపాటుగా 301 నిబంధన కింద మరో 10 శాతం సుంకం వర్తిస్తుంది. ఈ మొత్తం కలిసి ఆ చొక్కాపై 15 శాతం సుంకం వసూలు చేస్తారు.

## సిఫార్సు

మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం హోం శాఖ దానిని పరిశీలిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇడి సిఫార్సు ఆధారంగా కేసు నమోదు చేయాలని అడ్వకేట్ జనరల్ సూచించారన్న వార్తలపై ప్రశ్నించగా, శుక్రవారం కార్యాలయం నుండి బయటకు వచ్చిన తర్వాతే ఆ పత్రం తనకు అందిందని, కాబట్టి తాను ఆ అభిప్రాయాన్ని ఇంకా చూడలేదని చెన్నితల చెప్పారు. న్యూఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని కలిసినప్పుడు ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఈ కేసు గురించి చర్చిస్తారా అని అడిగినప్పుడు, అటువంటి చర్చ అవసరం లేదని చెన్నితల చెప్పారు. ఇడి చర్య సిపిఐ(ఎం)ను లక్ష్యంగా చేసుకుని, ముఖ్యంగా విజయన్‌ను దెబ్బతీసే ఉద్దేశంతో జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఆరోపించారు. 'ఈ దాడి ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు అయిన కామ్రేడ్ పినరయి విజయన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు మీకు అనిపించవచ్చు. కానీ వాస్తవానికి ఇది సిపిఐ(ఎం) లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడి అని బేబీ అన్నారు. కేరళంలో తమ ఉనికిని చాటుకునేందుకు బిజెపి నాయకత్వం ఇప్పుడు ఆ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని, ఇందుకోసం కాంగ్రెస్, యుడిఎఫ్ మద్దతు, సహకారాన్ని పొందుతుందని ఆయన ఆరోపించారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లలో బిజెపి అధి కారంలోకి రావడాన్ని ప్రస్తావించిన బేబీ, స్థానిక కాంగ్రెస్ విభాగాల సహాయంతోనే అది సాధ్యమైందని ఆరోపిం చారు.







## రెవెన్యూ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

పోల్చి చూశారు. 325 సర్వే నంబర్‌లో భూమి కలిగి ఉన్న రైతుల పేర్లు, సర్వే వివరాలను సేకరించారు. మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి, శివారువెంకటాపూర్, వరదరాజ్‌పూర్ గ్రామాల సరిహద్దులను కూడా గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే పనులు చివరి దశకు చేరుకోవడంతో అధికారులు సర్వే నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఆ తర్వాతే 388 ఎకరాల అసైన్డ్ భూమి లెక్క తేలుతుందని అధికారులు తెలియజేశారు. 325 సర్వే నంబర్లో ఉన్న రైతులకు నోటీసులు జారీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నోటీసులు అందిన తర్వాతే ఎవరి అధీనంలో ఎంత అసైన్డ్ భూమి ఉందనేది తేలుతుంది. కాగా 388 ఎకరాలను గతంలో పేద రైతులకు అసైన్డ్ పట్టాలు ఇచ్చినట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. అయితే మాజీ సిఎం కెసిఆర్ పాలనలో తమ భూముల్లోనే పాండురంగ చెరువును ఏర్పాటు చేయడంతో దానిలో సుమారు 50 ఎకరాల వరకు భూములు కోల్పోయినట్లు తెలిపారు. మిగిలిన భూములను చదును చేసుకొని సాగు చేసుకుంటున్నామని రైతులు పేర్కొంటుండగా, గత పాత భూరికార్డులో తమ పేర్లు ఉన్నప్పటికీ ధరణిలో తమ పేరు రాకపోవడంతో తమకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదని వాపోయారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com